www.andhrajyothy.com
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 146
శనివారం | 23-8-2025 | వెల (Price) : Rs. 6.50 |
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య ఉ.11:36 తదుపరి పాడ్యమి; నక్షత్రం: మఖ రా.12:55 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ.12:36-2:14; దుర్ముహూర్తం: ఉ.6:03-7:43; అమృతఘడియలు: రా.10:27-12:05; రాహుకాలం: ఉ.9:00-10:30; సూర్యోదయం: 6:03; సూర్యాస్తమయం: 6:32
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా మరోసారి

కూనంనేని ఎన్నిక

వరుసగా రెండోసారి బాధ్యతలు

101 మందితో నూతన కార్యవర్గం

12

బీసీ బిల్లులపై సుప్రీంకోర్టుకు?

5 నెలలుగా రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లులు

రాష్ట్రాలు పంపిన బిల్లులపై రాష్ట్రపతి 90 రోజుల్లో తేల్చాల్సిందేనని గతంలో సుప్రీంకోర్టు స్పష్టీకరణ

బీసీ బిల్లులకూ ఇది వర్తిస్తుందని సర్కారు యోచన

సుప్రీంకు వెళ్తే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు హైకోర్టును మరింత గడువు కోరే అవకాశం

నేడు టీపీసీసీ పీఏసీ సమావేశంలో చర్చ

25న క్యాబినెట్.. 42% పై ప్రభుత్వపర నిర్ణయం



హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బీసీ రిజర్వేషన్ బిల్లులపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వ బిల్లులను ఆమోదం కోసం రాష్ట్రపతి/గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వాలు పంపినప్పుడు.. వాటిపై 90 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ ఇటీవల సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ యోచన చేస్తోంది. విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ మార్చి 17న తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులూ రాష్ట్రపతి వద్దకు చేరిన సంగతి తెలిసిందే. అయితే ఐదు నెలలుగా రాష్ట్రపతి వద్దనే ఆ రెండు బిల్లులూ పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రాలు పంపిన బిల్లులపైన 90 రోజుల్లోగా రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన రూలింగ్ బీసీ రిజర్వేషన్ బిల్లులకూ వర్తిస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళితే.. ఈ కారణం చూపి పంచాయతీ ఎన్నికల నిర్వహణకు హైకోర్టును మరికొంత గడువును ప్రభుత్వం కోరే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. అలాగే.. అసెంబ్లీలో బీసీ బిల్లులపై తీర్మానం పెట్టి.. ఆమోదించాలని, దాని ఆధారంగా జీవో తీసుకురావాలన్న ప్రతిపాదనపైనా చర్చ జరుగుతోంది. దీంతోపాటు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ పరంగా నిర్ణయించి.. ఇతర పార్టీలనూ ఈ మేరకు రిజర్వేషన్

మిగతా 13వ పేజీలో...



జైలు నుంచి పాలన కుదరదు

50 గంటలు జైల్లో ఉంటే ప్రభుత్వ ఉద్యోగి ఉద్యోగాన్నే కోల్పోతాడు

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులకు ఈ రూల్ వర్తించదా?

వారు జైల్లో ఉన్నా ప్రభుత్వంలో కొనసాగుతున్నారు

నాయకులే ఇలా ఉంటే.. అవినీతిపై పోరాడేదెలా?

కాంగ్రెస్ పాలనలో అవినీతిపై పెద్ద చిట్టానే ఉంది

బిహార్‌లో ఆర్జేడీ పాలన 'లాంతరు యుగం'

బెంగాల్ అభివృద్ధికి తృణమూలే అడ్డంకి: మోదీ

బిహార్, పశ్చిమ బెంగాల్‌లలో వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

న్యూఢిల్లీ, ఆగస్టు 22: తీవ్ర నేరారోపణలతో అరెస్టయిన వ్యక్తులు జైలు నుంచి పాలన సాగించడం ఇకపై కుదరదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 30 రోజులకు పైగా జైలులో ఉన్న పీఎం, సీఎం, కేంద్ర, రాష్ట్రాల మంత్రులు 31వ రోజున ఆటోమేటిగ్గా పదవిని కోల్పోయేలా తీసుకొచ్చిన బిల్లులను ఆయన సమర్థించారు. "50 గంటల పాటు జైలు శిక్ష అనుభవించిన ఒక ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతాడు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి, మంత్రులకు ఈ నిబంధన ఎందుకు వర్తించదు? వారు జైల్లో ఉన్నా కూడా ప్రభుత్వంలో కొనసాగుతున్నారు. కొంతకాలం క్రితం కొందరు నేతలు జైళ్ల నుంచే ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడం మనం చూశాం. నాయకులే ఇలా ఉంటే... ఇక అవినీతిపై ఎలా పోరాడగలం" అని ప్రధాని ప్రశ్నించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఆయన శుక్రవారం పర్యటించారు. గయ జీలో విద్యుత్తు,

మిగతా 2వ పేజీలో...

2

సుదర్శన్‌రెడ్డి నక్సల్స్ మద్దతుదారు!

అందుకే సల్వాజుడుంను నిషేధిస్తూ తీర్పునిచ్చారు

ఆ తీర్పు రాకపోతే ఐదేళ్ల కిందే నక్సలిజం అంతమయ్యేది

వామపక్షాల ఒత్తిడితోనే ఆయనను కాంగ్రెస్.. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టింది



కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్ర ఆరోపణలు

నైతిక విలువల కోసమే పీఎం, సీఎం 'పదవీచ్యుతి' బిల్లులు తీసుకొచ్చామని వెల్లడి



మీది అనవసర ఆందోళన

అసెంబ్లీలో చర్చించిన తర్వాతే తదుపరి చర్యలని ప్రభుత్వం చెబుతోంది

విచారణ సంఘం నివేదికను సభలో పెట్టి చర్చించవచ్చని చట్టంలో ఉంది

ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై హైకోర్టు స్పష్టీకరణ

నివేదికను నెట్‌లో పెట్టి ఉంటే తొలగించాలని సర్కారుకు ఆదేశం

కౌంటర్ దాఖలుకు 5 వారాల గడువు.. తదుపరి విచారణ 7వ తేదీకి..

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం నియమించిన పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను కొట్టేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్ వేసిన పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. ఆ నివేదిక ఆధారంగా ఇప్పటికిప్పుడు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పిటిషనర్లు అనవసరంగా ఆందోళన చెందుతున్నారని వ్యాఖ్యానించింది. నివేదికను శాసనసభలో పెట్టి.. చర్చించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చాలా

మిగతా 12వ పేజీలో...

కాళేశ్వరంపై అసెంబ్లీలోనే

తేల్చుకుందాం!

'నివేదిక'పై హైకోర్టు తీర్పుతో బీఆర్ఎస్ నిర్ణయం

ఫాంహౌస్‌లో కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్, ప్రశాంత్‌రెడ్డి సమావేశం

12

ఇచ్చంపల్లికి షరతులతో ఓకే

200 టీఎంసీల వరద జలాల వినియోగానికి అవకాశమివ్వాలి

గోదావరి-కావేరి వాటాను ఎక్కడైనా వాడుకునే స్వేచ్ఛ

2 రిజర్వాయర్లను కేంద్రమే కట్టాలి

968 టీఎంసీలతో చేపట్టే ప్రాజెక్టులకు అనుమతులివ్వాలి

కేంద్రానికి తేల్చిచెప్పిన తెలంగాణ

జలసౌధలో సమావేశమైన ఎన్‌డబ్ల్యూడీఏ కమిటీ

పోలవరం నుంచే గోదావరి-కావేరి అనుసంధానం: ఏపీ

రాష్ట్రాలు పెద్దమనసుతో అంగీకరించాలి: ఎన్‌డబ్ల్యూడీఏ



ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశానికి హాజరైన రాహుల్ బొజ్జా

హైదరాబాద్/అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానం(జీసీ లింక్)లో భాగంగా ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ కట్టి, నీటిని తరలించడానికి తెలంగాణ రాష్ట్రం షరతులతో అంగీకారం తెలిపింది. ఇచ్చంపల్లిలో రిజర్వాయర్ కడితే దాని దిగువన ఉన్న సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం)పై ఏ ప్రభావం పడదని అధ్యయనాల్లో తేలిన తర్వాత ముందుకెళ్లాలని పేర్కొంది. ఇక గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (దేవాదుల ఎత్తిపోతల పథకం) కింద 38 టీఎంసీలు, సీతారామ ఎత్తిపోతల

మిగతా 3వ పేజీలో...

రామగుండం నడిస్తేనే 'యూరియా' పరిష్కారం

14

నేడు సచివాలయానికి రావాలని ఫ్యాక్టరీ ఎండీకి పిలుపు

కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలతో తుమ్మల చర్చలు

10 రోజులుగా కర్మాగారం నడవకపోవటంతో సరఫరాపై ప్రభావం

మరమ్మతులు పూర్తయి, ఉత్పత్తి మొదలవ్వడానికి మరో 10 రోజులు



సురవరం ఇక లేరు

సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి కన్నుమూత

అనారోగ్యంతో హైదరాబాద్‌లో తుదిశ్వాస

ప్రజల సందర్శనార్థం ఆదివారం ఉదయం మగ్దూంభవన్‌కు సుధాకర్ రెడ్డి భౌతికకాయం

వైద్య పరిశోధనల కోసం గాంధీ ఆస్పత్రికి ఆయన పార్థివ దేహం.. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి నేత్రదానం

ఏఐఎస్ఎఫ్ సభ్యుడి నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి దాకా ఎదిగిన కమ్యూనిస్ట్ దిగ్గజం

10

గొప్ప నేతను కోల్పోయాం

దేశ రాజకీయాల్లో సురవరం ముద్ర

సీఎం రేవంత్

పీడిత వర్గాల కోసం కడవరకు పనిచేశారు

బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్

అక్రమ కేబుళ్లన్నీ తొలగించండి

అనుమతి ఉన్నవాటిని కూడా ప్రమాదకరంగా ఉంటే తీసేయండి

ప్రాణనష్టం జరగకుండా చేపట్టే చర్యల వివరాలు సమర్పించండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

పుట్టినరోజున తండ్రి చితికి నిప్పుపెట్టాల్సి వచ్చిన బాలుడిని ఎవరు ఓదారుస్తారు?

'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రస్తావిస్తూ.. అధికారులను నిలదీసిన జస్టిస్ నగేశ్ భీమపాక

అనుమతిలేని కేబుళ్ల తొలగింపునకు సిద్ధమైన ఎస్పీడీసీఎల్

కేబుళ్ల తొలగింపుతో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం



జస్టిస్ నగేశ్ భీమపాక

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి సందర్భంగా ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు మృతి చెందిన ఘటనపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆ మరణాలకు బాధ్యత తమది కాదంటే తమది కాదంటూ అంతా ఇతరులపై నెపం నెట్టేస్తున్నారని, ఇది సిగ్గుపడాల్సిన విషయమని వ్యాఖ్యానించింది. తొమ్మిదేళ్ల బాలుడు తన పుట్టినరోజునే

మిగతా 10వ పేజీలో...



హత్యకు గురైన బాలిక సహస్ర (ఫైల్)

చోరీ కోసం వచ్చి.. పట్టుబడొద్దని చంపేసి!

కూకట్‌పల్లిలో బాలికను హత్య చేసింది.. పక్క అపార్ట్‌మెంట్‌లోని బాలుడే

ఇంట్లో ఎవరూ లేరనే అంచనాతో చోరీకి ప్లాన్.. గుర్తించి అడ్డుకున్న సహస్ర

అందరికీ చెప్తుందేమోనన్న భయంతో కత్తితో పొడిచి పరారైన బాలుడు

అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించడంతో అంగీకారం!

తాగుబోతు తండ్రి, ఆర్థిక ఇబ్బందులతో చోరీకి యత్నించిన నిందితుడు

హైదరాబాద్ సిటీ/కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఆరో తరగతి బాలిక సహస్ర (12) దారుణ హత్య మిస్టరీ వీడింది. పక్కన ఉన్న అపార్ట్‌మెంట్‌లోని పదో తరగతి బాలుడే ఆమెను హత్య చేసినట్టు తేలింది. చోరీ కోసం ఇంట్లోకి చొరబడిన ఆ బాలుడిని సహస్ర గుర్తించి అడ్డుకోవడంతో.. విషయం ఎక్కడ బయటపడుతుందోనని ఆమెను

మిగతా 13వ పేజీలో...

ఐదుగురు ఎమ్మెల్యేలకు

స్పీకర్ నోటీసులు!

- త్వరలోనే మరో ఐదుగురికీ ఇచ్చే అవకాశం
- బీఆర్ఎస్ ఫిర్యాదుపై వివరణ ఇవ్వాలని ఆదేశం
- సుప్రీంకోర్టు తీర్పు మేరకు విచారణ దిశగా అడుగులు
- ఎమ్మెల్యేలపై చర్యలుంటాయా? పెండింగా?.. ఉత్కంఠ



హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఉపక్రమించారు. బీఆర్ఎస్ ఫిర్యాదు దృష్ట్యా విచారణకు హాజరై, వివరణ ఇవ్వాలని ఐదుగురు ఎమ్మెల్యేలకు ఆయన నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులను సిద్ధం చేస్తుండగా, వారికీ త్వరలోనే

మిగతా 12వ పేజీలో...

ఆధార్‌కార్డును అంగీకరించాల్సిందే

బిహార్‌లో ఎస్ఐఆర్‌పై ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం

2

అమెరికాలో 5.5 కోట్ల మంది

విదేశీయుల వీసాల పరిశీలన

నిబంధనలు అతిక్రమిస్తే దేశ బహిష్కరణే

2

అవి ఆత్మహత్యలే!

మియాపూర్‌లో కుటుంబం మరణంపై వీడిన మిస్టరీ

అన్నంలో విషం కలుపుకొని మృతి

పోస్టుమార్టం నివేదిక ద్వారా వెల్లడి

ఆర్థిక ఇబ్బందులే కారణం!

14

1623 పోస్టులు

సివిల్ అసిస్టెంట్ సర్జన్ల భర్తీకి నోటిఫికేషన్

ప్రభుత్వాస్పత్రుల్లో తీరనున్న స్పెషలిస్టుల కొరత

13



జీఎస్‌బీ సేవామండల్ ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం

వినాయక మండపానికి రూ.474కోట్ల బీమా

» ముంబైలోని సియాన్ ప్రాంతంలో మండపం

ముంబై, ఆగస్టు 22: గణపతి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ముంబైలో జీఎస్‌బీ సేవా మండల్ ఏర్పాటు చేసిన వినాయక మండపానికి ఏకంగా రూ.474.46కోట్ల బీమా చేయించారు. సియాన్ ప్రాంతంలోని కింగ్స్ సర్కిల్‌లో ఈ వినాయక మండపాన్ని నిర్మించారు. ఇక్కడి వినాయకుడిని 69కిలోల బంగారం, 336కిలోల వెండి ఆభరణాలతో పాటు భక్తులు సమర్పించిన ఖరీదైన వస్తువులతో అలంకరించారు. అందుకే ఇంత భారీ మొత్తంలో బీమా చేయించారు. ఇందులో రూ.67కోట్లు ఆభరణాలకు, రూ.375కోట్లు పూజారులు, మండప సిబ్బందికి ప్రమాద బీమా కింద, రూ.30కోట్లు మండపం, తదితర ఏర్పాట్లకు సంబంధించిన నిర్మాణాలకు ఇన్సూరెన్స్ చేయించారు. కింగ్స్ సర్కిల్‌లో 71ఏళ్లుగా వినాయక మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది కూడా ఈ మండపానికి రూ.400.58కోట్ల బీమా తీసుకున్నారు.

మూతపడ్డ ఆన్‌లైన్ మనీ గేమింగ్ యాప్స్

న్యూఢిల్లీ, ఆగస్టు 22: డ్రీమ్11, మై11సర్కిల్, విన్‌జో, జూపీ, పోకర్‌బాజీ వంటి పలు ప్రముఖ సంస్థలు తమ ఆన్‌లైన్ మనీ గేమింగ్ సర్వీసులను నిలిపివేశాయి. దీనికి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలూ ఇవ్వకుండానే వాటిని నిలిపివేయడం గమనార్హం. నిజమైన డబ్బుతో ఆడే అన్ని రకాల గేమింగ్ సేవలనూ తమ ప్లాట్‌ఫామ్‌పై నిలిపివేసినట్టు.. మై11సర్కిల్ ఆన్‌లైన్ ఫాంటసీ గేమును నిర్వహించే 'ప్లేగేమ్స్ 24/7 ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ సోషల్ మీడియా పోస్టు ద్వారా వెల్లడించింది. దిగ్గజ క్రికెటర్లు ధోనీ, రోహిత్ శర్మ, బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్ వంటివారు ప్రమోట్ చేసిన డ్రీమ్11 సేవలను కూడా 'ద ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్, 2025' ఆమోదం పొందిన నేపథ్యంలో నిలిపివేసినట్టు ఆ సంస్థ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. తమ యాప్‌లో ఉన్న వినియోగదారుల సొమ్ము సురక్షితంగా ఉందని, యూజర్లు తమ సొమ్మును ఉపసంహరించుకోవచ్చని పోకర్‌బాజీ సంస్థ 'ఎక్స్' పోస్టు ద్వారా తెలిపింది.

'గేమింగ్ బిల్లు'కు రాష్ట్రపతి ముర్ము ఆమోదం

ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లను నిషేధిస్తూ కేంద్రం రూపొందించిన 'గేమింగ్ బిల్లు'కు రాష్ట్రపతి ముర్ము శుక్రవారం ఆమోదం తెలిపారు. దీంతో, ఈ బిల్లు చట్టంగా మారింది. ఈ చట్టం ప్రకారం.. నిషేధం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నిర్వహిస్తే నిర్వాహకులకు 3సంవత్సరాల జైలు, రూ.కోటి జరిమానా విధించనున్నారు. యాప్‌ల కోసం ప్రచారం చేసేవాళ్లకు కూడా రెండేళ్ల జైలు, రూ.50లక్షల జరిమానా విధిస్తారు. మరోవైపు, ఆదాయ పన్ను(ఐటీ) చట్టం-1961కి సవరణలు చేస్తూ రూపొందించిన బిల్లును కూడా రాష్ట్రపతి శుక్రవారం ఆమోదించారు. ఇది వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి రానుంది.

20 ఏళ్లు దాటిన వాహనాల రిజిస్ట్రేషన్ రెన్యూవల్ ఫీజు పెంపు

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఇరవై ఏళ్లు దాటిన పాత మోటార్ వాహనాల వాడకాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా కేంద్ర రోడ్డు, రవాణా మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇలాంటి వాహనాల రిజిస్ట్రేషన్ రెన్యూవల్ ఫీజును భారీగా పెంచింది. ఈమేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం 20 ఏళ్లు దాటిన లైట్ మోటార్ వాహనాల (ఎల్ఎంవీ) రెన్యూవల్ ఫీజును రూ.5వేల నుంచి రూ.10వేలు చేశారు. 20 ఏళ్లు దాటిన మోటార్‌సైకిళ్ల రెన్యూవల్ ఫీజు రూ.వెయ్యి నుంచి రూ.2వేలకు పెంచారు. ఇక త్రీవీలర్లు, క్వాడ్రీసైకిళ్ల రెన్యూవల్ ఫీజును రూ.3,500 నుంచి రూ.5వేలకు పెంచారు. కాగా ఇంతకు ముందు మంత్రిత్వ శాఖ 2021 అక్టోబరులో మోటార్ సైకిళ్లు, టూ-త్రీవీలర్లు, కార్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్, రెన్యూవల్ ఫీజును పెంచింది.

భారత్‌లోకి మళ్లీ 'టిక్‌టాక్'?

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ప్రముఖ షార్ట్ వీడియో యాప్ 'టిక్‌టాక్' సేవలు మళ్లీ భారత్‌లో అమల్లోకి రాబోతున్నాయంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇందుకు కారణం ఐదేళ్లుగా కనిపించని టిక్‌టాక్ వెబ్‌సైట్ భారత్‌లో మొదటిసారి అనేక మందికి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రావడమే.. ఈ విషయాన్ని కొందరు సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో పలు ఊహాగానాలకు దారితీసింది. ఏదేమైనా ప్లే స్టోర్‌లో ఇప్పటివరకు ఈ యాప్ అందుబాటులోకి రాలేదు. అలాగే టిక్‌టాక్ సేవలను భారత్‌లో తిరిగి ప్రారంభించే విషయమై మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ కంపెనీ కూడా ఏ ప్రకటన చేయలేదు. 2020 జూన్‌లో సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతా పరమైన కారణాలతో టిక్‌టాక్‌తో పాటు చైనాకు చెందిన 58 యాప్‌లపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే.

ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్త లార్డ్ స్వరాజ్‌పాల్ కన్నుమూత



లండన్, న్యూఢిల్లీ, ఆగస్టు 22: ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్త లార్డ్ స్వరాజ్‌పాల్ లండన్‌లో గురువారం సాయంత్రం మృతి చెందారు. ఆయన వయస్సు 94 ఏళ్లు. కపారో గ్రూప్ పేరిట యూకేలో పలు పరిశ్రమలు స్థాపించిన ఆయన ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలోనే కన్ను మూశారు. భారత్‌లోని జలంధర్‌లో జన్మించిన ఆయన 1960లో తన కుమార్తె అంబిక క్యాన్సర్ చికిత్స కోసం యూకే చేరుకున్నారు. కాలక్రమంలో యూకే ఎగువ సభ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో సభ్యుడయ్యారు. నాలుగేళ్ల వయస్సులోనే తన కుమార్తె అంబిక క్యాన్సర్‌తో మృతి చెందడంతో అంబికాపాల్ ఫౌండేషన్, చారిటబుల్ ట్రస్ట్‌ని స్థాపించారు. దీని ద్వారా బాలల ఆరోగ్యం, విద్య కోసం ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల డాలర్లు దానం చేశారు. 2015లో తన కుమారుడు అంగద్‌పాల్, 2022లో ఆయన భార్య అరుణ మృతి చెందగా వారి జ్ఞాపకార్థం ఇదేవిధంగా పలు దాన కార్యక్రమాలు చేపట్టారు.

ఉపరాష్ట్రపతి అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన పూర్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 22: వచ్చే నెల 9న జరగబోయే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్షాల అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డి పరస్పరం తలపడబోతున్నారు. వీరిద్దరు సమర్పించిన 4 సెట్ల నామినేషన్ పత్రాలు సవ్యంగా ఉన్నాయని పరిశీలన అనంతరం రిటర్నింగ్ ఆఫీసర్ ప్రకటించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. తమిళనాడు బీజేపీకి చెందిన సీపీ రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా కొనసాగుతున్నారు. తెలంగాణకు చెందిన బి.సుదర్శన్ రెడ్డి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి. సంఖ్యాబలం ఎన్డీయేకు అనుకూలంగా ఉంది.



అంతరిక్షంలో 2035 నాటికి భారత్ సొంతంగా ఏర్పాటు చేయనున్న భారతీయ అంతరిక్ష్ స్టేషన్ నమూనాను ఇస్రో ఆవిష్కరించింది. ఢిల్లీలోని భారత మండపంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాల వేళ దీన్ని ఆవిష్కరించారు. తొలి మాడ్యూల్‌ను 2028 నాటికి భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో ప్రవేశపెడతారు. అంతరిక్షంలో ప్రస్తుతం ఉన్న రెండు స్టేషన్లలో ఒకటి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం కాగా మరొకటి చైనా సొంతంగా నిర్మించుకున్న తియాంగాంగ్ స్పేస్ స్టేషన్.

సుదర్శన్‌రెడ్డి నక్సల్స్ మద్దతుదారు



తిరునల్వేలి సభలో ప్రసంగిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

అందుకనే సల్వాజుడుంను నిషేధిస్తూ తీర్పునిచ్చారు

» ఆ తీర్పు ఇవ్వకపోతే ఐదేళ్ల కిందటే నక్సలిజం అంతమైపోయేది: అమిత్ షా

కొచ్చి, ఆగస్టు 22: విపక్ష కూటమి ఇండియా ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి 'నక్సలిజం మద్దతుదారు' అంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర ఆరోపణలు చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో ఒకప్పుడు నక్సలైట్లపై పోరాటానికి నడుంకట్టిన సల్వాజుడుంను నిషేధిస్తూ 2011లో ఆయన ఇచ్చిన తీర్పే దీనికి నిదర్శనమన్నారు. సల్వాజుడుంను నిషేధించకపోతే నక్సలిజం 2020 నాటికే పూర్తిగా తుడిచిపెట్టుకుపోయేదని చెప్పారు. కేరళకు చెందిన ప్రముఖ మీడియాసంస్థ 'మలయాళ మనోరమ' శుక్రవారం కొచిలో ఏర్పాటు చేసిన ఒక సదస్సులో మాట్లాడుతూ అమిత్‌షా ఈ వ్యాఖ్యలు చేశారు. నక్సలిజం భావజాలానికి ప్రేరేపితులైనందువల్లే సుదర్శన్‌రెడ్డి.. సల్వాజుడుంకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారన్నారు. నక్సలిజానికి మద్దతివ్వటానికి ఆయన సుప్రీంకోర్టు వంటి అత్యున్నత సంస్థను ఉపయోగించుకున్నారని ఆరోపించారు. వామపక్షాల ఒత్తిడితోనే కాంగ్రెస్ పార్టీ సుదర్శన్‌రెడ్డిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టిందని విమర్శించారు. నక్సలిజం సమస్యతో కేరళ కూడా ఒకప్పుడు సతమతమైందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశాలు లేవని అమిత్‌షా పేర్కొన్నారు. జైలుపాలైన ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవుల నుంచి తొలగించేందుకు ఉద్దేశించి తాజాగా తీసుకొచ్చిన మూడు బిల్లులను అమిత్‌షా ప్రస్తావించారు. ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ గతంలో జైలులో ఉన్నప్పటికీ సీఎం పదవికి రాజీనామా చేయని విషయాన్ని పరోక్షంగా పేర్కొంటూ.. 'జైలు నుంచే ఒక సీఎం ప్రభుత్వాన్ని నడిపించారు. అటువంటప్పుడు, ఈ బిల్లులు తీసుకురావాలా? వద్దా?' అని ప్రశ్నించారు. బిల్లులపై ప్రతిపక్షాల నిరసనను, రాజ్యాంగంలో ఇది లేదన్న వారి వాదనను ఖండించారు. 'ఇది నైతిక విలువలకు సంబంధించిన విషయం. ముఖ్యమంత్రి జైలు పాలైనప్పటికీ.. రాజీనామా చేయకుండా ఉంటారని మన రాజ్యాంగ రూపకర్తలు ఊహించి ఉండరు. అందుకనే ఇప్పుడు కొత్తగా రాజ్యాంగానికి సవరణ చేస్తున్నాం' అని అమిత్‌షా వివరించారు.

సల్వాజుడుం నిషేధం వెనుక నేపథ్యం

2005లో ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో సల్వాజుడుం (శాంతియాత్ర అని అర్థం) అనే సాయుధ గ్రూపు ఏర్పాటైంది. కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి మహేంద్ర కర్మ దీని ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. సల్వాజుడుం కింద ఆదివాసీ యువతకు సాయుధ శిక్షణ ఇచ్చి, నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో ఉపయోగించేవారు. అయితే, సల్వాజుడుం సభ్యులు ఆదివాసీలను ఊచకోత కోస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. సల్వాజుడుంను నిషేధించాలన్న పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. విచారించిన కోర్టు 2011 డిసెంబరులో సల్వాజుడుంను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది.

రాహుల్ పీఎం కాలేడు.. ఉదయనిధి సీఎం కాబోడు!

చెన్నై, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో ఉన్న ప్రధాన పార్టీల నేతలంతా వారి వారసులకు పట్టం కట్టాలనే లక్ష్యం పెట్టుకున్నారని అమిత్‌షా అన్నారు. ప్రజల మేలు వారికి అవసరం లేదని విమర్శించారు. తమిళనాడు సీఎం, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఏకైక లక్ష్యం.. తన కుమారుడు ఉదయనిధిని సీఎం చేయడమేనని, సోనియాగాంధీ ప్రధాన లక్ష్యం తనయుడు రాహుల్ గాంధీని పీఎం సీటులో కూర్చోబెట్టడమేనని అన్నారు. ఈ మేరకు తమిళనాడులోని తిరునల్వేలిలో శుక్రవారం జరిగిన బీజేపీ బూత్ కమిటీ నిర్వాహకుల సమావేశంలో షా మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉదయనిధి సీఎం కాలేడని, రాహుల్ ప్రధాని కాబోడని వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో ఇటీవల ప్రధాని, మంత్రులు, ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు తీవ్ర నేరారోపణలతో అరెస్టయితే పదవి నుంచి తొలగించేందుకు వీలుకల్పించే బిల్లును ప్రవేశపెట్టామని తెలిపారు. ఈ బిల్లును ప్రతిపక్షాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయని, దీనికి కారణం ప్రతిపక్ష పార్టీల్లో అత్యధిక శాతం మంది అవినీతి పరులేనన్నారు. ఈ బిల్లును తమిళనాడు సీఎం స్టాలిన్ నల్లచట్టంగా పేర్కొనటం విడ్డూరంగా ఉందన్నారు.

జైలు నుంచి పాలన కుదరదు

(మొదటి పేజీ తరువాయి)

రోడ్డు, ఆరోగ్యం, పట్టణాభివృద్ధి, నీటి సరఫరా రంగాల్లో రూ.13 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మోదీ ప్రసంగించారు. ఆర్జేడీ పాలనను లాంతరు యుగంగా అభివర్ణించారు. రాష్ట్రాన్ని అంధకారం, అశాంతి, వెనుకబాటుతనంలోకి నెట్టేశారని ఆరోపించారు. బిహార్ ప్రజలను ఓటు బ్యాంకుగానే పరిగణించి, వారి ఆకాంక్షలు, గౌరవం, అభివృద్ధిని విస్మరించారని ధ్వజమెత్తారు. ఎన్డీయే ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మూడు బిల్లులను వ్యతిరేకిస్తున్న విపక్షాలపై మోదీ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఒక్క అవినీతి కేసును కూడా ఎదుర్కోలేదని, అయితే 60-65 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో వారి అవినీతికి సంబంధించిన పెద్ద చిట్టానే ఉందని ఎద్దేవా చేశారు. అందుకే ఈ బిల్లులను వారు వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లోని మమత ప్రభుత్వంపైనా ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి టీఎంసీని శత్రువుగా అభివర్ణించారు. మహిళలు, పేదల సంక్షేమం కోసం కేంద్రం పంపిన నిధులను పార్టీ కేడర్ కోసం వినియోగిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం కోల్‌కతాలో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. పశ్చిమ బెంగాల్ అభివృద్ధి చెందేవరకూ వికసిత్ భారత్ యాత్ర విజయవంతం కాదన్నారు. టీఎంసీ అధికారంలో ఉన్నంత వరకూ రాష్ట్రంలో అభివృద్ధి అనే మాట ఉండదన్నారు. అధికార దాహంతో ఉన్న టీఎంసీ, కాంగ్రెస్ పార్టీలు అక్రమ చొరబాట్లను ప్రోత్సహిస్తున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ ప్రయోజనాలు దక్కాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని మోదీ స్పష్టం చేశారు. అంతకు ముందు కోల్‌కతాలో మూడు కీలక మెట్రో రైల్వే స్టేషన్లు సహా రూ.5,200 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. అలాగే హౌరా-కోల్‌కతా మధ్య కనెక్టివిటీని పెంచనున్న రూ.1,200కోట్లకు పైగా విలువైన 7.2కిలోమీటర్ల ఎలివేటెడ్ కోనా ఎక్స్‌ప్రెస్‌వేకు ప్రధాని శంకుస్థాపన చేశారు.



కోల్‌కతాలో మెట్రోలో విద్యార్థులతో ప్రధాని మోదీ

లోకం తీరు



12 మంది సీఎంలపై క్రిమినల్ కేసులు

» సీఎం రేవంత్‌రెడ్డిపై 89 కేసులు

» స్టాలిన్‌పై 47.. చంద్రబాబుపై 19

» ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా వెల్లడించిన ఏడీఆర్

న్యూఢిల్లీ, ఆగస్టు 22: దేశంలోని 30 మంది ముఖ్యమంత్రుల్లో 12 మంది తమపై క్రిమినల్ కేసులున్నాయని ప్రకటించారు. దీనికి సంబంధించి అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. తనపై 89 కేసులున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ తనపై 47 కేసులున్నాయని తెలపగా, ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు తనపై 19 కేసులున్నాయని ప్రకటించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనపై 13 కేసులున్నాయని తెలపగా, తనపై 5 కేసులున్నాయని జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్ ప్రకటించారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌పై 4, హిమాచల్ ప్రదేశ్ సుఖ్వీందర్ సింగ్‌పై 4, కేరళ సీఎం పినరాయి విజయన్‌పై 2, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌పై ఒక క్రిమినల్ కేసు ఉన్నట్టు ప్రకటించారు. కనీసం 10 మంది సీఎంలు తమపై హత్యాయత్నం, కిడ్నాపింగ్, లంచాలకు సంబంధించిన అత్యంత తీవ్రమైన నేరారోపణలు ఉన్నట్టు ప్రకటించారు. కనీసం ఐదేళ్ల శిక్షపడే కేసుల్లో అరెస్టై 30 రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజు ప్రధానినైనా, ముఖ్యమంత్రినైనా, మంత్రులనైనా పదవుల్లోంచి తొలగించే బిల్లును కేంద్రం తీసుకొచ్చిన నేపథ్యంలో ఈ కేసుల వివరాలు బయటకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల సందర్భంగా ఆయా ముఖ్యమంత్రులు ప్రకటించిన అఫిడవిట్‌ల ఆధారంగా ఏడీఆర్ ఈ వివరాలు సేకరించింది.

ఆధార్‌కార్డును అంగీకరించాల్సిందే

» బిహార్‌లో ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పు కోసం పరిగణనలోకి తీసుకోవాల్సిందే

» ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా జాబితాలో పేర్లను కోల్పోయిన వారిలో ఎవరైనా తమ ఆధార్ కార్డును చూపించి తిరిగి ఓటరుగా నమోదు కావచ్చునని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇప్పటికే పేర్కొన్న 11 డాక్యుమెంట్లతో పాటు ప్రజలను ఓటరు జాబితాలో చేర్చేందుకు ఆధార్ కార్డును పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని శుక్రవారం ఆదేశించింది. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు శుక్రవారం వాదనలను కొనసాగించింది. కొత్త ఓటర్ల జాబితాపై తమ అభ్యంతరాలను ఓటర్లు, బూత్ స్థాయి ఏజెంట్లు(బీఎల్ఏ) ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చని సూచించింది. వ్యక్తిగతంగా బూత్ లెవల్ ఆఫీసర్ల(బీఎల్‌వో) దగ్గరికి వెళ్లి సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించనక్కర్లేదని పేర్కొంది. అయితే, సవరించిన జాబితాపై ఇప్పటివరకు కేవలం బూత్ స్థాయిల నుంచి కేవలం రెండే అభ్యంతరాలు రావడం పట్ల సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కానీ, బూత్ లెవల్ ఆఫీసర్లు ఫిర్యాదులను స్వీకరించకపోవడమే ఫిర్యాదుల సంఖ్య తక్కువగా ఉండటానికి కారణమని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ నేపథ్యంలోనే, ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను సమర్పించవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది.

స్టెరిలైజేషన్ తర్వాత కుక్కల్ని వదిలేయండి

రేబిస్ సోకినవాటిని మాత్రం వదలొద్దు.. గత తీర్పును సవరించిన సుప్రీంకోర్టు

» కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు

» త్రిసభ్య బెంచ్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ, ఆగస్టు 22 : ఢిల్లీలో ఒక్క వీధికుక్క కూడా కనిపించకుండా అన్నింటినీ తరలించివేయండి.. స్టెరిలైజేషన్ (సంతాననియంత్రణ ఆపరేషన్) తర్వాత కూడా వీధుల్లోకి వదిలిపెట్టవద్దంటూ ఇచ్చిన తీర్పును శుక్రవారం సుప్రీంకోర్టు సవరించింది. వీధుల్లో పట్టుకున్న కుక్కలను స్టెరిలైజేషన్ తర్వాత తిరిగి వీధుల్లోకి వదిలిపెట్టాలని ఆదేశించింది. అయితే, రేబిస్ వ్యాధికి గురైనవాటిని, తీవ్రస్వభావం కలిగినవాటిని మాత్రం షెల్టర్లకే పరిమితం చేయాలని స్పష్టం చేసింది. వీధుల్లో కుక్కలకు ఆహారం పెట్టడాన్ని అనుమతించరాదని, ఈ నిబంధనను ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ తాజా ఉత్తర్వులు జారీచేసింది. నిజానికి, వీధికుక్కలపై ఇటీవల సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం జంతుప్రేమికులను కలతపరిచింది. వీధికుక్కల సమస్యను నియంత్రించడంలో స్టెరిలైజేషన్ ప్రక్రియకు ఉన్న ప్రాధాన్యాన్ని కోర్టు విస్మరించిందని 'పెటా' వంటి జంతు సంరక్షణ సంస్థలు పెదవి విరిశాయి. ఈ నెల 8వ తేదీన జస్టిస్ పార్దివాలా నేతృత్వంలోని ద్విసభ్య బెంచ్ ఇచ్చిన తీర్పుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ స్వయంగా కలగజేసుకున్నారు. పునఃపరిశీలన కోసం ఈ అంశాన్ని ముగ్గురు సభ్యుల బెంచ్‌కు ఆయన కేటాయించారు. ఒక బెంచ్ తీసుకున్న నిర్ణయంలో చీఫ్‌జస్టిస్ జోక్యం చేసుకోవడం చాలా అరుదు. ఈ నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన బెంచ్ శుక్రవారం తాజా ఆదేశాలు జారీచేసింది. 'కోర్టు వ్యాఖ్యలు మరీ కఠినంగా ఉన్నాయి' అంటూ గత తీర్పును బెంచ్ ప్రస్తావించింది. ఉద్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడం ఏకపక్ష తీర్పులతో వీలు కాదని వ్యాఖ్యానించింది. కుక్కలను ఎక్కడ నుంచి పట్టుకువెళ్లారో వ్యాక్సినేషన్, డీవార్మింగ్ జరిపిన తర్వాత తిరిగి అక్కడికే తెచ్చి వదిలిపెట్టాలని అధికారులకు బెంచ్ సూచించింది. వీధికుక్కలను పెంచుకునేందుకు జంతుప్రేమికులను అనుమతించిన కోర్టు.. ఒకసారి దత్తత తీసుకున్నాక తిరిగి అవి వీధుల్లోకి రాకుండా చూడాల్సిన బాధ్యత దరఖాస్తుదారులదేనని తేల్చిచెప్పింది. వీధికుక్కల అంశంపై హైకోర్టుల్లో దాఖలైన అన్ని పిటిషన్లను తెప్పించుకుంటామని, త్వరలోనే దీనిపై జాతీయ పాలసీని రూపొందిస్తామని తెలిపింది. వ్యక్తిగత పిటిషనర్లు, ఎన్‌జీవోలు రూ.25 వేలు నుంచి రూ.రెండు లక్షల వరకు కోర్టులో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. తీర్పును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ స్వాగతించారు. జంతువుల సంరక్షణకు, ప్రజల భద్రతకు మధ్య సాధించాల్సిన సమన్వయం విషయంలో సుప్రీంకోర్టు గొప్ప ముందడుగు వేసిందన్నారు.

సంబరాల్లో మునిగిన జంతుప్రేమికులు

సవరించిన కోర్టు తీర్పు జంతుప్రేమికుల్లో సంతోషాన్ని నింపింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్దకు చేరుకుని వారంతా సంబరాలు జరుపుకొన్నారు. కొందరు భగవంతునికి ధన్యవాదాలు తెలిపితే, 'హరహర మహాదేవా..' అంటూ మరికొందరు నినాదాలు చేశారు. కమ్యూనిటీ జంతువుల సంరక్షణపై కోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చిందని ఓ జంతు ప్రేమికురాలు సంతృప్తి వ్యక్తం చేశారు.

ట్రంప్ మాజీ సలహాదారుపై ఎఫ్‌బీఐ దాడులు



జాన్ బోల్టన్

వాషింగ్టన్, ఆగస్టు 22: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఇటీవల తీవ్ర విమర్శలు చేసిన ఆయన మాజీ సలహాదారు జాన్ బోల్టన్‌పై అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ 'ఎఫ్‌బీఐ తాజాగా దాడులు చేసింది. మేరీలాండ్‌లోని బెతెస్డా ప్రాంతంలోని జాన్ బోల్టన్ నివాసంలో అధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు. ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ ఆదేశాల మేరకు ఈ దాడులు జరిగినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. నిజానికి వైట్‌హౌజ్ జాతీయ భద్రతా సలహాదారుగా పనిచేసిన జాన్ బోల్టన్‌కు.. ట్రంప్ సన్నిహితుడుగా పేరుండేది. కానీ వాణిజ్య విధానాలు, సుంకాల అంశంలో విభేదాలు రావడంతో గతంలోనే ట్రంప్ ఆయనను పక్కనపెట్టారు. ఇటీవల జాన్ బోల్టన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ట్రంప్ 'దారి తప్పిన అధ్యక్షుడు' అంటూ విమర్శలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై అదనపు సుంకాలు విధించడం, అదే పనిచేస్తున్న చైనా జోలికి వెళ్లకపోవడంపై ప్రశ్నలు సంధించారు. ఆ కొన్నిరోజులకే జాన్ బోల్టన్‌పై ఎఫ్‌బీఐ దాడులు జరిగాయి మరోవైపు, రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్న అంశంపై తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మరోసారి నోరుజారారు. రష్యాకు బట్టలు ఉతికిపెట్టే వాషింగ్ మెషీన్‌లా భారత్ మారిందని మీడియాతో వ్యాఖ్యానించారు.

అమెరికాలో 5.5 కోట్ల మంది విదేశీయుల వీసాల పరిశీలన

» నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే దేశ బహిష్కరణ..

వాషింగ్టన్: అమెరికాలోని వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న ట్రంప్ సర్కారు.. మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అక్కడ ఉంటున్న 5.5 కోట్ల మందికి పైగా విదేశీయుల వీసా పత్రాలను సమీక్షించనున్నట్లు ప్రకటించింది. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే.. తక్షణమే వారి వీసా రద్దు చేసి అమెరికా నుంచి బహిష్కరించే ప్రక్రియను ప్రారంభిస్తామని విదేశాంగ శాఖ తెలిపింది. అమెరికాలోని వీసాదారులందరిపై నిరంతర పరిశీలన ఉంటుందని.. వీసా జారీ తర్వాత వారి ప్రవర్తనలో ఏమైనా మార్పు వచ్చిందా.. వీసా రూల్స్‌కు విరుద్ధంగా ప్రవర్తించారా అనేది సమీక్షిస్తామని స్పష్టం చేసింది.

విదేశీ ట్రక్కు డ్రైవర్లకు అమెరికా వీసాల నిలిపివేత

విదేశీ వాణిజ్య ట్రక్కు డ్రైవర్లకు వర్కర్ వీసాల జారీని అమెరికా గురువారం నుంచి నిలిపివేసింది. ఇటీవల భారత్‌కు చెందిన ఓ సిక్కు ట్రక్కు డ్రైవర్ ఫ్లోరిడా హైవేపై నిర్లక్ష్యంగా యూటర్న్ తీసుకోవడం వల్ల ముగ్గురు అమెరికన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ యంత్రాంగం తాజా నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. దీంతో విదేశీ ట్రక్కు డ్రైవర్లకు వీసాలను నిలిపివేశారు. దీంతో వీసా గడువు ముగిసిన వారికి రెన్యూవల్ చేసే అవకాశం ఉండదు. కొత్తగా వీసాల జారీ ఉండదు కాబట్టి భారత్ సహా విదేశీ ట్రక్కు డ్రైవర్లు అమెరికాకు వచ్చే ఆస్కారం ఉండదు. ఇంతకు ముందు విదేశీ ట్రక్కు డ్రైవర్లు హెచ్-2బీ వీసా వంటి తాత్కాలిక వీసాల కోసం దరఖాస్తు చేసుకునేవారు.

చైనాకు భారత ఎగుమతులు జంప్!

ఉద్రిక్తతలు తగ్గడంతో 4 నెలల్లోనే 20% వృద్ధి

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఉద్రిక్తతల ఉపశమనం.. అమెరికా అడ్డగోలు టారిఫ్‌ల నేపథ్యంలో చైనాతో భారత వాణిజ్యం మళ్లీ గాడినపడుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనే (ఏప్రిల్-జూలై మధ్య) భారత ఎగుమతులు ఏకంగా 19.97 శాతం పెరిగాయి. వీటి విలువ రూ.49,013 కోట్లు (5.76 బిలియన్ డాలర్లు). ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. 2023-24లో రూ.1.46 లక్షల కోట్ల ఎగుమతులు జరుగగా.. 24-25లో రూ.1.25 లక్షల కోట్లకు తగ్గాయి. 25-26లో మొదటి నాలుగు నెలల్లోనే రూ.49,013 కోట్లకు చేరడం.. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత విస్తరించాలని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఇటీవలి భారత పర్యటనలో ఉభయ దేశాలు నిర్ణయించడం, ప్రభుత్వంగా సరిహద్దుల్లో లిపులేక్ పాస్, షిప్కి లా పాస్, నాథు లా పాస్ వాణిజ్య మార్గాలను తిరిగి తెరవాలని నిశ్చయించడం.. తదితర పరిణామాలతో చైనాకు ఇండియా ఎగుమతులు ఈ ఆర్థిక సంవత్సరంలో భారీగానే పెరిగే అవకాశముందని అధికార వర్గాలు అంటున్నాయి. ఏప్రిల్-జూలై నడుమ ఎగుమతుల్లో ఇంధన, ఎలక్ట్రానిక్స్, ఆహార పదార్థాల వాటా అత్యధికంగా ఉండడం గమనార్హం. ఏప్రిల్లో 12.9%, మేలో 24%, జూన్‌లో 17%, జూలైలో 27 శాతానికి ఎగుమతులు చేరాయి. వాస్తవానికి 2024-25లో చైనాతో ఇండియా వాణిజ్య లోటు రూ.8.69 లక్షల కోట్లుగా ఉంది. తాజా పరిణామాలతో ఈ ఏడాది ఈ లోటు కొంతవరకు భర్తీ అవుతుందన్న ఆశాభావం అధికార వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ప్రోటాన్ పంప్ ప్రక్రియలో
పొట్టలో బ్లేడ్ల తొలగింపు

» గాంధీ ఆస్పత్రి వైద్యుల ప్రతిభ

» 3 రోజుల పర్యవేక్షణలో మల విసర్జనలో బ్లేడ్ల బహిర్గతం

హైదరాబాద్ సిటీ/అడ్డగుట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో తగాదాతో క్షణికావేశానికి గురైన ఓ ఆటో డ్రైవర్ మింగిన షేవింగ్ బ్లేడ్లను ప్రత్యేక చికిత్స (శస్త్ర చికిత్స లేకుండా)తో మల విసర్జనలో బయటకు వచ్చేలా చేశారు గాంధీ ఆస్పత్రి వైద్యులు. మౌలాలీ హౌసింగ్ బోర్డు కాలనీ వాసి మహమ్మద్ ఖాజా(37)కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబంలో గొడవతో క్షణికావేశంలో ఖాజా.. 8 షేవింగ్ బ్లేడ్లు రెండేసి ముక్కలు చేసి మింగాడు. కొద్ది సేపటికి నొప్పి రావడంతో తాను బతకనని ఏడుస్తుండటంతో భయపడ్డ కుటుంబ సభ్యులు ఈ నెల 16న గాంధీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ సునీల్ కుమార్ నేతృత్వంలో వైద్య బృందం ఎక్స్‌రే.. తర్వాత సిటీ స్కాన్ తీసి పొట్టలో బ్లేడ్లు ఉన్నట్లు గుర్తించారు. తొలుత ఎండోస్కోపీతో వాటిని బయటకు తీయాలని భావించినా.. ఆ ప్రక్రియలో ఇతర అవయవాలకు అపాయం జరిగి రక్తస్రావమైతే ఇబ్బందిగా మారుతుందని నిర్ణయానికొచ్చారు. ఆహారం, నీరు (నిల్ పర్ ఓరల్) ఇవ్వకుండా.. ప్రోటాన్ పంప్ వైద్య ప్రక్రియలో ఇంట్రావీనస్ ద్వారా ద్రావణాలు పంపి.. మల విసర్జనలో బ్లేడ్లు బయటకొచ్చేలా చేశారు. తొలి రోజు కొంత భాగం, రెండో రోజు 90% కిందకు జారిన బ్లేడ్లు.. మూడో రోజు రోగి మల విసర్జనలో పడిపోయాయి. మరోమారు రోగికి ఎక్స్‌రే తీసి బ్లేడ్లు లేవని నిర్ధారించుకున్నాక వైద్యులు ఊపిరి పీల్చుకున్నారు. శస్త్ర చికిత్స చేయకుండానే బ్లేడ్లు తొలగించిన వైద్యుల కృషిని అందరూ ప్రశంసించారు. రోగి పూర్తిగా కోలుకోవడంతో ఈ నెల 21(గురువారం) ఆస్పత్రి నుంచి ఆయన్ను డిశ్చార్జీ చేసినట్లు ఆస్పత్రి అడిషనల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్ శుక్రవారం మీడియాకు చెప్పారు.

విపక్షాల అభ్యర్థికి మేమెలా మద్దతిస్తాం?

» ఎన్నికల ముందు నుంచీ ఎన్డీఏలోనే ఉన్నాం: చంద్రబాబు

న్యూఢిల్లీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు నుంచి ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న టీడీపీ మద్దతును ఇండీ కూటమి ఎలా ఆశిస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. గెలిచే అవకాశం లేకున్నా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టి రాజకీయం చేస్తోందని విమర్శించారు. శుక్రవారం ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీయే తరఫున బరిలోకి దిగిన సీపీ రాధాకృష్ణన్‌తో చంద్రబాబు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఈ పదవి ప్రతిష్ఠను రాధాకృష్ణన్ పెంచుతారని.. ఆయన దేశంలోనే గౌరవనీయుడైన నాయకుడని.. ఆయనకే టీడీపీ మద్దతు ఉంటుందని చెప్పారు.

ఉపరాష్ట్రపతి అభ్యర్థిని
తెలుగు ప్రైడ్ అనడం హాస్యాస్పదం: ఎంపీ లక్ష్మణ్

న్యూఢిల్లీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ఎంపికపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉప రాష్ట్రపతి అభ్యర్థిని 'తెలుగు ప్రైడ్' అని అనడాన్ని ఆయన తప్పుపట్టారు. గతంలో పీవీ నరసింహారావు, టి.అంజయ్య వంటి తెలుగు నేతలను కాంగ్రెస్ అవమానించిందని ఆరోపించారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడారు. సీపీ రాధాకృష్ణన్‌కు మూడుసార్లు గవర్నర్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. నేర రహిత అభ్యర్థులు ఉండాలని లక్ష్యంతో తెచ్చిన బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. నేరస్థులను కాంగ్రెస్ ఎలా పెంచి పోషించిందో దేశ ప్రజలకు తెలుసని విమర్శించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల తరువాత బీజేపీ జాతీయ అధ్యక్ష ఎన్నిక ఉంటుందని లక్ష్మణ్ తెలిపారు. దేశంలో ఎవరైనా ఎక్కడైనా వ్యాపారాలు చేసుకోవచ్చని, స్థానికంగా సమస్యలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. 'మార్వాడీలు గో బ్యాక్' అనడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇచ్చంపల్లికి షరతులతో ఓకే

(మొదటి పేజీ తరువాయి)

పథకం కింద 67టీఎంసీలు, సమ్మక్కసాగర్ కింద 47టీఎంసీల నీటిని వినియోగించుకున్న తర్వాత వీటిపై సిమ్యులేషన్ అధ్యయనాలు జరిపి.. ఆ నివేదికలో పరిశీలన అనంతరమే ముందుకెళ్లాలని తేల్చిచెప్పింది. శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) సంప్రదింపుల కమిటీ టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఛైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రత్యక్షంగా హాజరుకాగా.. మహారాష్ట్ర, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, కేరళ ప్రతినిధులు వర్చువల్‌గా హాజరయ్యారు. జాతీయ ప్రయోజనాలు ముడిపడి లేని ఇంట్రా లింక్ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వరాదని, గోదావరి-కావేరిలో తరలించే నీటిలో 50శాతం వాటా తెలంగాణకు ఇవ్వాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా కోరారు. ఈ వాటాను రాష్ట్రంలో ఎక్కడైనా వాడుకునేలా రెండు రిజర్వాయర్లను కేంద్ర నిధులతో కట్టించి ఇవ్వాలన్నారు. గోదావరిలో 968 టీఎంసీలతో చేపట్టిన ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు ఇవ్వాలన్నారు. ఇచ్చంపల్లి నుంచి సాగర్ దాకా నీటిని తరలించే కన్వేయర్ సిస్టమ్‌పై సంయుక్త అధ్యయనాలు చేసి, సాధ్యమైనంత ముంపును తగ్గించాలన్నారు. ఇచ్చంపల్లి నుంచి తరలించే జలాలను నాగార్జునసాగర్‌లో కాకుండా సాగర్ టెయిల్‌పాండ్‌లో వేయాలని రాహుల్ బొజ్జా కోరారు. జీసీ లింక్‌లో కర్ణాటకకు కేటాయించిన 16 టీఎంసీలను ఆల్మట్టిలో వాడుకుంటే ఆ ప్రభావం జూరాలపై పడుతుందని, దీనిపై పునరాలోచన చేయాలన్నారు. జీసీ లింక్‌లో భాగంగా ఏపీ ప్రతిపాదించిన నాలుగు ఇంట్రా లింక్‌ల కాన్సెప్ట్ నోట్‌లను పరిగణనలోకి తీసుకోవడం, ఆ తర్వాత వీటికి డీపీఆర్‌లు సిద్ధంచేయాలని ఎన్‌డబ్ల్యూడీఏ కోరడంపై తెలంగాణ అభ్యంతరం తెలిపింది. కృష్ణా, గోదావరి ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా గోదావరి-బనకచర్ల అనుసంధానం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నాకే.. ఈ లింక్‌లను ఏపీ ప్రతిపాదించిందని, దీనిని సీడబ్ల్యూసీ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), గోదావరి బోర్డు కూడా వ్యతిరేకించాయని గుర్తుచేసింది. ఇచ్చంపల్లి రిజర్వాయర్ నిర్మించాక 200టీఎంసీల వరద జలాలను వాడుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరింది. జీసీ లింక్‌పై సమ్మతి తెలిపే మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్(ఎంవోఏ)పై సంతకాలకు తొందరేమీ లేదని, అందరి సమ్మతి లభించాకే.. అధ్యయనం అనంతరం సంతకాలు చేస్తామని పేర్కొంది.

పోలవరం-జీసీ లింక్‌ను చేపట్టాలి..

పోలవరం నుంచి గోదావరి-కావేరి అనుసంధానం చేపట్టే ప్రతిపాదనల్ని పరిశీలించాలని ఏపీ కోరింది. గోదావరిలో నీటి లభ్యతపై 2023 జూన్‌లో సీడబ్ల్యూసీ ఇచ్చిన నివేదిక ఆమోదయోగ్యం కాదని, ఆ నివేదిక ఆధారంగానే గోదావరి-కావేరి లింక్‌ను ప్రతిపాదించారని, దానిని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపింది. "గోదావరి-కావేరిలో తొలివిడతలో తరలించే 147 టీఎంసీలు ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని వాటాగా చెబుతున్నారు. తొలుత ఆ రాష్ట్రం సమ్మతి తీసుకోవాలి. గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం ఛత్తీస్‌గఢ్ తనకు కేటాయించిన నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతుంది. అదే జరిగితే జీసీ లింక్‌తో ఏపీలో నిర్మాణంలో ఉన్న, ఇప్పటికే పూర్తయిన ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. నాగార్జునసాగర్‌పై మళ్లీ సిమ్యులేషన్ స్టడీస్ చేయాలి. తుంగభద్ర సబ్ బేసిన్ పరిధిలో కరువుపీడిత ప్రాంతాలకు నీళ్లు ఇవ్వాలి. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా కృష్ణాబేసిన్‌కు నీటిని తరలిస్తే.. ఆ బేసిన్ నీటిని వాడుకునే ఇతర రాష్ట్రాలు కూడా వాటా కోరే అవకాశం ఉంది. గోదావరిలో నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ, వ్యాప్కోస్ అధ్యయనాల్లో తేడా ఉంది" అని ఏపీ పేర్కొంది.

40 టీఎంసీలైనా ఇవ్వండి..

గోదావరి-కావేరి అనుసంధానంలో తమకు కనీసం 40 టీఎంసీలైనా కేటాయించాలని కర్ణాటక కోరింది. తుంగభద్ర జలాశయం పూడిక కారణంగా 30 టీఎంసీల నిల్వను కోల్పోయిందని తెలిపింది. జీసీ లింక్‌లో భాగంగా ప్రతిపాదించిన బెడ్తి-వారాదా అనుసంధానంతో ప్రయోజనం లేదని, తుంగభద్ర ఎగువన మరో లింక్‌ను ప్రతిపాదిస్తామని పేర్కొంది. కాగా, గోదావరిలో 48 శాతం పరివాహక ప్రాంతం మహారాష్ట్రలో ఉందని ఆ రాష్ట్రం గుర్తు చేసింది. అయినా జీసీ లింక్‌లో నీటిని కేటాయించలేదని తప్పుబట్టింది. తాము ఇంద్రావతి సబ్‌బేసిన్‌లో 41 టీఎంసీలతో ఒక ప్రాజెక్టును ప్రతిపాదిస్తున్నామని, దీనిని జీసీ లింక్‌లో భాగం చేయాలని కోరింది. కృష్ణా ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు నీటిని తరలిస్తే.. ఆ బేసిన్‌ను పంచుకునే రాష్ట్రాలకు ఆ నీటిపై హక్కు ఉంటుందని, దాని ప్రకారం నీటి కేటాయింపులు చేయాలని మహారాష్ట్ర పేర్కొంది. కాగా, గోదావరి ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం తమకు వాటాగా వచ్చిన నీరంతా వాడుకుంటామని ఛత్తీస్‌గఢ్ తెలిపింది. గోదావరిలో 301 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నాయని, 163 టీఎంసీల వినియోగానికి అనుగుణంగా ప్రణాళికలున్నాయని పేర్కొంది. 100 టీఎంసీలతో బోధ్‌ఘాట్ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నామని ప్రతిపాదించింది. దీంతో సీడబ్ల్యూసీ జోక్యం చేసుకొని, "అది జలవిద్యుత్ ప్రాజెక్టు కదా! దాని కింద నీటి వినియోగం ఏదీ లేదు కదా!" అని గుర్తు చేసింది. దీంతో.. అది బహుళార్థ సాధక ప్రాజెక్టు అని ఛత్తీస్‌గఢ్ తెలిపింది. ఇంద్రావతి పైన జోర్‌నాలాను మళ్లించేందుకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడానికి సహకరించాలని కోరింది. కాగా, గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టుకు సమ్మతి తెలుపుతూ ఎంవోఏపై ఇప్పటికే సంతకాలు చేశామని పుదుచ్చేరి తెలిపింది. కావేరి తీవ్ర లోటు బేసిన్ అని, తక్షణమే జీసీ లింక్‌ను చేపట్టాలని తమిళనాడు కోరగా.. 2.4 టీఎంసీలు కాకుండా 7.4 టీఎంసీల నీటి కేటాయింపు చేయాలని పుదుచ్చేరి విజ్ఞప్తి చేసింది.



గోదావరి నీటిని వాడుకోం: ఎన్‌డబ్ల్యూడీఏ

గోదావరి-కావేరి అనుసంధానంలో గోదావరి జలాలను వాడుకోబోమని ఎన్‌డబ్ల్యూడీఏ తెలిపింది. హిమాలయన్ కాంపోనెంట్ నుంచి నీటిని తీసుకొచ్చి.. గోదావరిలో పోసి ఆ నీళ్లను గోదావరి-కావేరిలో తరలిస్తామని సీడబ్ల్యూసీ ఛైర్మన్ అతుల్ జైన్ చెప్పారు. రాష్ట్రాలన్నీ గోదావరి-కావేరికి అంగీకరించాలని కోరారు. ప్రస్తుతం గోదావరిలో ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 147 టీఎంసీల నీటిని తరలిస్తున్నాం, ఛత్తీస్‌గఢ్ ఆ నీటిని వినియోగించుకునేలా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టగానే జీసీ లింక్‌ను నిలిపివేస్తామని అన్నారు. మరో 15 ఏళ్లయినా ఛత్తీస్‌గఢ్ వాటాను వాడుకునే అవకాశాల్లేవన్నారు. జీసీ లింక్‌లో ప్రతిపాదించే లింక్‌లకే నిధులు ఇస్తామని, ప్రాజెక్టుకు నిధులన్నీ కేంద్రమే భరిస్తుందని పేర్కొన్నారు. ఇంత మంచి అవకాశాన్ని కోల్పోవొద్దని, జీసీ లింక్‌ను అంగీకరించాలని సూచించారు. ఈ సమావేశానికి తెలంగాణ నీటిపారుదలశాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు హాజరయ్యారు.

తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే చర్యలు

» ఖమ్మం సీపీ సునీల్ దత్

ఖమ్మం క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పుకార్లు, తప్పుడు వార్తా కథనాలను ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో పోస్టు చేసి, అసత్యప్రచారం చేస్తున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వార్త ప్రచురితమైనట్లు అర్థమొచ్చేలా.. డేట్‌లైన్ మార్ఫింగ్ చేసి సోషల్ మీడియా వేదికగా కావాలని ప్రచారం చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలని 'క్లిప్పింగ్'లతోపాటు గురువారం తనకు ఆంధ్రజ్యోతి ప్రతినిధుల బృందం ఫిర్యాదు చేశారని శుక్రవారం ఓ ప్రకటనలో కమిషనర్ తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు ఖమ్మం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వెల్లడించారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్న వారిని త్వరలోనే సైబర్ క్రైం పోలీసులు గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటారన్నారు. సోషల్‌మీడియా వేదికగా వచ్చే ఇతర తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. పుకార్లు, తప్పుడు వార్తాకథనాలతో సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చట్టపరంగా చర్యలు తప్పవని సునీల్‌దత్ పేర్కొన్నారు.


బినామీ ఉపాధ్యాయురాలిని నిలదీస్తున్న అధికారులు

సర్కారు బడిలో బినామీ టీచర్

» తన స్థానంలో నియమించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

బొంరాస్‌పేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు విధులకు గైర్హాజరై, తన స్థానంలో బినామీ టీచర్‌తో తరగతులు నిర్వహిస్తున్న ఘటన వికారాబాద్ జిల్లాలో అధికారుల తనిఖీల్లో బయటపడింది. బొంరాస్‌పేట్ మండలం గాజులకుంట ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ జయకృష్ణ, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు విధుల్లో లేకపోవడంతో.. విద్యార్థులను అడగ్గా అసలు విషయం బయటపడింది. అదే గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ ఉపాధ్యాయురాలితో ప్రతిరోజూ పాఠాలు చెప్పిస్తూ.. ఆ ఉపాధ్యాయుడు తన వ్యక్తిగత పనులకు వెళ్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. దీంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆయనపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయంపై సదరు ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటేశ్‌ను వివరణ కోరగా.. అప్పటి వరకు పాఠశాలలోనే ఉన్నానని, శాఖాపరమైన పనుల నిమిత్తం మండల విద్యా కార్యాలయానికి వచ్చిన సమయంలోనే అధికారులు తనిఖీకి వచ్చినట్లు సమాధానం ఇచ్చాడు.

సచివాలయం ముట్టడికి బీజేపీ యత్నం

» అడ్డుకున్న పోలీసులు.. 300 మందికి పైగా అరెస్టు


బీజేపీ కార్యకర్తలను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఖైరతాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సేవ్ హైదరాబాద్.. చలో సెక్రటేరియట్ పేరుతో బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సచివాలయం ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఇక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని డ్రైనేజీ, కలుషిత నీరు, గుంతల రోడ్లు, విద్యుత్ తీగలతో జరుగుతున్న ప్రమాదాలు, విద్యుత్ దీపాలు వెలగకపోవడం తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు చలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చారు. బీజేపీ, బీజేవైఎం, మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సచివాలయానికి చేరుకుని ముట్టడికి యత్నించారు. పోలీసులు ముందస్తుగానే పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసి ముట్టడికి యత్నించిన వారిని ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందాన్ని సైఫాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, పూసరాజు, మాజీ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, ఎస్సీ మోర్చా నాయకుడు ప్రకాశ్ బిస్వాను పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 300 మందికి పైగా బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని నగరంలోని 9 పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ నేపథ్యంలో బీజేపీ శ్రేణులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరగడంతో పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారింది.

ఏసీ కోచ్‌లలో గంజాయి స్మగ్లింగ్!

» ఒక్క పార్సిల్ డెలివరీ చేస్తే రూ.పది వేలు

» రైల్వే పోలీసులు, ఈగల్ బృందాల ఆపరేషన్‌లో నలుగురు కొరియర్ల అరెస్టు

హైదరాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎవరికీ అనుమానం రాకుండా సరికొత్త ట్రాలీబ్యాగులతో ఏసీ కంపార్ట్‌మెంట్లలో ప్రయాణిస్తూ.. గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాకు చెందిన నలుగురు కొరియర్లను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు, ఈగల్ బృందాలు సంయుక్త ఆపరేషన్‌లో పట్టుకున్నారు. ఇలా ఒడిశా నుంచి పుణెకు గంజాయిని సరఫరా చేయడానికి ప్రయత్నిస్తున్న ఈ నలుగుర్ని అరెస్టు చేసి రూ.22 లక్షల విలువైన 91 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశాకు చెందిన ప్రకాష్ చంద్ర ప్రధాన్, బసంత్, ఘనశ్యామ్, చిత్రసేన జనీలు గంజాయి స్మగ్లర్ ప్రశాంత్ వద్ద కొరియర్లుగా పనిచేస్తున్నారు. వీరు ఒక్కొక్కరికి పది నుంచి పదిహేను కిలోల గంజాయిని ప్రశాంత్ అందజేసేవాడు. దాన్ని మంచి ట్రాలీబ్యాగుల్లో, హ్యాండ్ బ్యాగ్‌లలో దాచుకుని వీరంతా ఏసీ కంపార్ట్‌మెంట్ టికెట్లు కొని రైళ్లు ఎక్కేవారు. ప్రతీ డెలివరీకి వీరికి రూ.పది వేలను ప్రశాంత్ ఇచ్చేవాడు. అతడు చెప్పినట్లుగా వీరంతా పుణె చేరుకుని సాయిరాం, మామీ అనే వ్యక్తులకు గంజాయి పార్సిళ్లను అందించాల్సి ఉంటుంది. ఇలా ఈ నలుగురు ఏడాదిలో 20సార్లు రైళ్లలో గంజాయి తరలించారు. తరచు వీరు ఏసీ కంపార్ట్‌మెంట్లలో ప్రయాణిస్తూ ఉండటం, ఎప్పుడూ కొత్త కొత్త ట్రాలీబ్యాగులను ఉపయోగిస్తూ ఉండడంతో వీరిపై నిఘా పెట్టి తాజాగా సరుకుతో పట్టుకున్నామని సందీప్ శాండిల్య తెలిపారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు రైళ్లలో గంజాయి రవాణా చేస్తున్న 147 మందిని అరెస్టు చేసి 2,327 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, 116 కేసులు నమోదు చేశామని వివరించారు. తాజా అరెస్టుతో ప్రధాన గంజాయి స్మగ్లర్, రిసీవర్ల సమాచారం అందిందని, వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలో దించామని సందీప్ శాండిల్య తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విద్వేషాలకు ఆజ్యం!

ఉత్తరాఖండ్ వరదలతో వొణికిపోతోంది. మరింత కుంభవృష్టికి సిద్ధంకమ్మంటూ వాతావరణశాఖ హెచ్చరికలు చేస్తూనే ఉంది. పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో రాష్ట్రంలో 150కు పైగా దారులు మూసుకుపోయాయనీ, ఆఖరుకు చార్‌ధామ్ యాత్రకు కూడా ఆటంకం కలిగిందనీ వింటున్నాం. ఈ నెలారంభంలో క్లౌడ్‌బరస్ట్ కారణంగా అకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడి, ధరాలీ సహా కొన్ని గ్రామాలు తుడిచిపెట్టుకుపోయిన దృశ్యాలు మన కళ్ళముందు కదలాడుతూనే ఉన్నాయి. వందమందికి పైగా స్థానికులూ పర్యాటకులూ ఆ భయానకమైన బురదలో ప్రాణాలు వదిలేశారు. 2013 కేదార్‌నాథ్ వరదలు రాష్ట్రానికి భారీ ఆస్తి నష్టాన్నీ, మౌలిక సదుపాయాల విధ్వంసాన్ని కలిగించినస్థాయిలో రాష్ట్రం మళ్ళీ ఇప్పుడు దెబ్బతిన్నదని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రకృతి ఆగ్రహానికి అల్లాడిపోతున్న ప్రజలను ఆదుకోవడం, రాష్ట్రాన్ని తిరిగి గాడినపెట్టడం ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ ప్రథమ కర్తవ్యం కావాలి. ఈనెల 19న ఆరంభమైన అసెంబ్లీ సమావేశాలను అందుకు వినియోగించాల్సిన ముఖ్యమంత్రి, మైనారిటీలపై దాడికీ, మత రాజకీయాలకు దానిని వాడుకున్నారు. మదర్సాల నియంత్రణ, మతమార్పిడి నిరోధం సహా మొత్తం తొమ్మిది బిల్లులు బుధవారం సభలో నెగ్గాయి.

రాష్ట్రాన్ని రక్షించగల ప్రణాళికలను సిద్ధం చేయాల్సిన ముఖ్యమంత్రి విద్వేషవ్యూహాల మీద శ్రద్ధపెడుతున్నారు. రాష్ట్రంలో రమారమి 14శాతం ముస్లిం జనాభా ఉంది. ఇప్పటికే, మదర్సా బోర్డును రద్దుచేసి, వివిధ ఆరోపణలతో మదర్సాలను మూసివేయిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు కొత్తచట్టంతో మరిన్ని ఆంక్షలు ప్రయోగించింది. అత్యంత స్వల్పసంఖ్యలో ఉన్న సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, పార్శీలకు మైనారిటీ విద్యాసంస్థల లబ్ధిని విస్తరింపచేస్తూ, రాష్ట్ర మైనారిటీ ఎడ్యుకేషన్ విభాగానికి సర్వాధికారాలనూ ప్రభుత్వం దఖలుపరిచింది. మదర్సాలో చదువులను నిర్ణయించి, నియంత్రించడంతో పాటు, నిర్వహణలో అక్రమాలు, పారదర్శకత లేకపోవడం, సామాజిక అశాంతి, మతవిద్వేషం ఇత్యాది ఆరోపణలతో ఏ చిన్న కారణంతోనైనా మైనారిటీ హోదాను రద్దుచేయగల, ఆస్తిని స్వాధీనపరచుకోగల అధికారాన్ని ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకుంది. ఈ చట్టం ద్వారా మదర్సాలను స్వల్పసంఖ్యలో అనుమతించి, మిగతావన్నీ మూసివేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దేశం మొత్తంమీద ఇంతటి ప్రగతిశీలచట్టం ఎక్కడాలేదని ముఖ్యమంత్రి చెబుతూంటే, లవ్‌జిహాద్, లాండ్ జిహాద్‌లు ఎదుర్కొంటున్న తమమీద ఇదో కొత్త జిహాద్ అని ముస్లింలు అంటున్నారు. ఇక, మతమార్పిడి నిరోధక చట్టం కూడా మరిన్ని కఠినమైన సవరణలతో మరింత బలపడింది. 'బలవంతం'గా మతం మార్చినవారికి యావజ్జీవం తప్పదు. బూటకపు ప్రేమలు, పెళ్ళి హామీలకు పదేళ్ళశిక్షలు, లక్షల్లో జరిమానాలు పడతాయి. ఒక బహుమతి, మంచిజీవితం, విద్య, వైద్యం, ఉద్యోగం, దైవానుగ్రహం ఇత్యాది హామీలన్నీ తీవ్ర శిక్షలకు దారితీస్తాయి. మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీల మతమార్పిడుల విషయంలో మరింత కఠినమైన నియంత్రణలు, నిబంధనలు ఉన్నాయి. డిజిటల్, ఆన్‌లైన్, సోషల్ మీడియాల్లో ఒక మతాన్ని దూషించి, మరో మతాన్ని కీర్తించినా, ప్రచారం చేసినా మతమార్పిడికి సాయపడినట్టే. నిందితులను వారెంట్ లేకుండా అరెస్టుచేయవచ్చు, సదరు వ్యక్తుల, సంస్థల ఆస్తులు స్వాధీనం చేసుకోవచ్చు, 20ఏళ్ళ వరకూ శిక్షలు పడవచ్చు. పొరుగునే ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌సహా ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనూ ఇంతటి కఠినమైన మతమార్పిడి వ్యతిరేక చట్టం లేదని నిపుణులు అంటున్నారు. బలవంతపు మతమార్పిడులను నిరోధించడం లక్ష్యమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆ పేరిట ముస్లింలను మరింత వేధించడానికి ఈ చట్టం ఉపకరిస్తుంది.

దేశంలో ఉమ్మడిపౌరస్మృతి అమలుచేసిన తొలిరాష్ట్రం ఉత్తరాఖండ్. ఈ ఏడాది జనవరిలో అది అమలులోకి వచ్చింది. గిరిజనతెగలకు మినహా మిగతావారందరికీ ఇది సమానంగా వర్తిస్తూ, వివాహం, విడాకులు, వారసత్వం సహా సమస్త అంశాలనూ నిర్దేశిస్తోంది. సహజీవనాన్ని నియంత్రించే నిబంధనలమీద విమర్శలు, కేసులు ఉన్నప్పటికీ, ధామీ ప్రభుత్వం వెనుకంజవేయకుండా, ఇప్పుడు మరిన్ని సవరణలతో దానిని మరింత కఠినతరం చేసింది. బంధాన్ని విధిగా బహిరంగపరచాల్సిన నిబంధనలకు తోడుగా, అనధికార, అక్రమ బంధాలకు శిక్షలు తీవ్రమైనాయి. వివాహితులు సహజీవనంలోకి ప్రవేశించినా, బలవంతంగా లేదా మోసపూరితంగా ఈ బంధంలో ఉన్నా ఏడేళ్ళ జైలు తప్పదు. ఈ బిల్లులు, వాటికి చేసిన సవరణలు సామాజిక శాంతిని కాక, విద్వేషాలను పెంచి, కొత్త సమస్యలను సృష్టిస్తాయన్నది సుస్పష్టం.

కశ్మీర్‌కు రాష్ట్ర హోదా గతించిన గతమేనా?

కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ నిరుడు కురిసిన హిమసమూహమేనా? జమ్మూ–కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన భారత రాజ్యాంగ అధికరణ 370 'రద్దు చేసేందుకు' నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను దేశ సర్వోన్నత న్యాయస్థానం సమర్థించిందనే భావన ఒకటి దేశ ప్రజలలో విస్తృతంగా ఉన్నది. అధికరణ 370 రద్దు సక్రమమేనని సుప్రీంకోర్టు ప్రమాణీకరించిందని ప్రభుత్వం వాదించింది. న్యాయశాస్త్ర పండితులు కొంతమంది ప్రభుత్వ వాదనను అంగీకరించారు. పొరపాటు, డిసెంబర్ 17, 2023న ఇదే కాలమ్‌లో నేనా విషయాన్ని బలమైన రుజువులతో స్పష్టం చేశాను. నిజానికి సుప్రీంకోర్టు అధికరణ 370 రద్దుపై ప్రభుత్వ వాదనకు విరుద్ధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అధికరణ 370 రద్దు రాజ్యాంగ విరుద్ధం, సందేహం లేదు. ఆగస్టు 5, 2019న మోదీ ప్రభుత్వం మూడు చర్యలు చేపట్టింది: అధికరణ 370(1)ని దృష్టాంతంగా చూపుతూ రాజ్యాంగ నిర్వచన నిబంధన (అధికరణ 367)కు అదనంగా 4వ నిబంధనను చేర్చింది; విస్తరింపచేసిన నిర్వచన నిబంధనను అధికరణ 370(3)లోని నిబంధన సవరణకు ఉపయోగించింది; సవరణ చేసిన అధికరణ 370(3), అధికరణ 370ని రద్దు చేసేందుకు ఉపయోగించింది. ఈ మూడు చర్యలూ న్యాయసమ్మతమైనవికావని, రాజ్యాంగ విరుద్ధమైనవని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అయినప్పటికీ రాజ్యాంగ నిబంధనలు అన్నిటినీ జమ్మూ–కశ్మీర్‌కు వర్తింపచేస్తూ అధికరణ 370(1) కింద అధికారాలను ఉపయోగించడం సక్రమమేనని, అధికరణ 370 రద్దుతో సమమైన ప్రభావదాయకమవుతుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

సరే, జమ్మూ–కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు అయిందని అంగీకరిద్దాం. అయితే ప్రత్యేక హోదా ఉపసంహరణ కశ్మీర్ ప్రజలకు అమిత మనస్తాపం కలిగిస్తోందని, కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వంపై వారిలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయని చెప్పడం సత్యదూరం కానే కాదు. అధికరణ 370 రద్దుతో ఆ వ్యవహారం ముగిసిపోలేదు. ఆగస్టు 5, 2019న, భారత్‌లో విలీనమైన నాటినుంచి రాష్ట్ర ప్రతిపత్తితో వర్ధిల్లుతున్న జమ్మూ–కశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించారు. 'ఇది రాజ్యాంగ సమ్మతమూ, న్యాయబద్ధమేనా?' కేంద్ర ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసినవారు పై ప్రశ్నపై కూడా విచారణ జరపాలని అభ్యర్థించారు. సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. కారణమేమిటి? లద్దాఖ్ మినహా జమ్మూ–కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరిస్తామని, ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు నివేదించింది. మోదీ సర్కార్ నివేదనను అంగీకరిస్తూ 'ప్రత్యేక ప్రతిపత్తి ఉన్న ఒక రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం రాజ్యాంగ సమ్మతమూ, న్యాయబద్ధమైన చర్యేనా?' అన్న అంశాన్ని విచారణ చేపట్టకుండా వదిలివేసింది. అయితే జమ్మూ–కశ్మీర్‌లో ఎన్నికలను సెప్టెంబర్ 30, 2024లోగా నిర్వహించి తీరాలని మోదీ సర్కార్‌కు నిర్దేశించింది. ఆ నిర్దేశానికి అనుగుణంగా సెప్టెంబర్ 2024లో కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించారు. అయితే ఈ రోజుకీ రాష్ట్ర హోదాను పునరుద్ధరించలేదు. దేశ సర్వోన్నత న్యాయస్థానానికి లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీని మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదు. ఇది స్పష్టంగా వాగ్దాన భంగమే.



> 'ప్రత్యేక ప్రతిపత్తి ఉన్న ఒక రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం రాజ్యాంగ విహితచర్యేనా?' అన్న న్యాయపరమైన సమస్య సర్వోన్నత న్యాయస్థానం ముందు స్పష్టంగా ఉన్నది. కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సుప్రీంకోర్టు ఆ అంశంపై నిర్ణయం తీసుకోలేదు. ఆ హామీని వెన్వెంటనే నెరవేర్చాలని కేంద్రాన్ని ఆదేశించడమో లేదా అపరిష్కృతంగా ఉన్న ఆ అంశంపై తీర్పు వెలువరించడమో సుప్రీంకోర్టు ముందున్న బాధ్యత.

జమ్మూ–కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించే విషయమై జరుగుతున్న తాత్సారానికి బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వం బాధ్యత వహించి తీరాలి. కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూ–కశ్మీర్‌లో సెప్టెంబర్ 2024లో నిర్వహించిన ఎన్నికలలో విజయం సాధించిన నేషనల్ కాన్ఫరెన్స్ అక్టోబర్ 16, 2024న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బహుశా, వ్యూహాత్మకంగానే కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలన్న డిమాండ్ గట్టిగా చేయడం లేదు. ప్రభుత్వం నుంచి గానీ, ప్రజల నుంచి గానీ బలమైన డిమాండ్ లేకపోవడంతో రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణకు కశ్మీర్ ప్రజలు ప్రథమ ప్రాధాన్యమివ్వడంలేదని కేంద్ర ప్రభుత్వం విశ్వసించేందుకు దారి తీసింది. వాస్తవంగా ప్రతి కశ్మీరీ కూడా తమ జన్మభూమి రాష్ట్ర ప్రతిపత్తి కోల్పోయినందుకు ఆగ్రహిస్తున్నాడు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రగిలిపోతున్నాడు.

పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతి భారతీయుడూ చలించిపోయాడు. పాకిస్థాన్ నుంచి చొరబడిన ఉగ్రవాదులతో భారత్‌కు చెందిన ఉగ్రవాదులు కూడా ఆ హింసాకాండలో పాల్గొన్నారని నేను గట్టిగా భావిస్తున్నాను. పాకిస్థాన్ నుంచి చొరబడిన ముగ్గురు ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చారనే ఆరోపణపై పహల్గాంలో ఇద్దరు భారతీయులను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అరెస్ట్ చేసింది. ఆపరేషన్ సిందూర్ అనంతరం, జూలై 28, 29 తేదీల్లో ముగ్గురు విదేశీ ఉగ్రవాదులను ఒక ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టారు. ఈ ఘటనతో 'పహల్గాం'కు ప్రభుత్వం తెరదించినట్టు కనిపిస్తోంది. అయితే పహల్గాంలోనే అరెస్ట్ చేసిన ఇద్దరు భారతీయుల విషయమై ప్రభుత్వం పూర్తి మౌనం వహిస్తోంది. వారు భద్రతాదళాల కస్టడీలో ఉన్నారా? లేక విడుదల చేసి కేసు ముగించారా? అన్నది స్పష్టంగా తెలియదు. అంతా రహస్యం.

అయితే ప్రజలకు అన్ని విషయాలు జ్ఞాపకముంటాయి. జమ్మూ–కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ ఇంకా నెరవేరలేదన్న వాస్తవాన్ని వారు ఎలా విస్మరిస్తారు? ఆ హామీని నెరవేర్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కొంతమంది బాధ్యతాయుత పౌరులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లపై విచారణలో భాగంగా సర్వోన్నత న్యాయస్థానం మౌఖికంగా కొన్ని నిర్దిష్ట వ్యాఖ్యలు చేసింది. పహల్గాంలో సంభవించినదాన్ని ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించడం తగదనేది ఆ వ్యాఖ్యల సారాంశం. 'ప్రత్యేక ప్రతిపత్తి ఉన్న ఒక రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం రాజ్యాంగ విహిత, న్యాయబద్ధమైన చర్యేనా?' అన్న న్యాయపరమైన సమస్య సర్వోన్నత న్యాయస్థానం ముందు స్పష్టంగా ఉన్నది. కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సుప్రీంకోర్టు ఆ న్యాయపరమైన సమస్యపై నిర్ణయం తీసుకోకుండా సంయమనం వహించింది. కేంద్రం ఆ హామీని నెరవేర్చలేదు. సుప్రీంకోర్టు ఇప్పుడు ఆ హామీని వెన్వెంటనే నెరవేర్చాలని కేంద్రాన్ని ఆదేశించడమో లేదా అపరిష్కృతంగా ఉన్న ఆ అంశంపై తీర్పు వెలువరించడమో చేసి తీరాలి. రాజ్యాంగ న్యాయస్థానం న్యాయాన్ని సమకూర్చగలదని నేను విశ్వసిస్తున్నాను.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

క్రికెట్ జగత్తును శాసిస్తున్న భారత్

నరేంద్ర మోదీ మే 2014లో ప్రధానమంత్రి అయిన నాటి నుంచీ మన దేశాన్ని 'విశ్వ గురు'గా చేయాలనే తమ ఆకాంక్షను భారతీయ జనతా పార్టీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బిగ్గరగా ప్రకటిస్తున్నాయి. సంవత్సరాలు గడిచిపోయాయి. అయినా ఆ రెండు సంస్థల ఆకాంక్ష నెరవేరడమనేది ఇంకా చాలా దూరంలోనే ఉన్నది. అంతర్జాతీయ రాజకీయాలలో మన వైఫల్యాలు ఏమైనప్పటికీ అంతర్జాతీయ క్రికెట్‌లో మన ప్రభ దేదీప్యమానంగా వెలిగిపోతోంది. అయితే భారత్ నిర్ణయాలు, చర్యలు సదా కాకపోయినా తరచుగానైనా క్రికెట్‌కు లబ్ధి కలిగించేవిగా ఉంటున్నాయా అనేది పూర్తిగా మరో విషయం.



భారత క్రికెట్ నియంత్రణ సంస్థ (బీసీసీఐ) కార్యకలాపాలలో మరింత జవాబుదారీతనం, పారదర్శకత తీసుకువచ్చే లక్ష్యం (చివరకు ఇది నెరవేరనేలేదు)తో సుప్రీంకోర్టు 2017లో నియమించిన 'పాలనాధికారుల కమిటీ'లో నేను కొన్ని నెలల పాటు సభ్యుడుగా ఉన్నాను. ఇతర క్రికెటింగ్ బోర్డులు అన్నిటినీ తమ అడుగుజాడల్లోకి తీసుకురావాలనే ఆరాటం బీసీసీఐ అధికారులలో ప్రగాఢంగా ఉన్నట్టు నేను గమనించాను. ఒక చరిత్రకారుడుగా ఇది నన్ను కలవరపరిచింది. ఎందుకంటే గతంలో శ్వేతజాతుల సామ్రాజ్యవాద దురహంకారం క్రికెట్‌ను సమున్నతం చేసేందుకు ఎలా అవరోధమయిందో నాకు బాగా తెలుసు. 2022లో ప్రచురితమైన నా పుస్తకం 'The Commonwealth of Cricket'లో ఇలా రాశాను: 'ఇంగ్లీష్, ఆస్ట్రేలియన్ ఆధిపత్యం తరచు ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ విశాల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసిందని బీసీసీఐలోని నా సహచరులకు చెప్పాను. భారత్ ప్రస్తుత ప్రాబల్యమూ అదే విధంగా పరిణమిస్తున్నదని కూడా చెప్పాను. అంతర్జాతీయ రాజకీయాలలో అమెరికా వహిస్తున్న పాత్రనే అంతర్జాతీయ క్రికెట్‌లో నిర్వహించేందుకు భారత్ ఆరాటపడగూడదని నేను వాదించాను. ప్రపంచ దేశాల మధ్య సత్సంబంధాలు వర్ధిల్లేందుకు నియమనిబంధనలు నిర్దేశిస్తూ తన ప్రయోజనాలకు దోహదం చేయని అంతర్జాతీయ ఒడంబడికలను పూర్తిగా ఉపేక్షించడమే కదా అమెరికా పోకడ. క్రికెట్ జగత్తులో భారత్ ఆ తీరున వ్యవహరించకూడదు'.

నా హెచ్చరికలు బధిరుని ముందు శంఖనాదమే అయ్యాయి. Rod Lyall కొత్త పుస్తకం 'The Club : Empire, Power and the Governance of World Cricket' చదివినప్పుడు ఆ హెచ్చరికలు నా మనసులోకి మళ్లీ వచ్చాయి. 1909లో స్థాపితమైన Imperial Cricket Conference కథతో లైయల్ పుస్తకం ప్రారంభమయింది. బ్రిటిష్ సామ్రాజ్య మైనింగ్ మ్యాగ్నెట్ ఏబ్ బెయిలీ మేధో శిశువు అయిన ICC తొలి కాలంలో ఇంగ్లాండ్, శ్వేతజాతీయులు అత్యధికంగా ఉన్న ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌ల ఆధిపత్యంలో ఉండేది. క్రికెట్ ఎలా ఆడాలో ఈ దేశాలు, ముఖ్యంగా ఇంగ్లండ్ నిర్ణయించేది. కొత్త సభ్య దేశాలుగా ఏ దేశాలను చేర్చుకోవాలో, చేర్చుకోకూడదో; టూర్‌లు, సిరీస్‌ల షెడ్యూళ్లను, నియమాలు, నియంత్రణలనూ ఇంగ్లాండే ప్రధానంగా నిర్ణయించేది.

క్రికెటింగ్ దేశాలు అయిన ఇండియా, పాకిస్థాన్, వెస్టిండీస్‌ను చులకనగా చూసేవారు, లెక్కలోకి తీసుకునేవారు కాదు. అంతర్జాతీయ క్రికెట్ వ్యవహారాలను ఎలా నిర్వహించాలనే విషయమై ఈ దేశాల మాటకు మన్నన ఉండేది కాదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే అది పూర్తిగా సామ్రాజ్యవాద, జాత్యహంకార క్రీడా వ్యవస్థ (1946లో సైతం ఐసీసీ సమావేశాలలో బీసీసీఐ ప్రతినిధిగా ఒక ఆంగ్లేయుడే పాల్గొనేవాడు). 1950ల్లోను, ఆ తరువాయి దశాబ్దంలోను బ్రిటిష్ వలస రాజ్యాలు స్వతంత్ర దేశాలుగా ఆవిర్భవించాయి. ఐసీసీ తన విధి విధానాలలో మరింత ప్రజాస్వామ్యయుతంగా ఉండాలని ఆ కొత్త స్వతంత్ర దేశాల క్రికెట్ బోర్డులు వినయపూర్వకంగా విన్నవించుకునేవి. ఈ విషయంలో భారత్, పాకిస్థాన్‌లు తరచు కలిసికట్టుగా వ్యవహరించి, ఇంగ్లాండ్ ప్రాధాన్యం తగ్గించేందుకు ప్రయత్నించేవని లైయల్ వివరంగా రాశాడు. 1965లో ICCలోని I 'Imperial' నుంచి 'International'గా మారింది. 1989లో 'Conference' అనే పదం స్థానంలోకి 'Council' వచ్చింది. 2005లో ICC ప్రధాన కార్యాలయం లండన్ నుంచి దుబాయికి మారింది. తద్వారా 'ఉపఖండంలోని తన కొత్త అధికార కేంద్రానికి ఆ సంస్థ చేరువయింది'. ఇటీవలి దశాబ్దాలలో ప్రపంచ క్రికెట్ వ్యవహారాల నిర్వహణ (అసమర్థ, అవినీతిదాయక నిర్వహణలో కూడా)లో భారత్ ఎలా ఆధిపత్యం చెలాయిస్తుందో లైయల్ రాశాడు. ఆయన కథనంలో కొన్ని పొరపాట్లు ఉన్నాయి. 1983 ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో భారత్ విజయం ప్రాధాన్యాన్ని లైయల్ గుర్తించినట్టు కనిపించలేదు; సాక్ష్యాధారాలు చూపకుండానే, 2011 ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ విజయం 'మ్యాచ్ ఫిక్సింగ్' వల్లే సాధ్యమయిందని రాశాడు.

> గత వంద సంవత్సరాలుగా ప్రపంచ క్రికెట్ వ్యవహారాలలో భారత్ పాత్ర వేర్వేరు దశలలో భిన్నరీతులలో ఉన్నది: తొట్ట తొలుత శ్వేతజాతీయుల ఆధిపత్యాన్ని వినయపూర్వకంగా గౌరవించింది. ఆ తరువాత సమాన ప్రతిపత్తికి ఆరాటపడింది. అనంతరం ఒక ప్రముఖ పాత్రను సముపార్జించుకున్నది. అంతిమంగా ఇప్పుడు తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది.



■ రామచంద్ర గుహ

గతానుగతం

మొత్తం మీద బీసీసీఐ మొరటు సామ్రాజ్యవాద ఆకాంక్షల గురించి లైయల్ రాసిన విషయాలు నిష్పాక్షికంగా ఉన్నాయి. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు, ఐసీసీ ఛైర్మన్ శశాంక్ మనోహర్ అరుదైన వివేకవంతుడని పేర్కొంటూ బీసీసీఐ సంకుచిత ప్రయోజనాలకు అతీతంగా ఆలోచించిన, వ్యవహరించిన అగ్రశ్రేణి భారతీయ క్రికెట్ పాలనాధికారి అని లైయల్ వ్యాఖ్యానించాడు. అంతేకాకుండా 'శశాంక్ వంటి ప్రాజ్ఞులు ముఖ్యంగా భారత్‌లో అరుదుగా ఉంటారని' కూడా లైయల్ వ్యాఖ్యానించాడు.

డిసెంబర్ 2024లో హోంమంత్రి అమిత్ షా కుమారుడు జై షా ఐసీసీ ఛైర్మన్ అయ్యాడు. లైయల్ ఇలా రాశాడు: 'ఒకప్పుడు ఎంసీసీ (Marylebone Cricket Club) విదేశీ విభాగం'గా ఉన్న ఐసీసీ ఇప్పుడు జాతీయవాద భారత రాజకీయ పార్టీ, దాని కార్పొరేట్ ఆకాంక్షల సాధనకు ఒక ఉపకరణమైపోయింది. ప్రపంచ క్రికెట్‌కు ఎంసీసీ ఒకప్పుడు ఎలా ఉండేదో ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌కు బీసీసీఐ అలా పరిణమిస్తోందని ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ టోనీ గ్రెగ్ సరిగానే భావించాడు. 'గ్యాంబ్లింగ్, అసమర్థ నిర్వహణ, ఐసీసీ సభ్య దేశాల మధ్య అధికారాల అసమ పంపిణీ మొదలైనవి ప్రస్తుతం క్రికెట్‌ను పీడిస్తున్న సమస్యలు' అని 2012లో ఆయన ఒక ఉపన్యాసంలో వ్యాఖ్యానించాడు. క్రికెట్ స్ఫూర్తికి భారత్ నిబద్ధమయి వ్యవహరిస్తే ఈ సమస్యలలో చాలా భాగం పరిష్కారమవుతాయని ఆయన ముక్తాయించాడు. 'ప్రపంచ క్రికెట్ వ్యవహారాలను దాదాపు వంద సంవత్సరాల పాటు ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా శాసించాయని... దురదృష్టవశాత్తు చాలా సందర్భాలలో క్రికెట్ స్ఫూర్తి కంటే స్వార్థ ప్రయోజనాలకే ఆ రెండు దేశాలు ప్రాధాన్యమిచ్చాయని, భారత్, న్యూజిలాండ్‌ల పట్ల వివక్ష చూపడం జరిగిందని' గ్రెగ్ అంగీకరించాడు. 'ఇప్పుడు ఐసీసీకి సారథ్యం వహిస్తున్న భారత్ క్రికెట్ స్ఫూర్తితో వ్యవహరించగలదని, వివిధ అంశాలపై ఓటింగ్ విషయంలో ఇతర సభ్య దేశాలను ప్రభావితం చేయబోదనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశాడు.

ప్రపంచ క్రికెట్ వ్యవహారాలలో సంపూర్ణ ఆధిపత్యం సాధించాలనే బీసీసీఐ ప్రగాఢ ఆరాటానికి, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లలోని (స్వార్థ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తున్న) క్రికెట్ అధికారులు తోడ్పడుతున్నారు. ఇదే సమయంలో ఉపఖండంలోని ఇతర దేశాలతో పాటు దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌లోని క్రికెటర్లు, క్రికెట్ అభిమానులు, క్రికెట్ బోర్డుల అధికారులను బీసీసీఐ దూరం చేసుకున్నది. మూడో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ముగిసిన తరువాత ప్రచారంలోకి వచ్చిన ఒక వీడియో, విజేత దక్షిణాఫ్రికా టీమ్ కంటే జై షానే క్రికెట్‌కు చాలా ముఖ్యం అన్నట్లుగా వివరించింది. దీనిపై వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్లు ఆండీ రాబర్ట్స్, మైకేల్ హోల్డింగ్ ప్రతిస్పందిస్తూ ప్రపంచ క్రికెట్ వ్యవహారాలలో భారత్ ప్రదర్శిస్తున్న సామ్రాజ్యవాద ధోరణులపై ధ్వజమెత్తారు.

1909లో ప్రభవించిన నాటి నుంచీ ఐసీసీ కుట్ర, అసమర్థత, అనర్థతలకు నెలవుగానే ఉన్నది. ఇప్పుడు వాటికి అవినీతి, అపకార బుద్ధి తోడయ్యాయి. ఇంగ్లాండ్ సారథ్యంలో అది అంతర్జాతీయ క్రికెట్‌కు అందించిన ఆరోగ్యకరమైన సేవలు స్వల్పమే. ఇప్పుడు భారత్ నాయకత్వంలోనూ పరిస్థితులు మెరుగ్గా లేవు. అసలు భారతీయ క్రికెట్‌కు అయినా బీసీసీఐ ప్రశస్తంగా సేవలు అందిస్తున్నదా అన్నది స్పష్టంగా చెప్పలేము. టెస్ట్ క్రికెట్ అత్యున్నతమైన, ప్రతిష్ఠాత్మక ఆట అని, అది క్రికెట్‌కు అత్యంత సంప్రదాయక ఫార్మాట్ అని ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు అందరూ అంగీకరించారు. అయితే ఇప్పటివరకు మూడుసార్లు జరిగిన ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో టీమ్ ఇండియా ఒక్కసారి కూడా గెలవలేదు. మన క్రికెటర్లు అసంఖ్యాక క్రికెట్ అభిమానుల నుంచి అవధులు లేని ఆరాధన, అంతకు మించి ఆర్థిక లబ్ధి పొందుతున్నారు; బీసీసీఐ కోశాగారంలో అపార ధనరాశులు ఉన్నాయి; మన కుబేరులు, రాజకీయవేత్తలు తమ ఆర్థిక వనరులు, పేరు ప్రతిష్ఠలను భారతీయ క్రికెట్‌కు వెచ్చిస్తున్నారు. అయినా తొలి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో న్యూజిలాండ్ చేతిలో ఇండియా ఓడిపోయింది. (ఆ దేశ జనాభా మన సూరత్ నగర జనాభా కంటే తక్కువ. ద్వితీయ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఇండియా ఓడిపోయింది (ఆ దేశ జనాభా మన ముంబై నగర జనాభా కంటే తక్కువ). ఇక తృతీయ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు ఇండియా చేరనేలేదు!

అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ రికార్డు సాధారణమైనది. గత వంద సంవత్సరాలుగా ప్రపంచ క్రికెట్ వ్యవహారాలలో భారత్ పాత్ర భిన్న కాలాలలో విభిన్నంగా ఉన్నది: తొట్ట తొలుత శ్వేతజాతీయుల ఆధిపత్యాన్ని వినయపూర్వకంగా గౌరవించింది. ఆ తరువాత సమాన ప్రతిపత్తిని అభ్యర్థించింది; అనంతరం ఒక ప్రముఖ పాత్రను సముపార్జించుకున్నది. అంతిమంగా ఇప్పుడు అధికార ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. అంతర్జాతీయ రాజకీయాలను ప్రభావితం చేయడంలో అమెరికా, చైనా, రష్యా కంటే మనం చాలా వెనుక స్థానంలో ఉన్నాం. ఆర్థిక శక్తి విషయంలో (జీడీపీ పరంగా కాకుండా తలసరి ఆదాయం విషయంలో) మనం ప్రస్తుతం ప్రపంచంలో 137వ స్థానంలో ఉన్నాం. అయితే అంతర్జాతీయ క్రికెట్ వ్యవహారాల నిర్వహణ (దుష్ట నిర్వహణలో కూడా) విషయానికి వస్తే భారత్ కేవలం విశ్వ గురు మాత్రమే కాదు, విశ్వ బాస్, ఇంకా చెప్పాలంటే విశ్వ రౌడీ.

(వ్యాసకర్త చరిత్రకారుడు)


ఆదివాసీల హననాన్ని వ్యతిరేకిస్తూ సభ

మధ్య భారతంలో నక్సల్బరీ, తేబాగ, వాయిలార్ సాయుధ రైతాంగ పోరాటం, శ్రీకాకుళం, ఆదివాసులు గిరిజన సాయుధ, ప్రతిఘటనా పోరాటాలు... పాలకులు ఆదివాసుల వైపు దృష్టి సారించడానికి, కొన్ని చర్యలు తీసుకోవడానికి దోహదం చేశాయి. కానీ కార్పొరేట్లకు ఖనిజ సంపదను అప్పజెప్పడం కోసం ప్రభుత్వాలు ఆదివాసీల హననాన్ని కొనసాగిస్తున్నాయి. ఆపరేషన్ కగార్ పేరుతో పచ్చి హత్యాకాండను మోదీ–అమిత్‌షా నేతృత్వంలోని ప్రభుత్వం సాగిస్తోంది. సత్యశోధన చేయడానికి పౌరహక్కుల సంఘాలను కూడా అనుమతించకపోవడం ఆపరేషన్ కగార్ ప్రత్యేకత. ఓవైపు మావోయిస్టు పార్టీ శాంతి చర్చల కోసం ప్రకటన చేసినా, మేధావులు, ప్రజలు కోరుతున్నా ప్రభుత్వం వారిని నిర్మూలిస్తామనే అంటోంది కానీ, ప్రజాస్వామికంగా వ్యవహరించడం లేదు. ఈ నేపథ్యంలో కాల్పుల విరమణ ప్రకటించాలని, ఎన్‌కౌంటర్ పేరుతో ఆదివాసీల, ఉద్యమకారుల జీవించే హక్కును రక్షించాలని, ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలని, పోలీసు క్యాంపులను వెంటనే ఎత్తివేయాలని, అటవీ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రేపు బహిరంగ సభ జరుగనున్నది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వరంగల్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగే ఈ సభలో ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్, జాన్ వెస్లీ, జె.వి.చలపతిరావు, పోటు రంగారావు, మల్లెపల్లి ప్రభాకర్, కె.విశ్వనాథ్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి, గోడం గణేష్, సోనీ సోరీ, బేల బాటియా, అభినవ్ బూరం, రిటైర్డ్ ప్రొఫెసర్ కె.వెంకటనారాయణ, ఎస్.నారాయణరావు, రమణాల లక్ష్మయ్య, టి.రత్న కుమార్ ప్రసంగిస్తారు.

– ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక, తెలంగాణ

అంతరిక్ష పరిశోధనలో నవ శకం

భారతదేశం నూతన అంతరిక్ష సాంకేతికతతో విశ్వ రహస్యాల అన్వేషణకు సిద్ధమవుతున్నది. 2023, ఆగస్టు 23న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్–3లోని విక్రమ్ ల్యాండర్ 'శివశక్తి' అనే ప్రదేశంలో సురక్షితంగా దిగింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఆగస్టు 23ని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నది. ఈ మిషన్ విజయం అంతరిక్ష రంగంలో ఒక చారిత్రాత్మక మైలురాయి. భారతదేశం చంద్రునిపై విజయవంతంగా అడుగు పెట్టిన నాల్గవ దేశంగా, దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని చేరుకున్న మొదటి దేశంగా అవతరించింది. ఈ దినోత్సవం అంతరిక్ష పరిశోధన ప్రాముఖ్యతపై అవగాహన, విద్యను ప్రోత్సహించడానికి ఒక వేదిక కానున్నది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్‌లో వృత్తిని కొనసాగించడానికి భవిష్యత్తు తరాలకు ప్రేరణ ఇవ్వనున్నది. ఈ ఏడాది 'ఆర్యభట్ట నుంచి గగన్‌యాన్ వరకు: ప్రాచీన జ్ఞానం నుంచి అనంతమైన అవకాశాలు' అనే ఇతివృత్తంతో అంతరిక్ష దినోత్సవం నిర్వహించుకుంటున్నాం.



2040 నాటికి భారతీయ వ్యోమగామిని చంద్రుడిపైకి పంపాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని ఇస్రో నిర్దేశించుకున్నది. ఈ లక్ష్య సాధన దిశగా ప్రయాణించడానికి గగన్‌యాన్ మిషన్ కీలకం కానున్నది. భూమికి దగ్గరగా 400 కిలోమీటర్ల దూరంలో భూ కక్ష్యలోకి పంపి, వారిని సురక్షితంగా తిరిగి తీసుకురావడం ఈ మిషన్ తొలి లక్ష్యం. ఇందులో భాగంగా మొదట 2026 నాటికి వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపనున్నారు. అనంతరం 2027లో మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్ యాన్ చేపట్టనున్నారు. మరోవైపు ఇస్రో 2035 నాటికి సొంతంగా ఒక అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అనంతరం మానవ సహిత చంద్రుడి యాత్రకు సిద్ధం కానుంది. చంద్రయాన్–4లో చంద్రుడి ఉపరితలం నుంచి నమూనాలను సేకరించి భూమికి తిరిగి తీసుకురావడం ప్రధాన లక్ష్యం. ఎల్వీఎం అనే పెద్ద రాకెట్లతో డాకింగ్ ద్వారా ఈ ప్రయోగం నిర్వహించనున్నారు. ఈ సాంకేతికత భవిష్యత్తులో మానవ సహిత యాత్రలకు, అంతరిక్ష కేంద్రాల నిర్మాణానికి చాలా అవసరం. ఇటీవల భారత వాయుసేన పైలట్, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా యాక్సియం–4 మిషన్‌లో ముగ్గురు వ్యోమగాములతో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ప్రయాణించి తిరిగి వచ్చారు. చంద్రయాన్–3 విజయవంతమైన తర్వాత, జపాన్ స్వయంగా భారత్ సహకారం కోరింది. దీంతో ఇస్రో, జపాన్ అంతరిక్ష సంస్థ JAXA కలిసి చంద్రయాన్–5/LUPEX మిషన్ కోసం పనిచేయాలని నిర్ణయించారు.

ఇస్రో అత్యంత ఖచ్చితత్వంతో తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలు ప్రయోగిస్తున్నది. మరోవైపు వాణిజ్య ఉపగ్రహాలతో విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జిస్తోంది. ఇస్రో ప్రయోగించే ఉపగ్రహాలతో వాతావరణ సూచన, సమాచార మార్పిడి (టీవీ, ఇంటర్నెట్), నావిగేషన్ (జీపీఎస్), భూమి పరిశీలన (పర్యావరణ మార్పులు, విపత్తులు), శాస్త్రీయ పరిశోధన, రక్షణ వంటి అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయి. మరోవైపు ఇస్రో పునర్వినియోగ రాకెట్ల(పుష్పక్) తయారీ, చిన్న రాకెట్ల ప్రయోగ వేదికను సిద్ధం చేస్తున్నది. వీటితో తక్కువ ఖర్చుతో ఉపగ్రహాల ప్రయోగం, చిన్న ఉపగ్రహాల సత్వర ప్రయోగానికి బీజం పడనున్నది. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగంలో ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధానాన్ని ప్రకటించింది.


అంతరిక్ష ప్రయోగాల పట్ల పిల్లలు, యువతలో ఆసక్తి పెంచాలి. ఉన్నత విద్య, పరిశోధనలో యువ భాగస్వామ్యాన్ని పెంచాలి. శాస్త్ర పరిశోధనలకు మన దేశ జీడీపీలో ఒక శాతం లోపే ఖర్చు చేస్తున్నారు. మరింత బడ్జెట్ కేటాయించి, నూతన ఆవిష్కరణలతో ముందుకెళ్లాలి. ఉద్యోగాల సృష్టి జరగాలి. అప్పుడే వికసిత్ భారత్ 2047 కల సాకారం అవుతుంది.

■ సంపతి రమేష్ మహారాజ్

అఖిల భారత ఐక్య రైతు సంఘం ప్రథమ మహాసభలు

అనేక రాష్ట్రాల్లో వివిధ పేర్లతో విడివిడిగా పని చేస్తున్న రైతు సంఘాలు 2024 డిసెంబర్‌లో కలకత్తాలో సమావేశమై అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఎఐయుకెఎస్)గా ఏర్పడ్డాయి. ఈ సంఘం అనేక రైతు సమస్యలపై పోరాడుతున్నది. సాగు సమస్యల పరిష్కారానికి, రైతు రక్షణకు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం సమైక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది. దీనిని అర్థం చేసుకున్న ఎఐయుకెఎస్ స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని, ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం)తో కలిసి పనిచేస్తున్నది. రైతు వ్యతిరేక నల్లచట్టాలను రద్దు చేసినట్టు ప్రకటించి, 'జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం' రూపంలో మోదీ ప్రభుత్వం మళ్లీ వీటిని తీసుకొచ్చింది. దీనికి వ్యతిరేకంగా ఎఐయుకేఎస్, ఎస్‌కేఎంతో కలిసి పోరాడుతున్నది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలని కూడా పోరాడుతోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోవడానికి ఆగస్టు 25, 26 తేదీలలో మహబూబ్‌నగర్‌లో ఎఐయుకెఎస్ ప్రథమ మహాసభలు జరుగనున్నాయి. ఆగస్టు 25న మధ్యాహ్నం 12 గంటలకు ఇండస్ట్రియల్ ఏరియా గ్రౌండ్ నుంచి రైతు మహా ప్రదర్శన జరుగుతుంది. అనంతరం మూడు గంటలకు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో బహిరంగసభ జరుగుతుంది. ఈ సభలో కెచ్చెల రంగారెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్, పోటు రంగారావు, ఎం.దామోదర్‌రావు, గుమ్మడి నర్సయ్య, వి.ప్రభాకర్, ఎం.కృష్ణ, ఎం.హన్మేశ్, బి.రాము, సిహెచ్.రాంచందర్ ప్రసంగిస్తారు. ఆగస్టు 26న రాయల చంద్రశేఖర్‌నగర్‌లో ప్రతినిధుల సభ జరుగుతుంది. ఇందులో జస్టిస్ చంద్రకుమార్, విమల్ త్రివేది, కె.జి.రాంచందర్, ఎస్.ఎల్.పద్మ ప్రసంగిస్తారు.

– అఖిల భారత ఐక్య రైతు సంఘం
తెలంగాణ



నేడు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ రాక



హనుమకొండ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, వరంగల్ ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఇన్‌చార్జి అడ్లూరి లక్ష్మణ్ శనివారం హనుమకొండకు రానున్నారు. డీసీసీ కార్యాలయంలో జరిగే ఉమ్మడి జిల్లా ముఖ్య నేతల సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, తదితర ముఖ్య నేతలు పాల్గొనే సమావేశం ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కానుంది. స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన తరువాత లక్ష్మణ్ తొలిసారిగా వరంగల్‌కు వస్తున్నారు.

మిల్లర్లు మహా మాయగాళ్లు

వేలం వేసిన సీఎంఆర్ బియ్యాన్ని అమ్ముకున్న వైనం



- మిల్లర్ల వద్ద ఉన్న 2022-23 సీఎంఆర్ బియ్యానికి ఫిబ్రవరిలో వేలం
- 407.55 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లుల్లో మాయం
- వేలంలో దక్కించుకున్న బియ్యం కోసం కాంట్రాక్టర్ల ఒత్తిడి
- వేలం బియ్యం రికవరీకి అధికారుల ప్రయత్నాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.407కోట్ల బియ్యం పక్కదారి

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

వేలం వేసిన బియ్యాన్ని అమ్ముకున్న మిల్లర్ల బాగోతం ఇది. పైసా పెట్టుబడి లేకుండా సర్కారు బియ్యంతో కొందరు మిల్లర్లు అక్రమ వ్యాపారం చేస్తున్న వైనం ఇది. ఏళ్ల తరబడి కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను ప్రభుత్వానికి అప్పగించకుండా దొంగాటడుతున్న మిల్లర్ల తీరు చర్చనీయాంశంగా మారుతుంది. కేసులు, విచారణలతోనే సివిల్ సప్లయీస్ అధికారులు కాలక్షేపం చేస్తున్నారే తప్ప, కఠినంగా వ్యవహరించటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2022-23కు సంబంధించిన సీఎంఆర్ సుమారు 2.76లక్షల మెట్రిక్ టన్నులు మిల్లర్ల వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ బియ్యాన్ని గత ఫిబ్రవరి నెలలో పౌరసరఫరాల శాఖ అధికారులు వేలం వేశారు. వేలంలో దక్కించుకున్న కాంట్రాక్టర్లకు బియ్యాన్ని అప్పగించాల్సి ఉండగా, మిల్లులో నిల్వ ఉండాల్సిన బియ్యం మాయమయ్యాయి. అధికారుల కళ్లుగప్పి మిల్లర్లు 2022-23 పెండింగ్ సీఎంఆర్‌ను దారి తప్పించారు. సుమారు రూ.407.55కోట్ల విలువైన బియ్యాన్ని మిల్లర్లు దారితప్పించినట్లుగా సమాచారం. వేలంలో బియ్యం దక్కించుకున్న తమకు బియ్యం ఇవ్వాలని కాంట్రాక్టర్లు ఒత్తిడి తెస్తుండగా, మిల్లర్ల నుంచి బియ్యాన్ని రికవరీ చేయటం అధికారులకు తలనొప్పిగా మారింది.

2022-23 పెండింగ్ సీఎంఆర్ వేలం

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను ప్రభుత్వానికి అప్పగించటంలో కొందరు మిల్లర్లు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మిల్లర్లు క్వింటాల్ వడ్లకు 67కిలోల చొప్పున కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలి. వడ్లను మారాడించినందుకు ప్రభుత్వం మిల్లర్లకు చార్జీలు చెల్లిస్తుంది. అయితే నిర్ణీత సమయంలో మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి బియ్యాన్ని అప్పగించాల్సి ఉన్నప్పటికీ మిల్లర్లు లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయటం లేదు. సీఎంఆర్ గడువును ప్రభుత్వం పలుమార్లు పొడిగించిన ఫలితం లేకుండా పోతోంది. ఫలితంగా 2022-23, 2024-25కు సంబంధించిన సీఎంఆర్ లెక్కలు తేలటం లేదు. దీంతో ప్రభుత్వం గత ఏడాది సీఎంఆర్ పెండింగ్‌పై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 45కు పైగా మిల్లులపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి 2022-23, 2024-25కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బియ్యాన్ని గుర్తించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీన పౌరసరఫరాలశాఖ అధ్వర్యంలో ఈ వేలం నిర్వహించారు. ఇందులో వరంగల్ జిల్లా నుంచి 75,090.13 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని వేలం నిర్వహించారు. అలాగే హనుమకొండ జిల్లాలో 49,280.45 మెట్రిక్ టన్నులు, మహబూబాబాద్ జిల్లాలో 60,471 మెట్రిక్ టన్నులు, జనగామ జిల్లాలో 46,686.046 మెట్రిక్ టన్నులు, భూపాలపల్లి జిల్లాలో 44,296మెట్రిక్ టన్నుల బియ్యాన్ని వేలంలో పెట్టారు. ములుగు జిల్లా మినహా మిగతా ఐదు జిల్లాల్లో 2,75,823.626మెట్రిక్ టన్నుల బియ్యం వేలం నిర్వహించారు. ఇంతా భారీ ఎత్తున రెండు, మూడేళ్లుగా మిల్లర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికి పౌరసరఫరాల శాఖ అధికారుల ఉదాసీనతే మిల్లర్ల అక్రమాలకు దారులు వేస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేలం బియ్యం మాయం

మిల్లర్ల బియ్యం దందా మరోసారి వెలుగులోకి వచ్చింది. ఎఫ్‌సీఐ, పౌరసరఫరాల శాఖ అధికారులతో కొందరు మిల్లర్లు దొంగాటాడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న (మిగతా 7లో..)

పీఆర్ భవనాల నిర్మాణానికి నిధుల వరద

ఉమ్మడి జిల్లాకు రూ.20 కోట్లు మంజూరు



హనుమకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ గ్రామీణాభి వృద్ధి (పీఆర్‌ఈడీ) భవనాల నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ భారీగా నిధులు కేటాయించింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కృషితో ఇది సాధ్యమైంది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్.శ్రీధర్ జీవోఆర్‌టీ నెం.515 ద్వారా ఉత్తర్వులు మంజూరు చేశారు, ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కార్యాలయాల భవనాల నిర్మాణానికి రూ.20కోట్లు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంచాయితీరాజ్ పనులు చేపడతారు. ములుగులో ఎస్‌ఈ (వీక్యూసీ) కార్యాలయం కోసం రూ.1.50లక్షలు, ఇదే జిల్లాలోని మల్లంపల్లిలో ఎంపీపీపీ భవనానికి రూ.1.50కోట్లు, ములుగు జిల్లా ఏటూరునాగారంలో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.1.50కోట్లు, ములుగులో ముస్లింల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.1.50కోట్లు ములుగులో వివిధ అభివృద్ధి పనులకు మరో రూ.1.50కోట్లు, హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో ఎంపీపీ భవనానికి రూ.1.50కోట్లు, మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో మహిళా స్వయం సహాయక బృందాల కోసం భవన నిర్మాణానికి రూ.2 కోట్లు వీటిలో ఉన్నాయి. వరంగల్‌లో ఇంటిగ్రేటెడ్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ భవన సముదాయం నిర్మాణానికి రూ.8కోట్లు కూడా మంజూరయ్యాయి.



ఆరోగ్య సిబ్బందికి అనారోగ్యం

- కేఎంసీ వైద్య విద్యార్థులకు డెంగీ
- ఇద్దరు బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు కూడా..

వరంగల్ మెడికల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలో ఆరోగ్య సేవలు అందిస్తున్న సిబ్బంది అనారోగ్యం బారిన పడుతున్నారు. కాకతీయ వైద్య కళాశాల ఆవరణలోని హాస్టల్‌లో ఉంటూ ఎంజీఎం సర్జికల్ విభాగంలో సీనియర్ పీజీగా ఉన్న ఓ విద్యార్థికి డెంగీ పాజిటివ్ నమోదైంది. గత వారంలో ఆస్పత్రిలోని బీఎస్సీ నర్సింగ్ అభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థినులు కూడా డెంగీ బారిన పడ్డారు. ఆరోగ్య సేవలు అందించే సిబ్బంది క్రమంగా అనారోగ్యం పాలు కావడం వైద్యులను కలవరానికి గురి చేస్తోంది. కాకతీయ వైద్య కలాశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులు పదిరోజులుగా సమ్మెకు దిగారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆందోళన చేపట్టారు. ఫలితంగా కేఎంసీ ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీనికి తోడు ఇటీవల వర్షాలు పడటంతో పరిసరాల్లో దోమలు పెరిగాయి. దోమకాటువల్ల పలువురు డెంగీవ్యాధికి గురవుతున్నట్లు తెలుస్తోంది. ఎంజీఎం చుట్టూ పరిసరాల్లో నీటి నిల్వలు పెరగడం వల్ల దోమలు అభివృద్ధి చెందినట్లు తెలుస్తోంది. ఇతర అనారోగ్య కారణాలతో ఎంజీఎం వచ్చిన రోగులకు సైతం చికిత్స పొందుతున్న సమయంలో డెంగీగా నమోదు అవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కేఎంసీ కళాశాల ఆవరణతోపాటు ఎంజీఎంలో దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా BOI — వరంగల్ శాఖ
13-4-158 & 158/1, సాయినాథ్ ఆర్కేడ్, గోపాల స్వామి టెంపుల్ సమీపాన, ఎం.జి.రోడ్., వరంగల్

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్, 2002 లోని రూల్ 3తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **బ్యాంక్ ఆఫ్ ఇండియా, వరంగల్ శాఖ** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు ప్రకటన స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా ప్రకటనలో తెలిపిన మొత్తం **రూ.22,53,004.70 (రూపాయలు ఇరవై రెండు లక్షల యాభై మూడు వేల నాలుగు మరియు డెబ్బై పైసలు మాత్రమే)** ప్లస్ **29.05.2025** నుండి దానిపై చార్జ్ చేయని వడ్డీ ఇతర వ్యయాలు, ఖర్చులు, చార్జీలు వగైరా కలుపుకుని తిరిగి చెల్లించమని రుణగ్రహీత **శ్రీ తాళ్లపల్లి రాజేందర్** మరియు **శ్రీమతి తాళ్లపల్లి రాజశ్రీలను** కోరుతూ **06.06.2025** తేది గల డిమాండ్ ప్రకటనను జారీ చేశారు.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే సెక్షన్ 13 (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **20 ఆగస్ట్ 2025న** స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారాలైనా **శ్రీ తాళ్లపల్లి రాజేందర్** మరియు **శ్రీమతి తాళ్లపల్లి రాజశ్రీ** సదరు మొత్తం **రూ.22,53,004.70 (రూపాయలు ఇరవై రెండు లక్షల యాభై మూడు వేల నాలుగు మరియు డెబ్బై పైసలు మాత్రమే)** ప్లస్ **29.05.2025** నుండి దానిపై చార్జ్ చేయని వడ్డీ ఇతర వ్యయాలు, ఖర్చులు, చార్జీలు వగైరా కలుపుకుని రాబట్టుకున్నవి తగ్గించుకుని **బ్యాంక్ ఆఫ్ ఇండియా, వరంగల్ శాఖ** వారికి చెల్లించుటకు లోబడియుంటాయి.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించాల్సిందిగా రుణగ్రహీత కోరబడుచున్నారు.

స్థిరాస్తి వివరణ:

వరంగల్ అర్బన్, ఎస్ఆర్‌వో అధికారిక పరిధిలో వరంగల్, నగర పాలక సంస్థ పరిధులలోని, వరంగల్, శివ నగర్ వద్ద గల 131.47 చ.గజాలు లేదా 109.92 చ.మీటర్లు విస్తీర్ణం కలిగిన GWMC ఇనం. 16-4-1503 కలిగిన భవనం వద్ద గల నివాసిత ఆస్తి యొక్క EQM **సరిహద్దులు:** తూర్పు: 2వ పార్టీకి కేటాయించిన ఖాళీ ప్రదేశం మిగిలిన భాగం, ఇనం. 16-4-1503 భాగం, పశ్చిమం: 1 నుండి 3 పార్టీలకు కేటాయించబడిన ఖాళీ ప్రదేశం మిగిలిన భాగం. ఇనం. 16-4-1503 భాగం, ఉత్తరం: తాళ్లపల్లి నవీన్ ఇంటి నం. 16-4-1502, దక్షిణం: 30' వెడల్పు రోడ్.

శ్రీ తాళ్లపల్లి రాజేందర్‌కు పేరున కలిగిన ఆస్తి.

తేది: 20.08.2025. ప్రదేశం: వరంగల్ — అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ ఇండియా

పెన్షన్ పత్రాల్లో పొరపాట్లు ఉండొద్దు

- విశ్రాంత ఉద్యోగులు అవగాహన పెంచుకోవాలి
- ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్



పెన్షన్ మంజూరు పత్రాలను అందజేస్తున్న చందా పండిట్

హనుమకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందే ఉద్యోగులు పెన్షన్, జీపీఎఫ్ చెల్లింపు పత్రాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా డీడీవోలు, అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి సమర్పించాలని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్ ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి విశ్రాంత ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్ సమస్యలపై డీడీవోలు, ఖజానా శాఖ అధికారులతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో చందా పండిట్‌తో పాటు, హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందా పండిట్ మాట్లాడుతూ.. రిటైర్ అయిన తర్వాత వచ్చే బెనిఫిట్స్ గురించి ఉద్యోగులు పూర్తిగా తెలుసుకోవాలన్నారు. పెన్షన్, జీపీఎఫ్ పొందటానికి అన్ని పత్రాలు సరిగా ఉన్నాయా..? లేదా అనేది నిర్ధారించుకోవాలన్నారు. ట్రెజరీ అధికారులు కూడా ఎలాంటి పొరపాట్లు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ ఏజీ కార్యాలయం డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ అభయ్ అనిల్ కుమార్ సోనార్కర్, నరేష్ కుమార్, ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు. పెన్షన్, జీపీఎఫ్ సమస్యల పరిష్కార కోసమే ప్రత్యేకంగా ఈ అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్లకు పెన్షన్ చెల్లింపు ఆర్డర్లు, జీపీఎఫ్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల రెవెన్యూ అధికారులు వైవి గణేష్, విజయలక్ష్మి, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, ఉమ్మడి జిల్లాల్లోని డీడీవోలు, పెన్షనర్లు పాల్గొన్నారు.

వరంగల్ డీఈవో బదిలీ



జ్ఞానేశ్వర్

- నిర్మల్ డీఈవో ఆఫీస్‌లో ఎఫ్ఏవోగా నియామకం
- వరుస వివాదాల నేపథ్యంలో డీఎస్ఈ చర్య

6



తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ప్రాంతీయ వాణిజ్య కార్యాలయం-వరంగల్

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింద చూపబడిన ఖాతాదారులు మా శాఖలలో తమ బంగారు ఆభరణముల హామీపై పొందిన అప్పులు తిరిగి చెల్లించమని అనేక డిమాండ్ నోటీసులు ఇచ్చినసూ అప్పులు చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం **తేది: 30.08.2025 మ॥ 3 గం॥ల నుండి 4 గం॥ల వరకు** ఆయా శాఖలలో బహిరంగ వేలం వేయబడును.

శాఖ పేరు	ఖాతా నెంబరు	రుణ గ్రహీత పేరు మరియు చిరునామా
ఆకులవారి ఘన్‌పూర్	73222708098	శ్రీమతి పోలుదాసరి రాధ, 1471-5ఎ, ఎస్‌టి కాలనీ, తాడువాయి, వరంగల్
ఆకులవారి ఘన్‌పూర్	73222872183	శ్రీ అంకం హరీష్, అకులవారి ఘన్‌పూర్
ఆకులవారి ఘన్‌పూర్	73223423556	శ్రీ కోరగట్ల రాకేష్, షాపల్లె, ఏటూరు నాగారం
బలపాల్	73222144518	శ్రీ పలాసం సతీష్, 3-95, చిలుకోడు, డోర్నకల్
బలపాల్	79084403314	శ్రీమతి మూడ్ ప్రమీల, కంచర్లగూడెం తండా, కురవి,
బలపాల్	73233172905	శ్రీమతి తడకమల్ల ఉమా, 2-65/3, చిలుకోడు, డోర్నకల్
బలపాల్	73222755152	కుమారి గంటా దర్గామ్మ, బలపాల, కురవి
బయ్యారం	73223353621	శ్రీ రాగం వీరేష్, కురవి
బయ్యారం	73223724654	శ్రీ రాగం వీరేష్, కురవి
భీమారం	79088485656	శ్రీమతి రేణుకుంట్ల ప్రియ, 55-2-215, ఆర్‌సిఎం చర్చ్, భీమారం
భీమారం	79088486637	శ్రీమతి రేణుకుంట్ల ప్రియ, 55-2-215, ఆర్‌సిఎం చర్చ్, భీమారం
భీమారం	79084493423	శ్రీ దుర్గం అశోక్, 1-34, చింతగట్టు, వరంగల్
భీమారం	73232039907	శ్రీ మహమ్మద్ అహ్మద్ పాషా, 53-1-25, ఎల్లాపూర్, హసన్‌పర్తి
భీమారం	73232040797	శ్రీ మహమ్మద్ అహ్మద్ పాషా, 53-1-25, ఎల్లాపూర్, హసన్‌పర్తి
భీమారం	73222776068	శ్రీ గొల్లపల్లి సారయ్య, ఇం.నెం.1-197, సదానంద కాలనీ, భీమారం
చెల్పూర్	73222449644	శ్రీమతి మారెళ్ల పద్మ, 4-80, చెల్పూర్, ఘన్‌పూర్ మండలం
దామెర	73222551895	శ్రీ బత్తా శ్రీనివాస్, ఇంటి నంబర్ 11-27-30, వరంగల్
దామెర	73216472525	శ్రీమతి కాసు శిల్ప, 22-8-13, క్యూఎస్.13, డాక్టర్స్ కాలనీ బాలాజీ నగర్, వరంగల్
దంతాలపల్లి	73222747822	శ్రీ అజ్మీరా లాలాసింగ్, సి-156, గోపతండ, పెదనాగారం
దంతాలపల్లి	73223112256	శ్రీ గాదిపల్లి కృష్ణ 2-45/ఎ, కోమటిపల్లె, కేసముద్రం
దంతాలపల్లి	73223148318	శ్రీ భుక్య భద్రు, ఇం.నెం.6-1, తారాసింగ్ తండా, నర్సింహులపేట
దంతాలపల్లి	73223163630	శ్రీమతి కంచెనపల్లి యేలేంద్ర, సి-69, వంతాడ్పుల, నర్సింహులపేట
దంతాలపల్లి	73223265917	శ్రీ బదావత్ నవీన్, ఇం.నెం., ధన్‌సింగ్ తండా, రామన్నగూడెం
దంతాలపల్లి	73223470517	శ్రీ సెగ్గెమ్ లింగయ్య, 5-57, ఉప్పలగడ్డ, పెద్దముప్పారం
దంతాలపల్లి	73223617972	శ్రీమతి సయ్యద్ రఫియా, 4-68, దాట్ల, మెయిన్ రోడ్, నర్సింహులపేట
దంతాలపల్లి	73223646460	శ్రీమతి పాండవుల మాధవి, వంతాడ్పుల, నర్సింహులపేట
దంతాలపల్లి	73223646674	శ్రీమతి పాండవుల మాధవి, వంతాడ్పుల, నర్సింహులపేట
దంతాలపల్లి	73223702890	శ్రీమతి భూక్యబోయిన లక్ష్మమ్మ, ఇం.నెం.2-148, బొనకొండ, వేములపల్లి
దంతాలపల్లి	73223708371	శ్రీ వాంకుడోతు నామ, సి-14, పెద్దనాగారం, నర్సింహులపేట
దంతాలపల్లి	73223762758	శ్రీ ఆక్కుల శ్రీను, బీరిశెట్టిగూడెం, నర్సింహులపేట, సి 129 (1)
దంతాలపల్లి	73223819286	శ్రీమతి పెండ్ర వెంకటమ్మ, 5-104-1, మెయిన్ రోడ్, నర్సింహులపేట
దంతాలపల్లి	73223828213	శ్రీ బానోతు సోమల, సి 14, వంతాడ్పుల, వంతాడ్పుల
డోర్నకల్	73223684905	శ్రీమతి చింతకాయల లింగమ్మ, 6-36, తోడెళ్లగూడెం, డోర్నకల్
డోర్నకల్	73223942323	శ్రీ నల్లబెల్లి హరీష్, 1-28, యాదవ నగర్, తహసీల్దార్ బంజారా
ఎల్లంద	73221644806	శ్రీమతి జానోత్ నీలా, ఎన్ఎస్ తండా, డిసి తాండా
గార్ల	73222644475	శ్రీ బానోత్ వీరన్న, 6-48, ముత్తి తండా, పోచారం, గార్ల
గార్ల	79088744599	శ్రీ బానోత్ రమేష్, 2-188, బర్లగూడెం, పొన్నేకల్
గార్ల	73223530680	శ్రీ బానోత్ వీరన్న గార్ల
గార్ల	73222733863	శ్రీ సోమబోయిన నాగేశ్వరరావు, ముల్కనూర్, 1-110
గవిచెర్ల	79089027149	శ్రీమతి సరిత కుమారి, గవిచెర్ల, సంగెం, వరంగల్
గూడూరు	73222173718	శ్రీ పొడుగు రామారావు, ఇం.నెం.1-53, కర్లాయి, కొత్తగూడ, వరంగల్
గూడూరు	73223054575	శ్రీ దీకొండ ఉమా, 2-33, సీతానగర్, గూడూరు
హనుమకొండ	79087910343	శ్రీమతి రమ్య వెహోస్, ఇం.నెం.1-9-1234, సంది హిల్స్, హంటర్ రోడ్, హన్మకొండ
హనుమకొండ	79088209652	శ్రీ చర్బి సీతారాం రెడ్డి, 2-10-309/1/4, వడ్డేపల్లి, హన్మకొండ
హసన్‌పర్తి	79087530995	శ్రీ కాల్వ అంజయ్య, ఇం.నెం.1-7 1, యాదవ నగర్, హసన్‌పర్తి
హసన్‌పర్తి	79087829383	శ్రీమతి కాల్వ యశోద, ఇంటి నంబర్ 1-4/3, హసన్‌పర్తి
హసన్‌పర్తి	73223109184	శ్రీ దండుగూడెం శ్రీనివాస్ 4-40, వి హసన్‌పర్తి, వరంగల్
హసన్‌పర్తి	73223712026	శ్రీమతి సమత ఇందూరి, 27-4-59, గాంధీ నగర్, హసన్‌పర్తి
హసన్‌పర్తి	73223739412	శ్రీమతి గొడిశాల మమత 11-83, ఇందిరా కాలనీ, హసన్‌పర్తి
హంటర్ రోడ్	79084399883	శ్రీ గోకా రమేష్, 23-6-59-29, కొత్త వాయంపేట, హన్మకొండ
హంటర్ రోడ్	79084845309	శ్రీ సూరం విజయ్, ఇం.నెం.16-4-873-1, శివనగర్, వరంగల్
హంటర్ రోడ్	79088356562	శ్రీమతి తాడుగుల అనూష, 23-4-91, హంటర్ రోడ్, కొత్త వాయంపేట, హన్మకొండ
హంటర్ రోడ్	79088421205	శ్రీమతి గుజ్జ దివ్య, 117 అశోక్ నగర్, వర్ధన్నపేట
హంటర్ రోడ్	79088422425	శ్రీమతి గుజ్జ దివ్య, 117, అశోక్ నగర్, వర్ధన్నపేట
జులైవాడ	79093151738	శ్రీమతి మహ్మద్ జనాబీ, 1-7-267, ప్రగతి నగర్, సుబేదారి, హన్మకొండ
జులైవాడ	79086141605	మిస్టర్ పిండి విట్టల్, 1-9-764, రెవెన్యూ కాలనీ, జులైవాడ, హన్మకొండ
జులైవాడ	79086142315	మిస్టర్ పిండి విట్టల్ 1-9-764, రెవెన్యూ కాలనీ, జులైవాడ, హన్మకొండ
జులైవాడ	79088332904	శ్రీ షేక్ రహీమ్ 18-400, కార్ల్‌మార్క్స్ కాలనీ, భూపాలపల్లి, వరంగల్
కాశీబుగ్గ	73223013957	శ్రీమతి ఒకీరా సుల్తానా, 11-23-2003/1, ఎల్‌బి నగర్ [illegible], వరంగల్
కాజీపేట	73222624639	శ్రీ బైరపాక శివాన్, 3-36, ధర్మాపురం, వరంగల్
కేసముద్రం	79093767814	శ్రీ మహమ్మద్ సర్వార్ ఖాన్, ఇం.నెం.1-206, కిష్టాపురం, కేసముద్రం
కేసముద్రం	79086313326	శ్రీ రాము జాటోత్, 2-128/6, దుబ్బా తండా, మహమూద్‌పట్నం
కేసముద్రం	79087619241	శ్రీ సునావత్ లక్ష్మణ్, 5-64, భవానీగడ్డ తండా, కాట్రపల్లె
కేసముద్రం	79088483705	శ్రీమతి మరగని సవిత, ఇం.నెం.4-251, కేసముద్రం
కురవి	79088137164	శ్రీమతి ఆమెద లలిత, 1-45, కురవి
కురవి	73223854550	శ్రీ నిమ్మశెట్టి మహేశ్, 1-8, కురవి
కొత్తపల్లి గోరి	73221873030	మిస్టర్ అబ్దుల్ సలాం ఎండీ, 2-147-1, గంగిదేవిగూడెం, వాయంపేట, హెచ్‌ఎన్‌కె
కుమార్ పల్లి	73221764848	శ్రీ సిద్దోజు శ్రీనివాస్, ఇం.నెం.3-4-743-4ఎ, గణేష్ నగర్, కొత్త రాయపుర, హన్మకొండ
కుమార్ పల్లి	73222331857	శ్రీ సిద్దోజు శ్రీనివాస్, ఇం.నెం.3-4-743-4ఎ, గణేష్ నగర్, కొత్త రాయపుర, హన్మకొండ
కుమార్ పల్లి	73224169653	శ్రీ సిద్దోజు శ్రీనివాస్, ఇం.నెం.3-4-743-4ఎ, గణేష్ నగర్, కొత్త రాయపుర, హన్మకొండ
కుమార్ పల్లి	73223089326	శ్రీ బిజ్జిలి మోహన్ రావు, 1-9-1512, హంటర్ రోడ్, హెచ్‌ఎన్‌కె
కుమార్ పల్లి	73223457315	శ్రీమతి సుకుర్తి ఆశా, 11-93, తొర్రూర్, వెలికట్టె
మాచాపూర్	73222794703	శ్రీ మదతా శ్రీనివాస్, ఇం.నెం.5-8, మొండ్రాయి, సంగెం
మాచాపూర్	73222795661	శ్రీ మదతా శ్రీనివాస్, ఇం.నెం.5-8, మొండ్రాయి, సంగెం
మడికొండ, కాజీపేట	79088948275	మిస్టర్ కుసునోత్ రమేష్ 4-04, లక్ష్మీపల్లి, వరంగల్
మహబూబాబాద్ II	73222877997	శ్రీ ధంగ్రోతు చిన్నబాబు, కురవి, గుండ్రాతి మడుగు
మహబూబాబాద్ II	73223111467	శ్రీ బదవత్ సురేష్, బర్యా తండా, ఏదులపూసపల్లె
మహబూబాబాద్ II	73223134881	శ్రీ భూక్యా కస్నా, 2-47/1, మహబూబాబాద్
మహబూబాబాద్ II	73223192481	శ్రీమతి పద్మ బానోత్, గడ్డిగూడెంతండా
మహబూబాబాద్ II	73223371639	శ్రీమతి దాసరి లచ్చమ్మ లక్ష్మీ, 2-32-11-3డి, కొత్త రెడ్యాల
మహబూబాబాద్ II	73223400367	శ్రీ మేదబోయిన భరత్ రాజు, ఇం.నెం.4, బీకులగూడెం, రెడ్యాల
మహబూబాబాద్ II	73223407873	కుమారి అముదాల యశ్విత, ఇంటి నంబర్ 5-3-44, కొత్తగూడెం
మహబూబాబాద్ II	73223408094	కుమారి అముదాల యశ్విత, ఇంటి నంబర్ 5-3-44, కొత్తగూడెం
మహబూబాబాద్ II	73223413195	శ్రీ భుక్యా లక్ష్మణ్, జమాండ్లపల్లె
మహబూబాబాద్ II	73223420678	శ్రీమతి తోకల సావిత్రి, 5-3-55/50, నర్సంపేట రోడ్, మహబూబాబాద్
మహబూబాబాద్ II	73223445945	కుమారి అముదాల యశ్విత, ఇంటి నంబర్ 5-3-44, కొత్తగూడెం
మహబూబాబాద్ II	73223549670	శ్రీ బానోతు సుక్య, 016, ఉత్తర తండా వేమునూరు
మహబూబాబాద్ II	73223550674	శ్రీ బానోతు సుక్య, 016, ఉత్తర తండా వేమునూరు
మహబూబాబాద్ II	73223551792	మిస్టర్ ఉప్పుల అశోక్, 3-75, గౌరారం
మహబూబాబాద్ II	73223664230	శ్రీమతి చంద్రకళా పాశం, రెడ్యాల
మహబూబాబాద్ II	73223668610	శ్రీ నాగెల్లి రామచంద్రయ్య, 2-88, గూడూరు
మహబూబాబాద్ II	73223707548	శ్రీ వాంకుడోతు లింగ్యా, బోడగుట్ట తండా, జమాండ్లపల్లె
మహబూబాబాద్ II	73223771092	శ్రీ బోడ వీరన్న, వీరంతండా, చెంగావురం
మహబూబాబాద్ II	73223771343	శ్రీ బోడ వీరన్న, వీరంతండా, చెంగావురం
మహబూబాబాద్ II	73223836700	శ్రీ వేల్పుల వెంకటేశ్వర్లు, కంపల్లి, కురవి
మహబూబాబాద్ II	73223878809	శ్రీ వగదాల శ్రీను, 1-149, గూడూరు, బొద్దుగొండ, మహబూబాబాద్
మహబూబాబాద్	73222361338	శ్రీ మాలోతు శోభన్‌బాబు, సి-040, ఉల్లేపల్లె, వరంగల్
మహబూబాబాద్	73222013584	శ్రీమతి బొంత విజయ, ఇం.నెం.1-125/4, మల్లియాల్, వరంగల్
మహబూబాబాద్	73227121685	శ్రీమతి బొంత విజయ, ఇం.నెం.1-125/4, మల్లియాల్, వరంగల్
మహబూబాబాద్	73222313226	శ్రీ శేరి వీరన్న, ఇం.నెం.1-47, కంబాలపల్లె, మహబూబాబాద్
మహబూబాబాద్	73222024303	శ్రీ వల్లపు మహేష్ గుండంరాజుపల్లె, వరంగల్
మహబూబాబాద్	73222525071	శ్రీ సురుగు ఐలయ్య, 3-103/1, వివిఎస్ లక్ష్మీ పురం, మహబూబాబాద్
మహబూబాబాద్	73222534449	శ్రీమతి పాశం రమాదేవి, 6-1-118/2/1, భగత్‌సింగ్ నగర్, మహబూబాబాద్
మహబూబాబాద్	73222534904	శ్రీమతి పాశం రమాదేవి, 6-1-118/2/1, భగత్‌సింగ్ నగర్, మహబూబాబాద్
మహబూబాబాద్	73222576693	శ్రీమతి దంటే వాకమ్మ, ఇం.నెం. సి-90, వగిడిపల్లి, చిన్నగూడూరు, మహబూబాబాద్
మహబూబాబాద్	73222599010	శ్రీమతి మహ్మద్ గౌసియా బేగం, ఇం.నెం.2-86, కంబాలపల్లి, మహబూబాబాద్, వరంగల్
మహబూబాబాద్	73222604792	శ్రీ వెలుకూరి నరసింహా చారి, 3-1-88, మహబూబాబాద్, వరంగల్
మహబూబాబాద్	79083631557	శ్రీమతి పుట్టకంటం విజయ లక్ష్మి, ఇం.నెం.5-5-1, కంకర బోర్డ్ కాలనీ, మహబూబాబాద్
మహబూబాబాద్	73222679699	శ్రీమతి బోడ శ్రావణి, సుందరయ్య నగర్, గుమ్ముడూరు
మహబూబాబాద్	73222708815	శ్రీ బలబోయిన వెంకన్న, రెడ్యాల, మహబూబాబాద్
మహబూబాబాద్	73222710245	శ్రీమతి వంకుడోత్ శోభ, 1-191, బుద్రం తండా, గార్ల
మహబూబాబాద్	73222759407	శ్రీమతి బానోతు నిర్మల, 1-6-230/6/88, మహబూబాబాద్
మహబూబాబాద్	73222769823	శ్రీమతి మేరుగు ఎల్లమ్మ, 107, రెడ్యాల
మల్లంపల్లి	73222553086	శ్రీమతి ల్యాదా రమాదేవి, 3-66, మల్లంపల్లి
మల్లంపల్లి	73221807545	కుమారి సొంబోయిన సౌజన్య, ఇం.నెం.3-32, కోటిశెంకుంట వి, ములుగు
మల్లంపల్లి	73221819674	శ్రీ సురపు ప్రేమ్ కుమార్, 1-232, ములుగు, మల్లంపల్లి, వరంగల్
మల్లంపల్లి	73222968794	శ్రీమతి బాటుకూరి పద్మ, 2-46, ఎండి గౌస్‌పల్లి, ములుగు
మల్లంపల్లి	73222996404	శ్రీ తోటకూరి శ్రీకాంత్, 3-98, మల్లంపల్లి
మల్లంపల్లి	73223779829	శ్రీమతి తుమ్మ ఉమాశ్రీ, 1-3-424-ఎ, బంజారా హిల్స్, భువనగిరి
మల్లూరు	73221016064	శ్రీ లావుడ్యా ఉమేష్, 6-399, కమలాపురం, వరంగల్
మండపల్లి	73230775905	శ్రీమతి ఇల్లందుల భాగ్యలక్ష్మి, అడవి రంగాపూర్, మండపల్లి
మండపల్లి	79094899385	శ్రీమతి ఇల్లందుల భాగ్యలక్ష్మి, అడవి రంగాపూర్, మండపల్లి
మండపల్లి	79084190519	శ్రీమతి తుత్తూరు కనకలక్ష్మి, ఇ.నెం.2-98,, చిన్న గిరిజాల, వరంగల్
మండపల్లి	73222805058	శ్రీ మట్ట కుమార స్వామి 1-59/2, నాచినపల్లి
మండపల్లి	73223626680	శ్రీమతి కొమ్ముల శారద, 5-12, తొగర్రాయి
మండపల్లి	73232962053	శ్రీమతి బుడిమె శ్రీనివాస్, అడవి రంగాపూర్
మరిపెడ	73222345011	శ్రీ భుక్యా సుమన్, 1-36, గిరిపురం, వరంగల్
మరిపెడ	73222345102	శ్రీ భుక్యా సుమన్, 1-36, గిరిపురం, వరంగల్
మరిపెడ	73222241181	శ్రీ గుండెపూడి రామాచారి, సి/67, దానంచెర్ల, మరిపెడ
మరిపెడ	73222355416	శ్రీమతి గుగులోతు లక్ష్మి, ధానంచెర్ల, మహబూబాబాద్
మరిపెడ	79088182946	శ్రీమతి పత్తిపాక హేమలత, సి-129, ధనంచెర్ల, మరిపెడ
మరిపెడ	79088473264	మిస్టర్ కాసిరెడ్డి సుధాకర్ రెడ్డి సి 129, ధానంచెర్ల, మరిపెడ
మరిపెడ	73212386106	శ్రీ రంగినేని వేణు, ఇం.నెం.2-35, చిల్లంచెర్ల, మరిపెడ
మరిపెడ	73221340080	శ్రీ భుక్యా లింగం, 5-1-60-1, సేవా నగర్, మరిపెడ
మరిపెడ	73222682669	శ్రీ తెలోత్ ప్రసాద్, తండ్రి వెంకట్రామ్, లోక్యతండా, మరిపెడ
మరిపెడ	73222750120	శ్రీ బయ్యా వెంకన్న, తాళ్లఖేల్, మరిపెడ
మరిపెడ	73223043653	శ్రీ వీరోజు సురేందర్ చారీ, 6-5, రాజోలు, కురవి
మరిపెడ	73223097983	శ్రీ పోలోజు సోమయ్య, మరిపెడ, సి-43, చిల్లంచెర్ల, మరిపెడ
మరిపెడ	73223175895	శ్రీ వరిపబోయిన స్వామి, సి-65, గిరిపురం, మరిపెడ,
మరిపెడ	73223282149	కుమారి శివరాత్రి సుభద్ర, 2-68, రాంపురం, మరిపెడ
మరిపెడ	73223387800	శ్రీమతి నేనావత్ బిక్కి, తానెంచర్ల గ్రామం
మరిపెడ	73223714410	శ్రీమతి ఆకుల నాగమణి, 1-53, తాళ్లఖేల్
మరిపెడ	73231969220	శ్రీమతి బానోతు సంతోష, 1-17, పూనెల తండా, గిరిపురం, మరిపెడ
నన్నూరు	73223151295	శ్రీ నూరా సంపత్, 2-73-1, నన్నూర్
నన్నూరు	73223378012	శ్రీ మాలోతు సురేందర్, ఇం.నెం.8-72, వస్త్యా నాయక్ తండా, మోరిపిరాల
నెక్కొండ	79088814897	శ్రీమతి దగ్గు గౌతమి, రెడ్లవాడ, నెక్కొండ
నెక్కొండ	73222761336	శ్రీ బానోతు రమేష్, 2-9, రెడ్లవాడ, నెక్కొండ
పరకాల	79087979178	శ్రీ మామిడాల రాజేందర్, ఇం.నెం.4-59, చెర్లపల్లి, చెర్లపల్లి
రాయపర్తి	73230657483	శ్రీమతి పెద్దగోని రేణుక, 1-62, మొరిపిరాల
రంగ సాయిపేట	79088372073	కుమారి కామ నందిని, 20-3-25, ఫోర్ట్ వరంగల్, వరంగల్
రేగొండ	73229489421	శ్రీ కొనరి శ్రీనివాస్, ఇం.నెం.1-38/2, లింగాల, రేగొండ
టేకుమట్ల	73221821730	శ్రీమతి మారపెల్లి స్పందన, గరిమెళ్లపల్లి
టేకుమట్ల	73224077603	శ్రీమతి రజిత బోయిని, 2-8, వెలిశాల, టేకుమట్ల
టేకుమట్ల	79095214096	శ్రీమతి రజిత బోయిని, 2-8, వెలిశాల, టేకుమట్ల
వెంకటపూర్	79087947986	శ్రీమతి వంచిడి అనూష, 4-3, వెలమవాడ, వెంకటాపూర్, వరంగల్
వెంకటపూర్	79087970732	శ్రీమతి కత్తెర సువర్ణ, 7-25, చర్లవాడ, వెంకటాపూర్, వరంగల్
వెంకటపూర్	79088586982	శ్రీ చిలికేశి చంద్రశేఖర్, 3-21, రాజేశ్వరపల్లి, వెంకటాపూర్, ములుగు
వెంకటాపురం	73223002162	శ్రీమతి కోర్సా రమాదేవి, 3-40, బోధాపురం, వెంకటాపురం
వెంకటాపురం	73223384128	శ్రీమతి శ్యామల చిలకమ్మ, 12-2, లక్ష్మీనగరం, వెంకటాపురం
వెంకటాపురం	73223559509	శ్రీ ఇర్పా రామారావు, ఇప్పగూడెం జెడ్, వెంకటాపురం
వజీడ్ నగరం	73223380724	శ్రీ బొల్లె రామకృష్ణ, దూలాపురం జి, వజీడ్
యాదవ్ నగర్	73231946225	శ్రీమతి తిరుపతాని అరుణ, ఇం.నెం.4-6-117, రెడ్డి కాలనీ, హన్మకొండ
యాదవ్ నగర్	79088033970	శ్రీమతి మొతుకూరి శ్రీలత, ఇం.నెం.3-14-409, దుర్గా కాలనీ, హన్మకొండ
యాదవ్ నగర్	79088216025	శ్రీ కాసోజు కృష్ణ మూర్తి, ఇం.నెం.3-14-67-2, యాదవనగర్, హన్మకొండ
యాదవ్ నగర్	79088216706	శ్రీ కాసోజు కృష్ణ మూర్తి, ఇం.నెం.3-14-67-2, యాదవనగర్, హన్మకొండ
యాదవ్ నగర్	73222704048	శ్రీమతి సోమ రామ, 3-9-163, రెడ్డి కాలనీ, హన్మకొండ

షరతులు: 1) ఖాతాదారుల్లో ఎవరైనా బ్యాంకు వారి నోటీసులు ఏ కారణము చేతనైనా అందని యెడల నోటీసు తిరిగి వచ్చిన యెడల వారికి కూడా ఈ ప్రకటన పూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను, 2) ఖాతాదారులు ఎవరైనా మరణించియుండిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకంగా తెలియజేయడమైనది భావించవలెను. 3) తాకట్టుదారు ఇదే చివరి నోటీసుగా భావించి బకాయిలు చెల్లించగలరు, తదుపరి అక్షేపణలు అంగీకరించబడవు. 4) వేలం నందు పాల్గొనదలచినవారు PAN కాపీతో EMD క్రింద రూ.10,000/-లు తేది: 30.08.2025 ఉ॥ 10 గం॥ల నుండి 11:30 ని॥లలోపు పైన తెలిపిన ఆయా శాఖలలో చెల్లించి వేలంలో పాల్గొనగలరు. 5) హెచ్చు పాటదారులు మొత్తం పాట సొమ్మును అదే రోజు చెల్లించి వస్తువులను పొందవలెను. 6) ఎటువంటి కారణం లేకుండా వేలం రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు బ్యాంకు వారికి అధికారము కలదు. 7) వివరములకు శాఖాధిపతిని బ్యాంకు పని వేళలలో సంప్రదించగలరు.

తేది: 22.08.2025 — సం/- రీజినల్ మేనేజర్

163 హైవేలో సర్వీస్ రోడ్లను నిర్మించాలి

కేంద్ర మంత్రి నితిన్ గడ్గరీకి ఎంపీ కావ్య వినతి


కేంద్ర మంత్రి నితిన్ గడ్గరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్గరీని ఢిల్లీలో శుక్రవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదాద్రి-వరంగల్ జాతీయ రహదారి 163 (హైదరాబాద్-భూపాల పట్నం రోడ్డు)లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని అభ్యర్థిం చారు. ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించినప్పటికీ కొన్ని గ్రామాల వద్ద సర్వీస్ రోడ్ల అనుసంధానం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి ఎంపీ తీసుకువచ్చారు. నిడిగొండ, రఘునాథపల్లి, ఛాగల్, స్టేషన్‌ఘనపూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల వద్ద రోడ్లు ఉన్నా జనగామ నుంచి ఈ గ్రామాల మధ్య లింకులు లేకపోవడం పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. దీంతో గ్రామాల వాహనాలు నేరుగా హైవేపైకి రావడం వల్ల రద్దీ పెరుగుతోందని, ప్రమదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. నాలుగు లేన్ల రోడ్ల నిర్మాణ సమయంలోనే అవసరమైన భూమి సేకరించారని, ఇప్పుడు కేవలం నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. ఎంపీ విజ్ఞప్తి పట్ల కేంద్ర మంత్రి నితిన్ గడ్గరీ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని పరిశీలిస్తానని, అవసరమైన సూచనలు సంబంధిత అధికారులకు ఇస్తానని హామీ ఇచ్చారు.

రైతు కుటుంబాలకు వడ్డీలేని రుణాల పంపిణీ



రుణాల పంపిణీ చేస్తున్న పల్లెపాడు దామోదర్

బాలసముద్రం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు 15 ఏళ్లుగా వడ్డీలేని రుణాలను అందజేస్తూ వారికి అండగా నిలుస్తున్నట్టు సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెరిగి గిట్టుబాటు ధరలు లేక బ్యాంకుల నుంచి రుణాలు అందక అనేక మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదని వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సిద్ధంగా ఉన్నాయని రైతులు గమనించాలని తెలిపారు. ఆత్మహత్యల పాల్పడిన రైతు కుటుంబాలకు 15 ఏళ్ల నుంచి సర్వోదయ సంస్థ 3,700 మంది మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తూ ఆదుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, గీసుగొండ మండలాల్లోని మహిళలకు 70 మంది వితంతు మహిళలకు రూ. 25 వేల చొప్పున వడ్డీలేని రుణాలను చెక్కుల రూపంలో అందించారు. కార్యక్రమంలో సర్వోదయ సంస్థ ప్రతినిధులు కవిరాజ్, ఇందిరా, రవీందర్, సతీష్ , జ్యోష్న, మంజుల, రాజు పాల్గొన్నారు.

వరంగల్ డీఈవో బదిలీ

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వివాదాల సుడిలో చిక్కుకున్న వరంగల్ డీఈవో మామిడి జ్ఞానేశ్వర్‌ను నిర్మల్ డీఈవో కార్యాలయంలో ఫైనాన్షియల్ ఎకౌంట్స్ ఆఫీసర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు డీఈవో జ్ఞానేశ్వర్ వ్యవహారశైలిపై జిల్లా కలెక్టర్‌తో పాటు ఆర్జేడీ, మంత్రి, ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేయడంతో పాటు రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలోను ఆయనపై ఉపాధ్యాయ సంఘాలు 21 ఆధారాలతో ఫిర్యాదు చేయడంతోనే విద్యాశాఖ వేటు వేసినట్లు తెలిసింది. కాగా జిల్లా కలెక్టర్‌ను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిందిగా ఉత్తర్వులో డైరెక్టర్ నికోలస్ పేర్కొన్నారు. ఇదిలా వుండగా, ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. డీఈవోపై చర్యలు తప్పవని ఆంధ్రజ్యోతి ముందే చెప్పిన విషయం విదితమే.

ప్రాణం మీదికి తెచ్చిన టీవీ సీరియల్..!

- అన్నం పెట్టమన్న భర్త.. సీరియల్ బ్రేక్‌లో పెడుతానన్న భార్య
- కోపోద్రిక్తుడై మందలించిన భర్త..
- కొడుకుతో సహా పురుగులమందు తాగిన భార్య
- కొడుకు సాత్విక్ పరిస్థితి విషమం


చికిత్స పొందుతున్న సాత్విక్

బయ్యారం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఆ ఇల్లాలికి భర్త ఆకలి కన్నా టీవీ సీరియలే ముఖ్యమైంది.. పొలం పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన భర్త అన్నం పెట్టమని భార్యకు చెప్పగా.. ఆ ఇల్లాలు ఆగు టీవీ సీరియల్ మంచి ఇంట్రెస్ట్ గా ఉంది బ్రేక్ టైంలో పెడుతానని బదులిచ్చింది.. దీంతో కోపోద్రిక్తులైన భర్త మందలించడంతో క్షణికావేశానికి గురైన ఆ ఇల్లాలు పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటమే కాకుండా, నవ మాసాలు కని పెంచిన కొడుకు కూడా తాపించింది. మానవ హృదయాలను చలింపజేసే ఈ విషాదకర ఘటన శుక్రవారం మహబూబాబాద్ జిల్లా బయ్యా రం మండలం కోడిపుంజల తండాలో చోటుచేసుకుంది. భర్త రాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.

కోడిపుంజల తండాకు చెందిన దారావత్ రాజు-కవితలకు ఇరువురు సంతానం. వీరి దాంపత్య జీవితం అన్యూన్యంగా సాగుతోంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే రాజు ఎప్పటి లాగే గురువారం కూడా పొలం పనులు ముగించుకొని ఇంటికి వచ్చాడు. ఆకలితో వచ్చిన రాజు అన్నం పెట్టమని భార్య కవితకు చెప్పాడు. అప్పటికే ఇంట్లో టీవీ సీరియల్ చూస్తున్న కవిత సీరియల్ ఇంట్రెస్ట్‌గా ఉంది.. కొద్ది సేపు ఆగు పెడుతానని బదులిచ్చింది. దీంతో భాగా ఆకలితో ఉన్న రాజు కోపోద్రిక్తులై నీకు భర్త ఆకలి ముఖ్యమా.. లేక టీవీ సీరియల్ ముఖ్యమా.. అని భార్యను మందలించాడు. ఈ క్రమంలోనే కొంత సేపు వారిరువురి నడుమ ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలిసింది. అనంతరం మన స్థాపం చెందిన కవిత శుక్రవా రం తెల్లవారుజామున ఇంట్లోని పురుగుల మందును మొదట కొడుకు సాత్విక్‌కు తాపించి తను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు రాజు పేర్కొన్నారు. అంతేకాక కూతురికి కూడా తాపిస్తుంటుంటే తాను అడ్డుకున్నట్లు తెలిపారు. కాగా, పురుగుల మందు సేవించిన ఇరువురిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా.. సాత్విక్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిసింది. ప్రస్తుతం కవిత ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. విషయం తమ దృష్టికి వచ్చింది కానీ ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు. ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు సాగిస్తామన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా బ్యాంక్ సేవలను విస్తరిస్తాం

వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

వరంగల్ సిటీ, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ సేవలను త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామని ఆ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. శుక్రవారం కాశిబుగ్గలోని ప్రధాన కార్యాలయంలో తన ప్యానెల్ సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరుసగా ఆరోసారి గెలిపించినందుకు ఖాతాదారులకు, వాటాదారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పథంలో నడుస్తున్న బ్యాంక్‌లో ఎవరూ రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. వ్యాపారులు, వాటాదారులు తెలివైనవారని, ఎవరు ఎలాంటి వారో తెలుసుకుని వాత పెడుతారని నర్మగర్భంగా చురకలు వేశారు. 1995లో ప్రారంభమై వీక్‌గా నడుస్తున్న బ్యాంక్‌ను 1999లో తాను బాధ్యతలు చేపట్టాక అభివృద్ధి పథంలో నడిపిస్తున్నానని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10 బ్రాంచీలను ఏర్పాటు చేసి రూ.400 కోట్ల టర్నోవర్‌తో రన్ చేస్తున్నామన్నారు. ఓడిపోయిన వారి సహాయ సహకారాలు కూడా తీసుకుంటామని, ఎక్కడా తమపర భేదం లేకుండా పని చేస్తామని అన్నారు. మహిళలకు కూడా ప్రత్యేక రుణాలను అందిస్తామన్నారు. వ్యాపారులను ఇబ్బందికి గురి చేస్తే సహించబోమని హెచ్చరించారు.

చైర్మన్‌గా ప్రదీప్‌రావు ప్రమాణ స్వీకారం

బ్యాంక్ ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులతో ఎన్నికల అధికారి ఎం.వాల్యానాయక్ శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా ప్రదీప్‌రావు, వైస్ చైర్మన్‌గా తోట జగన్నాథంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎండు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిపై నేరం రుజువైనందున ఒక్కొక్కరికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి అపర్ణాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 2009 డిసెంబరు 7న సాయంత్రం 7గంటలకు కాజీపేట ఏరియాలో ఎస్సై ఆధ్వర్యంలో పెట్రోలింగ్ చేస్తుండగా కాజీపేట మెయిన్ రోడ్డులోని ఇండియన్ గ్యాస్ ఆఫీస్ దగ్గర ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. వారు పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు పట్టుకొని వారి వద్దనున్న సంచిని విప్పి చూడగా ఎండు గంజాయి దొరికింది. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎ. సుధాకర్ సాక్షులను ప్రవేశపెట్టగా లైజన్ ఆఫీసర్‌గా కె.పరమేశ్వరి, దర్యాప్తు అధికారులుగా వై.సుధాకర్‌రెడ్డి, జి.మహేందర్‌రెడ్డి వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

నేటి నుంచి 31 వరకు డీఎస్‌ఏ ఆధ్వర్యంలో క్రీడా ఉత్సవాలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా క్రీడా సమాఖ్య హనుమకొండ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈ నెల 31 వరకు హనుమకొండ జేఎన్‌ఎస్‌లో క్రీడా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం ఉదయం జేఎన్‌ఎస్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంతో పాటు 10ఏళ్లలోపు చిన్నారులకు అథ్లెటిక్స్, బేబీ క్రౌలింగ్, మ్యూజికల్‌చైర్, క్రికెట్ పోటీలను నిర్వహిస్తామన్నారు. జాతీయ క్రీడా ఉత్సవాల్లో భాగంగా ఈనెల 24న జేఎన్‌ఎస్ నుంచి రన్ ర్యాలీని నిర్వహిస్తామన్నారు. అదే విధంగా జేఎన్‌ఎస్ వేదికగా తొమ్మిది రోజులు పాటు చేపట్టనున్న పలు క్రీడా పోటీలు, ఇతర కార్యక్రమాల్లో యువత, చిన్నారులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అశోక్‌కుమార్ కోరారు.

గోల్డ్ షాపుల బంద్ ప్రశాంతం

- మార్వాడీ గోబ్యాక్ అంటూ స్వర్ణకారుల డిమాండ్

జనగామ కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కులవృత్తినే నమ్ముకొని జీవిస్తున్న స్వర్ణకారులను ఆదుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రామేశ్వరాచారి డిమాండ్ చేశారు. 'మార్వాడీ గోబ్యాక్' నినాదంతో పట్టణ స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జనగామ పట్టణంలో గోల్డ్ షాపుల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణకారులు స్వచ్ఛందంగా షాపులు బంద్ చేసి నిరసన తెలిపారు. రామేశ్వరాచారి మాట్లాడుతూ మార్వాడీ పాన్ బ్రోకర్, జ్యువెల్లరీ షాపుల వల్ల స్వర్ణకారులకు పని లేకుండా పోయి పూట గడవడం కష్టంగా మారిందన్నారు. రెడీమేడ్ షాపులలో ఆభరణాలు అమ్మడంతో స్వర్ణకారులు రోడ్డు మీద పడుతున్నారన్నారు. మార్వాడీలను తరిమికొట్టి చేతివృత్తుల వ్యాపారస్తులను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జనగామ సీఐ దామోదర్‌రెడ్డి స్వర్ణకారుల సంఘం నాయకులను కలుసుకొని నిరసన విరమింపజేసి షాపులను తిరిగి తెరిపించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వలభోజు చక్రపాణి, పన్నీరు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కందుకూరి సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సరభోజు అంజనేయులు, సహాయ కార్యదర్శి పొత్కనూరి కనకచారి, చెన్నోజు నగేష్, ఆకోజు అంజనేయులు, మాచర్ల జగన్‌చారి, కృష్ణ, ఉప్పరోజు కిరణ్, మారోజు బాలనర్సయ్య, జక్కోజు శ్రీధర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎఫ్ఆర్ఎస్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్‌ను శనివారం నుంచి ప్రారంభం కానుంది. శుక్రవారం హనుమకొండలోని వరంగల్ డీఐఈవో కార్యాలయంలో ఎఫ్ఆర్ఎస్‌పై అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లకు డీఐఈవో డాక్టర్ శ్రీధర్ సుమన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ సుమన్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఎఫ్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షలు ప్రారంభం

కేయూ క్యాంపస్ ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య కేంద్రం డిగ్రీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ పరీక్షల కేంద్రం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజలు పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. శుక్రవారం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ తెలిపారు.

పోర్ట్ ఫోలియో జడ్జిని కలిసిన బార్ ప్రతినిధులు


పోర్ట్ ఫోలియో జడ్జిని సన్మానిస్తున్న బార్ ప్రతినిధులు

వరంగల్ లీగల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాల పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్‌ను బార్ అసోసియేషన్ల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం రాష్ట్ర హైకోర్టులో పోర్ట్‌ఫోలియో జడ్జిగా నూతనంగా నియామకమైన న్యాయమూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ సంద్భంగా రెండు జిల్లాల న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు ప్రాంగణంలో ఏసీబీ కోర్టుకు న్యాయమూర్తి నియామకం, బార్ అసోసియేషన్ భవనానికి లిఫ్ట్ సౌకర్యం తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు వల్స సుధీర్, పులి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల ప్రధాన కార్యదర్శులు డి.రమాకాంత్, కొత్త రవి, బార్ ప్రతినిధులు మైదం జైపాల్, మూసిపట్ల శ్రీధర్, జాయింట్ సెక్రటరీ శశిరేఖ, ఆర్. నాగేంద్ర, అంబేద్కర్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు


జెండా ఊపి అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న సారంగపాణి

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లోని సింథటిక్‌ట్రాక్‌పై జిల్లా స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థాయిలో శుక్రవారం ఏర్పా టు చేసిన అథ్లెటిక్స్ ఎంపి క పోటీలను అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్య దర్శి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-14, 16, 18, 20 జూనియర్స్ బాలబాలికల విభాగంలో 60, 100, 200, 400, 600, 800, 1000, 1500, 3000 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించమన్నారు. హనుమకొండ,

రెండు జిల్లాల నుంచి వెయ్యి మంది అథ్లెట్లు హాజరు

వరంగల్ రెండు జిల్లాల స్థాయిలో ఒక్కరోజు పాటు ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ ఎంపికల్లో 1000మంది బాలబాలికల పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపికల్లో అత్యుత్తమ ప్రతిభతో రాణించిన అథ్లెట్లు ఈ నెల 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు యూనివర్సిటీలోని క్రీడా మైదానంలో నిర్వహించనున్న 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని సారంగపాణి తెలిపారు. కాగా, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడానికి జిల్లా స్థాయిలో అథ్లెట్లు హోరాహోరీగా పోటీ పడుతూ గెలుపే లక్ష్యంగా చెమటోడ్చారు. ఈ కార్యక్రమంలో పీడీలు వాసు, రజనీకాంత్, కృష్ణమూర్తి, మహేందర్, రిటైర్డ్ పీడీ సాంబమూర్తి, కోచ్‌లు దిమ్మిక నాగరాజు, కె.సమ్మయ్య, సీనియర్ అథ్లెట్లు తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

హనుమకొండ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్డులోని మెడికవర్ హాస్పటల్‌లో ప్రమీల అనే 58 ఏళ్ల మహిళకు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి విజయవంతం చేసినట్లు డాక్టర్ సునిల్ శుక్రవారం తెలిపారు. తీవ్రమైన కడుపునొప్పి, తీవ్ర జ్వరంతో అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చిన మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించి అత్యవసర శస్త్ర చికిత్స ద్వారా కడుపులో దెబ్బతిన్న పెద్ద పేగు భాగాన్ని తొలగించి ఆరోగ్య కరమైన పేగు భాగాలను కలిపి రోగికి శస్త్ర చికిత్స చేసి విజయవంతం చేసినట్లు పేర్కొన్నారు. ఎంతో నైపుణ్యంతో అరుదైన శస్త్ర చికిత్స చేసిన వైద్యులను బంధువులు అభినందనలు తెలిపినట్లు పేర్కొన్నారు.

క్యాన్సర్ పేషెంట్ల కోసం తల వెంట్రుకల విరాళం


తలవెంట్రుకలను విరాళంగా ఇస్తున్న విద్యార్థిని మేఘన

హసన్‌పర్తి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ఎర్రగట్టు గుట్టలో ఓ విద్యార్థిని కాటం మేఘన తన తల వెంట్రుకలను క్యాన్సర్ పేషంట్ల కోసం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మేఘన మాట్లాడుతూ.. క్యాన్సర్ గురించి టీవీలో వచ్చిన ఒక కార్యక్రమాన్ని చూసి రేడియేషన్ ద్వారా వెంట్రుకలు కోల్పోతున్న మహిళలకు స్వచ్ఛంద సంస్థలు విగ్గులు తయారు చేసి ఇస్తున్నారని తెలిపారు. చాలా మంది సెలబ్రిటీలు కూడా వారి వెంట్రుకలు ఇస్తున్నారని తెలిపారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని క్యాన్సర్ పేషెంట్ల కోసం హైదరాబాద్‌లోని స్వచ్ఛంద సంస్థకు తన తల వెంట్రుకలు అందేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థిని మేఘనను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జనగాం శివకుమార్, కేదాసి వెంకటేశ్వర కుమార్, ఎ.విద్యాసాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రవీందర్‌రావు జన్మదిన వేడుకలు

- పలు చోట్ల అన్నదాన కార్యక్రమాల నిర్వహణ


జన్మదిన వేడుకల్లో రవీందర్‌రావును సన్మానిస్తున్న స్నేహితులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త, వరంగల్ నగరానికి చెందిన బిల్డర్ కొక్కిరావు రవీందర్‌రావు జన్మదిన వేడుకలు శుక్రవారం వరంగల్ నగరంలో ఘనంగా నిర్వహించారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని సంజన, ఆర్ఆర్ రియల్ ఎస్టేట్ కార్యాలయాల్లో కేక్‌కట్ చేసి గజమాలతో సత్కరించి స్వీట్లు పంచుకున్నారు. కాగా, రవీందర్‌రావు పుట్టిన రోజు సందర్భంగా నగరంలోని పలు అనాథ ఆశ్రమాలు, మానసిక వికలాంగుల కేంద్రాలలో ఆయన స్నేహితులు అన్నదానంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీతాంబరం రాజేష్, పొన్నాల శ్రీకాంత్, రవికిరణ్, కుందూరు అనీల్‌రెడ్డి, చీటూరు అశోక్, దూలం సుమన్ గౌడ్‌లు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు


(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7620	5300
మక్కలు	2116	1521
కందులు	5912	3022
పెసళ్లు	7022	3022
పల్లికాయ (సూక)	6010	3450
పల్లికాయ (పచ్చిది)	4300	1575
పసుపు (కాడి)	11303	9534
పసుపు (గోల)	10559	8700
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	14400	11500
వండర్‌హాట్	11000	6000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్341ఏసీ	14500	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

సైన్స్‌కు పట్టం!

» సృజనాత్మకతను వెలికితీసేందుకు విజ్ఞాన్ మంథన్
» విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు
» ఆరో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్ష
» విజ్ఞాన్ మంథన్ ప్రవేశ పరీక్షకు ఆహ్వానం
» సెప్టెంబరు 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
» ప్రతిభావంతులకు జాతీయ ప్రయోగశాలలను వీక్షించే చాన్స్
» జిల్లాలో ఆరు నుంచి ఇంటర్ వరకు 26వేల మంది విద్యార్థులు



జఫర్‌గఢ్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను ప్రపంచానికి చాటి చెప్పేందుకు కేంద్రం పలు కార్యక్రమాలను అమలుచేస్తోంది. ఇందులో భాగంగా కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు వెలికితీసేందుకు, సైన్స్‌పై మక్కువ పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ్ పరీక్షను నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, దేశంలో సీఎస్ఐఆర్, ఐఎస్ఆర్‌వో, బార్క్, డీఆర్‌డీవో, ప్రముఖ జాతీయ ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థలను చూసే అవకాశాన్ని కల్పిస్తోంది. పరిశోధన, ప్రయోగ రంగాల వైపు ఆసక్తి కలిగేలా చేయడమే లక్ష్యంగా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) ప్రతిభా పోటీలు నిర్వహించనుంది. కేంద్రం పరిధిలోని విజ్ఞాన భారతి, ఎన్‌సీఈఆర్టీ సంయుక్తంగా నిర్వహించే ఈ పోటీల కోసం 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 6వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న వారు ఈ పోటీలకు అర్హులు. ప్రతిభకు అనుగుణంగా నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు అందిస్తారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ☐☐☐.☐☐☐☐.☐☐☐ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పరీక్షకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయ్యి వివరాలు నమోదు చేయాలి.

పరీక్ష విధానం..

జూనియర్, సీనియర్ విభాగాల్లో పరీక్షను నిర్వహిస్తారు. 6నుంచి9 తరగతుల విద్యార్థులను జూనియర్లుగా, పది, ఇంటర్ విద్యార్థులను సీనియర్లుగా పరిగణిస్తారు. తెలుగు, హిందీ, ఇంగ్లీషుతో పాటు 14 భాషల్లో ఆన్‌లైన్‌లో పరీక్షను నిర్వహిస్తారు. 90 నిమిషాల్లో 100 ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. గణితం, భౌతిక, రసాయన, జీవశాస్త్రాల నుంచి 50శాతం, భారతదేశం కృషిపై20, శాస్త్రవేత్తల పరిశోధనలపై 20, లాజికల్ రీజనింగ్‌పై 10 శాతం ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థి ఇంటి నుంచే ఆన్‌లైన్ విధానంలో మొబైల్, ల్యాబ్ డెస్క్‌టాప్, ల్యాప్‌ట్యాప్‌ల ద్వారా పాల్గొనవచ్చు. సెప్టెంబరు 1న నమూనా పరీక్ష నిర్వహిస్తారు. జూనియర్లకు అక్టోబరు 28 నుంచి నవంబరు 2 వరకు, సీనియర్లకు నవంబరు 19 నుంచి 23 తేదీల్లో వారికి నచ్చిన రోజు పరీక్ష రాయవచ్చు. 2026 జనవరి 4న రాష్ట్ర స్థాయి, జనవరి 30న జాతీయ స్థాయి పోటీలు ఉంటాయి. విద్యార్థులు తమ ఆసక్తిని బట్టి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు. ప్రతిభను చూపిన విద్యార్థులకు స్థాయిని బట్టి ధ్రువపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేస్తారు.

నగదు ప్రోత్సాహకాలు, ఉపకార వేతనాలు..

పాఠశాల స్థాయి పోటీల్లో 18 మంది చొప్పున, జిల్లా స్థాయి పోటీల్లో సబ్జెక్టుకు ముగ్గురు చొప్పున ఎంపిక చేస్తారు. వీరికి ఆన్‌లైన్‌లో ప్రశంసాపత్రం అందజేస్తారు. రాష్ట్ర స్థాయి పోటీలకు 20 మందిని ఎంపిక చేస్తారు. వీరికి ధ్రువీకరణ పత్రం, మెమెంటో, రూ.5వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతిగా అందజేస్తారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురికి రూ.25వేలు, రూ.15వేలు, రూ.10 వేలు చొప్పున ఇస్తారు. అంతేకాకుండా వీరికి దేశంలోని పరిశోధన, అభివృద్ధి సంస్థలను సందర్శించే అవకాశంతో పాటు ఏడాది పాటు నెలకు రూ.2 వేలు చొప్పున ఉపకార వేతనం అందజేస్తారు. అర్హత గల విద్యార్థులు ప్రతిభా పోటీలను సద్వినియోగం చేసుకోవాలి.

సెప్టెంబరు 30 వరకు దరఖాస్తులు

జిల్లాలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 191 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు 54 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం సుమారు 26,200 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆసక్తి గల వారు వీవీఎం పోర్టల్‌లో రూ.200 చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలి. సెప్టెంబరు 30 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది.

ఉపాధ్యాయుల కృషి అవసరం..
చింతల ఉపేందర్, జిల్లా సైన్స్ అధికారి, జనగామ



విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని కలిగించి నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు వీవీఎం పరీక్ష ఉపకరిస్తుంది. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు చక్కని మార్గం. పిల్లల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుంది. విజ్ఞాన్ మంథన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలు




దర్గాలో మొక్కులు చెల్లిస్తున్న ఎంపీ కావ్య, మేయర్ సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని, కేఆర్.నాగరాజు, సీపీ

● దర్శించుకున్న పలువురు ప్రముఖులు

కాజీపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం వైభవంగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. దర్గా ప్రాంతాల్లో వెలిసిన షాపుల వద్ద భక్తులతో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాను సందర్శించి బియాబాని సమాధిని సందర్శించి చాదర్‌కప్పిమొక్కులు చెల్లించారు. ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, మేయర్ సుధారాణి, సీపీ సన్‌ప్రీత్ సింగ్, స్థానిక ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్నతోపాటు పోలీస్ అధికారులు దర్గాను దర్శించుకుని మొక్కు లు చెల్లించారు. దర్గా సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ హాల్‌లో 'మతాలకన్నా మానవత్వం గొప్పదనే' అంశంపై ప్రత్యేక యూనిటీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా స్థానిక ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి బృందం బందోబస్తు నిర్వహించింది.

మిల్లర్లు.. మహా మాయగాళ్లు

(5వ పేజీ తరువాయి)

సీఎంఆర్‌ను ప్రభుత్వానికి అప్పగించకుండా కుప్పిగంతులు వేస్తున్నారు. 2.76లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని గత ఫిబ్రవరిలో అధికారులు ఈ వేలం వేశారు. వేలంలో దక్కించుకున్న కాంట్రాక్టర్లకు బియ్యాన్ని అప్పగించేందుకు జూలై, ఆగస్టు నెలల్లో మిల్లులకు వెళ్లగా.. బియ్యం జాడలేకపోవటంతో పౌరసరఫరాల శాఖ అధికారులు అవాక్కయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.407.55 కోట్ల విలువ చేసే బియ్యాన్ని మిల్లర్లు పక్కదారి పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రంగంలోకి దిగిన పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లర్ల నుంచి బియ్యాన్ని రికవరీ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా వరంగల్ జిల్లాలో రూ.151.40కోట్ల విలువైన బియ్యం మాయం కాగా, మిల్లర్ల నుంచి రూ.86.05కోట్లు విలువైన బియ్యాన్ని రికవరీచేసినట్లుగా సమాచారం. హనుమకొండ జిల్లాలో రూ.99.36కోట్ల విలువైన బియ్యం అక్రమంగా అమ్ముకోగా, మిల్లర్ల నుంచి రూ.73.12కోట్ల విలువైన బియ్యాన్ని, జనగామ జిల్లాలో రూ.103.78కోట్ల విలువైన బియ్యం తరలించగా, మిల్లర్ల నుంచి రూ.93.9కోట్ల విలువైన బియ్యాన్ని రికవరీ చేశారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సుమారు రూ.407కోట్ల విలువైన బియ్యం మాయం కాగా, ఇప్పటి వరకు అధికారులు సుమారు రూ.253కోట్ల వరకు రికవరీ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే మిల్లర్లు మాయం చేసిన బియ్యం వివరాలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి నుంచి వచ్చే ఆదేశాల మేరకు రికవరీతో పాటు కేసులు నమోదు చేసే అవకాశం ఉందని ఆంధ్రజ్యోతికి ఓ అధికారి తెలిపారు.

రీసైక్లింగ్‌తో ఆదాయానికి గండి

సీఎంఆర్ విధానంలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ధాన్యం తీసుకున్న మిల్లర్లు గడువులోగా మరాడించి బియ్యాన్ని అప్పగించాల్సి ఉన్నప్పటికి కొందరు మిల్లర్లు ప్రభుత్వ ధాన్యంతో అక్రమ వ్యాపారం చేస్తున్నారనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యాన్ని మిల్లర్లు మారాడించి, వచ్చిన బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి వ్యాపారం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల విజిలెన్స్ అధికారుల దాడుల్లో బియ్యం పక్కదారి కేసులు అనేకం వెలుగులోకి వస్తున్నాయి.

రూపాయి పెట్టుబడి లేకుండా మిల్లర్లు లక్షల్లో దందా సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ నిర్ణీత కాలంలో బియ్యం అప్పగించాలని అధికారులు ఒత్తిడి చేస్తే రేషన్ బియ్యాన్నే రీసైక్లింగ్ చేసి అప్పగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ నేతలు, అధికారుల అండతో కొందరు మిల్లుల నిర్వాహకులు డీలర్లు, దళారుల వద్ద రేషన్ బియ్యం కొనుగోలు చేసి, వాటికి పాలిష్ చేసి సీఎంఆర్ అప్పగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ధాన్యాన్ని మరాడించి బయట మార్కెట్‌లో కిలో రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.

సమస్యలు తొలగేలా
ప్రభుత్వ కార్యక్రమాలు

● గౌరవెల్లి ప్రాజెక్టు భూ సేకరణ కోసం రూ.25కోట్లు
● రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



పనుల జాతరలో వీర్లగడ్డ తండాలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తొలగించేలా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా అంగన్‌వాడీ భవన నిర్మాణానికి మంత్రి పొన్నం శంకుస్థాపన చేశారు. అనంతరం వీర్లగడ్డ తండాలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గంలో పనుల జాతరలో 46 కార్యక్రమాలు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తున్నామన్నారు. గ్రామపంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రోడ్లు, గ్రామీణ ప్రాంత సమస్యలు పనుల జాతరలో పరిష్కారమవుతాయన్నారు. పనుల జాతరలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేసి కొత్త పనులు మంజూరు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో వైద్య, వ్యవసాయ పరంగా అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రాంత ప్రజలకు గౌరవెల్లి ప్రాజెక్టు గుండెకాయ లాంటిదన్నారు. ప్రాజెక్టు భూసేకరణ జరుగుతుందన్నారు. త్వరలోనే కాలువల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూ సేకరణ కోసం హనుమకొండ జిల్లాకు రూ.25కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ రాథోడ్, డీఆర్‌డీవో మేన శ్రీను, డీఎల్పీవో గంగాభవానీ, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రాజేష్, సీడీపీవో స్వరూప, ఏపీవో కుమారస్వామి, మాజీ సర్పంచ్ తుకారం, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, కొల్గూరి రాజు, ఆదరి రవీందర్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

ఐనవోలు దేవస్థానం చైర్మన్‌గా ప్రభాకర్‌గౌడ్

● దేవస్థానం నూతన ట్రస్ట్‌బోర్డు ప్రమాణ స్వీకారం
● పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు



ట్రస్ట్‌బోర్డు ధర్మకర్తలచే ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎండోమెంట్ అధికారి అనిల్‌కుమార్, పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ప్రమాణస్వీకారంను శుక్రవారం మల్లన్న సన్నిధిలో లాంచనంగా నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా మాజీ జడ్పీటీసీ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్ ఎన్నికయ్యారు. 15 మంది ధర్మకర్తలకు గాను వివిధ కారణాలతో ముగ్గురు సభ్యులు హాజరుకాలేదు. 12 మంది ధర్మకర్తలతో దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. ధర్మకర్తల ప్రమాణస్వీకారం పూర్తయ్యాక చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. ధర్మకర్త మడూరి రాజు ప్రభాకర్‌గౌడ్‌ను చైర్మన్‌గా ప్రతిపాదించగా మరో ధర్మకర్త బందెల వెంకన్న బలపరిచారు. మిగిలిన ధర్మకర్తలు ఏకగ్రీవంగా ఆమోదించడంతో ప్రభాకర్‌గౌడ్‌ను చైర్మన్‌గా ప్రకటించారు.

ప్రమాణస్వీకారం చేసింది వీరే..

కమ్మగోని ప్రభాకర్‌గౌడ్(చైర్మన్), ధర్మకర్తలు, కూస చిరంజీవి, గడ్డం రేణుక, బరిగెల సదానందం, నూనావత్ కీమానాయక్, గుంటి కుమారస్వామి, బందెల వెంకన్న, బోయిని మహేందర్, బాలబోయిన రాజయ్య, మండల నర్సింహారెడ్డి, మడూరి రాజు, పాతర్లపాటి రవీందర్(ఆలయ ఉప ప్రధాన అర్చకుడు) ప్రమాణస్వీకారం చేశారు. ధరం పూర్ణచందర్, సిరిమిల్ల వరలక్ష్మి(దాత) అందుబాటులో లేని చేత ప్రమాణస్వీకారం చేయలేదు. పోలేపల్లి బుచ్చిరెడ్డి హాజరైనప్పటికి ఎమ్మెల్యే సూచన మేరకు ప్రమాణస్వీకారానికి దూరంగా ఉన్నారు. ఒంటిమామిడిపల్లి గ్రామం నుంచి ప్రతిసారి ఒకరికి ధర్మకర్తగా చోటు కల్పిస్తారు. ఈసారి ఎవరికీ అవకాశం దక్కలేదు. దీంతో కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు అలకపూనడంతో బుచ్చిరెడ్డి స్థానంలో ఆ గ్రామం నుంచి ఒకరికి అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రమాణ స్వీకారం పూర్తయ్యాక టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ధర్మకర్తలతోపాటు చైర్మన్‌ను సన్మానించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చైర్మన్ చాంబర్‌లో చైర్మన్‌ను కుర్చీలో కూర్చుండపెట్టి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఈవో కె.సుధాకర్, వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాలొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి పాటుపడుతాం..

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ నూతన కమిటీ ద్వారా ఆలయ అభివృద్ధికి పాటుపడుతామని తెలిపారు. వచ్చే జాతర వరకు భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో పెండింగ్‌లో ఉన్న పనులను దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ద్వారా నిధులు సమీకరించి పూర్తిచేస్తామని తెలిపారు. ట్రస్ట్‌బోర్డు బాధ్యతగా భక్తులకు సేవలందించాలని సూచించారు.

భక్తులకు సేవలందిస్తాం..

చైర్మన్‌గా ఎన్నికైన ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ 45ఏళ్ల నుంచి రాజకీయాల్లో ప్రజాసేవలో ఉన్నానని గుర్తించి ఎమ్మెల్యే నాగరాజు ఒక బీసీ బిడ్డకు చైర్మన్‌గా అవకాశం కల్పించారని తెలిపారు. కాంగ్రెస్‌లో సీనియర్లు ఉన్నప్పటికి తనకు ఎమ్మెల్యే అవకాశం కల్పించారని, అందరి సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.

వాహన 'సారథి'

● 25 నుంచి ఆర్టీఏలో నూతన పోర్టల్ ప్రారంభం
● త్వరలో లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్స్‌లన్నీ ఇందులోనే

ఖిలావరంగల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం వాహన వినియోగదారులకు రవాణా శాఖ సేవలను మరింత సులభతరం చేసేందుకు నూతనంగా 'సారథి పరివాహన్' పేరుతో పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. త్వరలో వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఇది అందుబాటులోకి రాబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన 'సిటిజన్ ఫ్రెండ్లీ సర్వీస్ ఇన్‌స్ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఈ నూతన పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తోంది. ఇందులో మొదటగా లర్నింగ్ లైసెన్సులు, పర్మినెంట్ లైసెన్సుల వివరాలు నిక్షిప్తం చేస్తారు. ఇప్పటికే సికింద్రాబాద్, హైదరాబాద్‌లలోని ఆర్టీఏ కార్యాలయాలలో ప్రయోగాత్మకంగా ఈ పోర్టల్‌ను ప్రవేశపెట్టారు. ఈ నెల 25 నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రవేశపెట్టనున్నారు. ఇందుకోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన పరికరాలను బిగించి, అదనంగా నెట్ స్పీడ్‌ను పెంచుతున్నారు. సంబంధిత సిబ్బందికి శిక్షణ సైతం ఇచ్చారు. ఇప్పటికే నూతన కంప్యూటర్లు, నెట్ స్పీడ్, ఇతర పరికరాలు ఆయా కార్యాలయాలకు చేరాయి.

ప్రయోజనాలు..

ఇకనుంచి సారథి పోర్టల్‌లో లైసెన్సుల మొత్తం డాటాను ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆన్‌లైన్‌లోనే మార్చుకోవచ్చు. ఇందుకోసం నిర్ణీత ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. ఇంటి నుంచే లర్నింగ్ లైసెన్సు పొందవచ్చు. అదే విధంగా రెన్యూవల్స్, చిరునామా మార్పు వంటివి చేసుకునేందుకు వీలుకల్పించనున్నారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ఈ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. షోరూంలో వాహనం కొనుగోలు చేసినప్పుడే డీలర్ల వద్దే ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు. కానీ, డ్రైవింగ్ లైసెన్సుల కోసం మాత్రం మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు నిర్వహించే పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది.



వరంగల్ జిల్లా ఆర్టీఏ కార్యాలయం (ఫైల్)



వచ్చిన యంత్రాలు, కేబుల్స్

కేబుల్ వైర్లపై విద్యుత్ శాఖ కన్నెర్ర

● సీఎండీ ఆదేశించినా రీ-అలైన్‌మెంట్ చేసుకోని కేబుల్ ఆపరేటర్స్
● హైదరాబాద్ దుర్ఘటనతో రంగంలోకి దిగిన విద్యుత్ అధికారులు
● తొలుత వినియోగంలో లేని వైర్లను తొలగిస్తున్న సిబ్బంది
● పట్టించుకోని వారి కేబుల్ వైర్ల శాశ్వత తొలగింపునకు చర్యలు

రాంనగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ ఆదేశాలు బేఖాతరు చేస్తూ విద్యుత్ స్తంభాలపై ఇష్టానుసారంగా గుత్తులు, గుత్తులుగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను ఆ శాఖ అధికారులు తొలగించే పనిలో పడ్డారు. వివిధ కమ్యూనికేషన్‌లకు సంబంధించి కేబుల్‌వైర్లు విద్యుత్ స్తంభాలపై ప్రమాదం ఘంటికలకు సూచికగా కనిపిస్తున్నాయని, సరిచేసుకోవాలని కొద్దిరోజుల కిందట సీఎండీ స్వయంగా సూచించినప్పటికీ ఆపరేటర్లు పట్టించుకోలేదు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో తాజాగా కేబుల్ వైర్ల మూలాన ఓ చోట కృష్ణాష్టమి సందర్భంగా ఆరుగురు, మరో చోట వినాయక విగ్రహం తరలింపు సందర్భంగా ఇద్దరు యువకులు విద్యుదాఘాతంతో మృత్యువాత పడారు. దీంతో ఎన్పీడీసీఎల్ పరిధిలో అధికారులు అప్రమత్తమయ్యారు. విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్‌వైర్లపై దృష్టి సారించారు. వినియోగంలో లేని వైర్లతో పాటు విద్యుత్ శాఖ ఆదేశాలను పట్టించుకోని వివిధ కమ్యూనికేషన్‌లకు చెందిన కేబుల్స్‌ను తొలగిస్తున్నారు.

పట్టించుకోని కేబుల్ ఆపరేటర్లు

విద్యుత్ స్తంభాలపై ఇష్టానుసారంగా గుత్తులు, గుత్తులుగా కేబుల్ వైర్లు ప్రమాదకంగా కనిపిస్తున్నాయి మార్చుకోవాలని కేబుల్ ఆపరేటర్లను సీఎండీ ఆయా సర్కిళ్ల అధికారుల ద్వారా ఆదేశాల జారీ చేసినా పెడచెవిన పెట్టారు. కిరాయి చెల్లిస్తున్నప్పటికీ నిబంధనలకు లోబడి నడుచుకోవాలనే పద్ధతిని కేబుల్ ఆపరేటర్లు ధిక్కరిస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో నిబంధనలు పాటించని కేబుల్ ఆపరేటర్ల వైర్లను తొలగిస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



వరంగల్‌లో వినియోగంలో లేని కేబుల్ వైర్లను తొలగిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

తొలుత వినియోగంలో లేనివి మాత్రమే..

ఎన్పీడీసీఎల్ పరిధిలో ప్రస్తుతానికి వినియోగంలో లేకుండా విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను మాత్రమే తొలగిస్తున్నారు. ఆ తర్వాత వినియోగంలో ఉండే వైర్లను రీ-అలైన్‌మెంట్ చేసుకోవాలని ఆపరేటర్లకు ఆదేశాలు జారీ చేసినట్లుగా తెలుస్తోంది. గడువులోగా చేసుకోకపోతే శాశ్వతంగా తొలగించేందుకు కార్యాచరణ రూపొందించినట్లుగా విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే తొలగింపు ప్రక్రియలో భాగంగా అక్కడక్కడ పని చేసే వైర్లు సైతం తీసేయడంతో వివిధ కమ్యూనికేషన్‌లకు అంతరాయం ఏర్పడి వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లుగా తెలుస్తోంది.

గణపతి ఉత్సవ కమిటీలతో సమావేశాలు

గణపతి మండపాల వద్ద కానీ, గణపతులను తరలించే క్రమంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు సీఎండీ ఆదేశాలతో విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళుతున్నారు. పోలీసు శాఖ, మున్సిపాలిటీ శాఖల సహాయంతో గతంలో గణపతులు ఏర్పాటు చేసిన కమిటీల ఫోన్ నెంబర్లు తీసుకునిస్థానికంగా డీఈలు, ఏడీఈలు జాగ్రత్తలు చెబుతున్నారు. నూతనంగా దరఖాస్తు చేసుకునే కమిటీలతో సమావేశాలు ఏర్పాటుచేసి, ఆదే విధంగా పోలీస్ శాఖ ఏర్పాటు చేసే పీస్ కమిటీ సమావేశాల్లో పాల్గొని అక్కడ హాజరయ్యే కమిటీ సభ్యులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించే ఏర్పాట్లలో ఉన్నట్లు విద్యుత్‌అధికారులు పేర్కొన్నారు. ప్రత్యేకంగా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎక్కువ ఎత్తుతో ఉండే ప్రతిమల వద్ద నిఘాపెంచి ఆ ఏరియాలో క్లియరెన్స్ చేసే ఏర్పాట్లలో విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు. వరంగల్ ఎల్లంబజార్‌లో 45 ఫీట్ల ఎత్తుతో గణపతి ప్రతిమను ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో ప్రత్యేకంగా సిబ్బందిని అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

వినియోగంలో లేనివి తొలగిస్తున్నాం..
గౌతమ్‌రెడ్డి, ఎస్ఈ వరంగల్

ప్రస్తుతానికి వినియోగంలో లేని కేబుల్ వైర్లను మాత్రమే తొలగిస్తున్నాం. పనిచేసే కేబుల్ వైర్లను ఆపరేటర్లు ఎంత తొందరంగా రీ-అలైన్‌మెంట్ చేసుకుంటే అంత మంచిది. కేబుల్ వైర్లతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వినాయక మం డపాల నిర్వాహకులు సైతం మండపాలతో పాటు తరలించే మార్గాల్లో విద్యుత్ వైర్లను తాకకుండా వెళ్లాలి. ప్రమాదాలకు ఆస్కారం ఉన్నట్లు అనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందజేసి మరమ్మతు చేయించుకోవాలి.

రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి జయంతి

జూలైవాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కొత్వాల్ రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పోస్టల్ కాలనీలోని రెడ్డి సంఘం కార్యాలయంలో అర్షుల కిషన్‌రెడ్డి అధ్యక్షతన రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి హైదరాబాద్ నగర కొత్వాల్ (పోలీస్ కమిషనర్)గా నియమించబడి శాంతి భద్రతలను కాపాడుతూ పేదలకు సేవ చేసిన సేవా తత్పరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, రాజిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జైహింద్‌రెడ్డి, ప్రకాశ్ రెడ్డి, మెట్రోరెడ్డి, కిషన్‌రెడ్డి, నరసింహారెడ్డి, గణపతిరెడ్డి, సంజీవరెడ్డి, యాకోబురెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఐసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. నగరంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(కేడీసీ), ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఐసెట్ కౌన్సెలింగ్ హెల్ప్‌లైన్ సెంటర్లలో ప్రారంభం అయ్యింది. కేడీసీలో ప్రిన్సిపాల్ గుర్రపు శ్రీనివాస్, ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ జ్యోతి, పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ధృవీకరణ పత్రాలు అందజేశారు.

ఇన్‌స్పైర్‌పై ఉపాధ్యాయులకు అవగాహన

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్పైర్-మనక్ - 2025 కార్యక్రమంపై శనివారం ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈవో డి.వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే కార్యక్రమానికి సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనాలని ఆమె కోరారు.

ఆర్ట్స్ కాలేజీలో ప్రారంభమైన దూరవిద్య పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కేయూ దూరవిద్య కేంద్రం నిర్వహిస్తున్న డిగ్రీ మూడో సంవత్సరం పరీక్షలు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం ప్రారంభమైన పరీక్షలకు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్, అసిస్టెంట్ కంట్రోలర్ డాక్టర్ పద్మజ, ఆర్ట్స్ కళాశాల నిర్వహణాధికారి డాక్టర్ శ్రీదేవి తదితరులు పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాటుచేసిన వసతులు, పరీక్షల తీరును వారు పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో గిలాఫ్ సమర్పణ

హనుమకొండటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలోని దర్గా ఉత్సవాల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ తరఫున భక్తిశ్రద్ధలతో గిలాఫ్‌ను సమర్పించారు. శుక్రవారం హనుమకొండలోని బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ సెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నయీమొద్దీన్, మత పెద్దలు పార్టీ కార్యాలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుంచి కాజీపేట దర్గాకు వెళ్లి గిలాఫ్ సమర్పించి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు , మైనార్టీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

స్టాంవాటర్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలి

- భారీ వరదలు తట్టుకోవడానికి అనువు
- మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భారీ వరదలు తట్టుకోవడానికి అనువుగా స్టాం వాటర్ డ్రెయిన్ల నిర్మాణం జరగాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. శుక్రవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో పాటు శుభ్ కన్సల్టెన్సీ వారి ద్వారా స్టాంవాటర్ డ్రెయిన్ ప్రాథమిక డిజైన్ ప్రతిపాదనలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలో భారీ వర్షాల వల్ల నగరం ముంపుననకు గురికాకుండా లైన్ విభాగాలైన ఇరిగేషన్, బల్దియా ఇంజనీరింగ్ అధికారులు మిగతావిభాగాల అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు కదలాలని అన్నారు. నగరంలోని 66 డివిజన్లలో స్టాంవాటర్, బాటిల్‌నెక్‌ల ఏర్పాటుతో పాటు సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రాంతాలపై దృష్టి సారించాలన్నారు. సమగ్ర సమాచారంతో అన్ని అంశాలను క్రోడీకరించి లైన్ అంశాలను తయారు చేయాలన్నారు.



పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌పై మాట్లాడుతున్న మేయర్

ఈకార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, ఇరిగేషన్ ఈఈ శంకర్ చౌహాన్, డీఈలు హర్షవర్ధన్, మధుసూదన్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థ కాంగ్రెస్‌కు వంతపాడటం సరికాదు

రాంనగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : అధికార పార్టీకి పోలీస్ వ్యవస్థ వంతపాడటం సరికాదని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. సేవ్ హైద్రాబాద్ పేరుతో బీజేపీ తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మను సుబేదారి పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ దౌర్జన్య పాలనకు ఈ ఘటన అద్దం పడుతోందన్నారు. అడ్డుకోవడం ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి చేయడమే అవుతుందన్నారు.



కార్పొరేటర్ హౌస్ అరెస్టు

జూలైవాడ(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి పిలుపు మేరకు చలో సెక్రటేరియట్ కార్యక్రమంలో పాల్గొనకుండా 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. సుబేదారి సీఐ రంజిత్ కుమార్, ఎస్ఐ మహేందర్‌రెడ్డి శుక్రవారం హౌస్ అరెస్టు చేశారు.

విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి

- సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విధులను సమర్థవంతంగా నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. హెడ్ కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన రమేశ్, కుమారస్వామిలు శుక్రవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారి భుజాలపై నక్షత్రాలను అలంకరించి ప్రజల అభిమానాన్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ డేవిడ్ రాజ్, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 18 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ ఇద్దరికి జైలు శిక్ష విధించి, 16 మందికి రూ.17,100 జరిమానా విధించారని హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్‌లేని 8మందికి రూ.6,000, మైనర్ డ్రైవింగ్ కేసులో 9 మందిని ఒక రోజు సోషల్ సర్వీస్ కోసం జువైనల్ హోంకు తరలించడం జరిగిందన్నారు.

మేయర్, కమిషనర్‌ను కలిసిన అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులుగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్, సమ్మయ్య మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌ని కలిశారు. జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన బి.చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సమ్మయ్యలు శుక్రవారం మేయర్, కమిషనర్‌లను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందించారు. మేయర్, కమిషనర్ కొత్త అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతతో విధులు నిర్వర్తించి జీడబ్ల్యూఎంసీకి మంచి గుర్తింపు తీసుకువాలని వారు సూచించారు.

పంక్చర్ షాపు కార్మికుల బంద్ విజయవంతం



వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లో పంచర్ షాపు ఎదుట నినాదాలు చేస్తున్న పంచర్ కార్మికులు

వడ్డెపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని పెట్రోల్ బంకుల్లో పంక్చర్ షాపులను నిర్వహించొద్దని డిమాండ్ చేస్తూ కాకతీయ టైర్ ఫైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (కేటీఎఫ్‌డబ్ల్యూఏ) జిల్లా అధ్యక్షుడు కె.నగేష్, జిల్లా అధికార ప్రతినిధి ఆరెల్లి సంపత్, వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. ఖలీం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెట్రోల్ బంకుల్లో ఫ్రీ ఎయిర్ చెకప్ పేరుతో పెట్రోల్ బంకు నిర్వాహకులు ఇతర రాష్ట్రాల కార్మికులతో పంక్చర్ షాపులను నిర్వహిస్తూ 30 ఏళ్ల నుంచి ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న తమ పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. పెట్రోల్ బంకుల్లో ఫ్రీఎయిర్ చెకప్‌కు తాము వ్యతిరేకం కాదని, పంక్చర్ పనులు నిర్వహించకూడదని అన్నారు. ఈ బంద్‌లో కేటీఎఫ్‌డబ్ల్యూఏ కోశాధికారి భిక్షపతి, జిల్లా నాయకులు రాంచందర్, జుబేర్, మండల శ్యామ్, రఫీక్, సత్తార్, గుండ మహేందర్, ఆవుల శ్రీనివాస్, పప్పుల రమేష్ పాల్గొన్నారు.

గణితం జీవితంలో అంతర్భాగం

- ప్రముఖ గణిత అవధాని అడ్లూరు నర్సింహమూర్తి
- కేడీసీలో గణితంపై వర్క్‌షాపు

హనుమకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గణితం జీవితంలో ఒక అంతర్భాగమని, యావత్ ప్రపంచం గణితంపైనే నడుస్తోందని విశ్రాంత గణిత అధ్యాపకుడు, ప్రముఖ గణిత అవధాని డాక్టర్ అడ్లూరు నర్సింహమూర్తి అన్నారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని మ్యాథమెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం గణితంపై వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ వర్క్‌షాపులో గణితంపై లాజికల్ అండ్ మ్యాజికల్ మెథడ్స్, వేద గణితం ద్వారా సులభంగా లెక్కల గురించి నర్సింహమూర్తి విద్యార్థులకు వివరించారు. అతిథిగాపాల్గొన్న విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి నన్నపురాజు రమేశ్వరరాజు తాను రాసిన పుస్తకాలను ప్రిన్సిపాల్‌కు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విద్యార్థులకు గణితంపై అవగాహన కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గణిత విభాగం అసోసియేట్ ప్రొఫెసర్స్ కొమురయ్య, సత్యనారాయణ, తోకల నరహరి, డాక్టర్ పాలకుర్తి దినకర్, కందాడై విజయ రాఘవన్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.



డాక్టర్ నర్సింహమూర్తి, విశ్రాంత డీఈవో రమేశ్వరరాజును సత్కరిస్తున్న కేడీసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్

హామీలను వెంటనే నెరవేర్చాలి

వడ్డెపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఓడపల్లి శ్యాంకృష్ణ, వరంగల్ పశ్చిమ నియోజక వర్గ ఇన్‌చార్జి అనుముల రమేష్, వరంగల్ ఉమ్మడి జిల్లా మీడియా ఇన్‌చార్జి కందగట్ల మోహన్ డిమాండ్ చేశారు. టీయూఎఫ్ రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ అధినేత, ఎంపీ రాహుల్ గాంధీని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ హెడ్ పోస్టాఫీసులో పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించి పోస్టు కార్డులను వేశారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర మహిళా కార్యదర్శి కందికట్ల జయ, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు భిక్షపతి, జమ్మల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కిట్స్‌లో జిల్లాస్థాయి టెన్నిస్ పోటీలు

హసన్‌పర్తి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఔట్‌డోర్ స్టేడియంలో శనివారం నుంచి రెండురోజుల పాటు వరంగల్ జిల్లా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్-2025 పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకారపు హరీష్ తెలిపారు. ఈ పోటీలలో అండర్-11, 13, 15, 17 19 విభాగాలలో బాలబాలికలకు, మహిళా, పురుష క్రీడాకారులకు సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వృత్తి శిక్షణ శిబిరంలో కేయూ ఉద్యోగులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేయూ బోధనేతర ఉద్యోగులు పి.మల్లికార్జున్, ఎస్.మహర్షి, పి.అమరనాథ్, ఎస్.దుర్గాప్రసాద్, ఎ.సంజయ్, డి.శ్రీనివాస్ ఇటీవల హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన వృత్తి శిక్షణ శిబిరంలో పాల్గొని శిక్షణను పూర్తి చేసుకున్నారు. వీరికి వృత్తిలో రాణించేందుకు మెళకువలు, రోజువారి కార్యాలయ వ్యవహారాలపై తర్ఫీదు ఇచ్చారు. పారదర్శకత, జవాబుదారీతనం, వీఈఈఐ ప్రాధాన్యత, పనిలో సమర్థతపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగులను వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ఘనంగా శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు

వడ్డెపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక జమ్మికుంట ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎన్జీవోస్ కాలనీ కేయూ వంద ఫీట్ల రోడ్డులోని శ్రీవేంకటేశ్వర కాలనీలో శ్రీకృష్ణ ప్రతిమను శుక్రవారం ఊరేగించారు. భక్తుల కోలాటాలు, శ్లోకాలలు, నినాదాలతో కాలనీ మార్మోగింది. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, వెంకటాచార్యులు, రాధిక, శశికాంత్, దివ్య, రాజు, భార్గవి, ప్రేమలత, కవిత తదితరులు పల్లకీ సేవలో పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కుల వృత్తులకు భద్రత కల్పించాలి

వడ్డెపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విశ్వ బ్రాహ్మణ కుల వృత్తులకు భద్రత కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి అన్నారు. శుక్రవారం హనుమకొండ వడ్డెపల్లిలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర కార్యదర్శి కలకోట శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గోల్డ్ మలబార్, గోల్డ్ ఐక్య ఫర్నిచర్, యూపీవీసీ, డబ్ల్యూపీవీసీ వంటి బహుళ జాతి సంస్థలు మార్కెట్ రంగంలోకి ప్రవేశించి సనాతనంగా వస్తున్న విశ్వబ్రాహ్మణ కుల వృత్తులను దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. బహుళజాతి సంస్థల ప్రవేశంతో విశ్వబ్రాహ్మణ కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారంతా రోడ్డున పడే ప్రమాదం ముంచుకొస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కులగణన ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి విశ్వబ్రాహ్మణ సంఘం రుణపడి ఉంటుందని అన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌తో పాటు పాలక మండలిని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎర్రోజు భిక్షపతి కోరారు. ఈ సమావేశంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాలకోజు నర్సింహచారి, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు కురిమిళ్ల రమేష్, శృంగారపు వెంకటేశ్వర్లు, వరంగల్ ఉమ్మడి జిల్లా యూత్ అధ్యక్షుడు బాలోజు రవీంద్రాచారి, జిల్లా నాయకులు సలేంద్ర జక్కన్న, కందారపు రాజు, బొల్లోజు రాజు, బాలాజీ భద్రయ్య, వెలకంటి రాంమూర్తి, మారేడుపాక రమేష్, బాలోజు సాంబయ్య, నర్సింహరాములు, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌ను గౌరవించాలి

- హనుమకొండ జిల్లా జడ్జి డాక్టర్ పట్టాభి రామారావు

బాలసముద్రం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సీనియర్ సిటిజన్స్‌ను గౌరవించడం మన సంస్కారానికి నిదర్శనమని హనుమకొండ జిల్లా జడ్జి డాక్టర్ పట్టాభి రామారావు అన్నారు. శుక్రవారం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా వైద్య శాఖ సహకారంతో డాక్టర్ కె.అనితారెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో నిర్వహించిన వైద్య, నేత్ర శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ జాతీయ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ద్వారా సీనియర్ సిటిజన్స్‌కోసం హెల్త్ క్యాంపు నిర్వహించినట్లు పట్టాభి రామారావు తెలిపారు. సీనియర్ సిటిజన్స్‌కు లీగల్ సమస్యలు ఏమున్నా వారికి తాము ఉచిత సేవలు అందిస్తామన్నారు. వృద్ధుల హక్కులను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. వృద్ధులు కూడా తమ అనుభవాలను , సేవలను సమాజానికి అందించాలన్నారు. ప్రతీ ఇంటి పెద్ద సలహాలు, సూచనలు తమ ఎదుగుదలకు ఎంతో అవసరమని పిల్లలు గుర్తించాలన్నారు.

డిస్ట్రిక్ట్ లీగల్‌సెల్ సర్వీస్ అథారిటీ కన్వీనర్ క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ. లీగల్‌సర్వీసెస్ అథారిటీ సమాజానికి , వృద్ధులకు అందిస్తున్న సేవలను వివరించారు. ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితారెడ్డి మాట్లాడుతూ.. వృద్ధాప్యం ఎవరికి శాపంగా మారకూడదని సీనియర్ సిటిజన్స్‌కు ఏ సమస్యలు వచ్చినా ట్రిబ్యునల్ బెంచ్‌కు ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఇంకా బన్ను ఆరోగ్య సంస్థ నిర్వాహకులు చంద్రజిత్ రెడ్డి, డాక్టర్లు మైనిక, రవీందర్‌రెడ్డి, ఉష, రవికృష్ణ, వాణి, శ్రీధర్, సీనియర్ సిటిజన్లు యుగేందర్, దేవాచారి,పీవీ శ్రీనివాసరావు, ఉపేందర్ రెడ్డి, రవీందర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ పట్టాభి రామారావు

విద్యార్థులను వేధిస్తున్న కళాశాలను మూసివేయాలి

రాంనగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా వేధిస్తున్న వాగ్దేవి డిగ్రీ కళాశాల అనుమతులు రద్దు చేసి మూసివేయాలని ఏబీవీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కిషన్‌పురలోని కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీఎస్ఎఫ్ నాయకులు విజయ్, కిరణ్, రాహుల్, సాయి, వెంకటేశ్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తీసుకున్న విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

వరంగల్ క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కుల మతాలకతీతంగా గణపతి ఉత్సవాలను నిర్వహించుకోవాలని హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మతపెద్దలు, మండప నిర్వాహకులతో శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో పీస్ కమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అనుమతులు పొందిన ప్రతిమలను మాత్రమే ప్రతిష్ఠించాలని సూచించారు. శోభయాత్రలు అనుమతించిన మార్గంలో, సూచించిన సమయంలోనే జరపాలన్నారు. సౌండ్ సిస్టం రాత్రి 10గంటల లోపే ముగించాలన్నారు. ప్రధానమైన మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి ఏర్పాటు చేసి, ప్రవేశం, ఎగ్జిట్ రెండుదారులు ఉండేలా చూడాలన్నారు ఆస్పత్రులు, పాఠశాలలు, అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులు సూచించిన చెరువుల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. మండపాల వద్ద మద్యం లేకుండా చూడాలని, నవరాత్రులు దిగ్విజయంగా పూర్తి అయ్యేందుకు పోలీసులకు సహకరించాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సతీష్, కిషోర్, పరుశురాములు, సదానందం, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, వేముల శ్రీనువాస్, పోతుల శ్రీమాన్, నాయకులు దర్శన్‌సింగ్, శ్రవణ్‌కుమార్, కల్లూరి పవన్ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి కేయూ కామర్స్ విభాగంలో కార్యశాల



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28 నుంచి 30 వరకు కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో కార్యశాల నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అమరవేణి తెలిపారు. ఈ మేరకు దీనికి సంబంధించిన గోడపత్రికను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు ఆవిష్కరించారు. 'డేటా డ్రివెన్ టీచింగ్ బిజినెస్ అనాలటిక్స్ అండ్ పవర్ బీఐ ఫర్ ఎడ్యుకేటర్' అనే అంశంపై జరిగేగ కార్యశాలకు వర్సిటీ పరిధిలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అధ్యాపకులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. నిర్ణీత ఫీజులను నాన్ వర్సిటీ ఫండ్‌గా ఆగస్టు 26 వరకు చెల్లించుకోవాలని సూచించారు. గోడపత్రిక ఆవిష్కరణలో డీన్ ప్రొఫెసర్ రాజేందర్ కట్ల, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, ప్రొఫెసర్ రామోజు నరసింహచార్య, డాక్టర్ ఫణీంద్రకుమార్, ఏఆర్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థిని ఆర్థిక స్వావలంబన సాధించాలి



పింగిళి కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ఎన్.రవి, ప్రిన్సిపాల్ చంద్రమౌళి గౌడ్

వడ్డెపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ విద్యార్థిని ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా చదువు కొనసాగించాలని వరంగల్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డు గ్రహీత ఎన్.రవి అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 'రీసెంట్ ట్రెండ్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ కెమికల్, అలయిడ్ సైన్సెస్ రీసెర్చ్' అనే అంశంపై రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి గౌడ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎన్. రవి మాట్లాడుతూ.. రసాయిన శాస్త్రం మానవ నిత్య జీవితంలో విడదీయరాని భాగంగా ఉందని అన్నారు. ఆధునిక సాంకేతికను వినియోగించుకొని తదనుగుణంగా పట్టుదల, లక్ష్య నిర్దేశనంతో కష్టపడి చదివితే ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సీనియర్ ప్రొఫెసర్ లలిత గురుప్రసాద్, కేయూ రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి, ప్రొఫెసర్ సంజీవరెడ్డి, సదస్సు సమన్వయ కర్త డాక్టర్ ఎం.అరుణ, వైస్ ప్రిన్సిపాల్ సుహాసినితో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎరువులు అందించడంలో పాలకులు విఫలం

- రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హసన్‌పర్తి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి రైతన్నలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. హసన్‌పర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల పంపిణీని శుక్రవారం ఆయన స్వయంగా పరిశీలించారు. ఎరువుల కోసం బారులు తీరిన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో రైతుకు పీఏసీఎస్ ద్వారా పంపిణీ చేస్తున్న రెండు ఎరువుల బస్తాల కోసం తెల్లవారుజామున 4 గంటల నుంచి లైన్‌లో వేచి ఉండాల్సి వస్తోందని రైతులు ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై స్పందించిన మాజీ మంత్రి దయాకర్‌రావు..జిల్లా వ్యవసాయాధికారులకు ఫోన్ చేసి రైతులకు సరిపడా ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు. అన్నదాతలను గోసపెట్టిన ఏ ప్రభుత్వాలు, అధికారులు బతికిబట్టకట్టలేదని హెచ్చరించారు. రైతులకు అండగా ఉంటూ రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేసే కేసీఆర్‌ను గద్దె దించడం వల్లే అన్నదాతలు గోసపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఎరువుల కొరత లేకుండా ఆరు నెలల ముందస్తుగానే రైతుల అవసరాలకు కావాల్సిన ఎరువులను కేంద్రానికి నివేదిక పంపి తెప్పించామన్నారు. దయాకర్‌రావు వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాడి మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు పావుశెట్టి శ్రీధర్, కందుకూరి చంద్రమోహన్, పీఏసీఎస్ డైరెక్టర్లు నేదునూరి కుమారస్వామి, వీసం కర్ణాకర్‌రెడ్డి, వల్లాల శ్రీకాంత్‌గౌడ్, నేదునూరి కుమారస్వామి, జన్ను కిషన్, ఇమ్మడి రాజేందర్‌తో పాటు సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవో కల్పన, రైతులు ఉన్నారు.



హసన్‌పర్తి పీఏసీఎస్ వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

నవ్య

కుటుంబ కదంబం

శనివారం • 23 ఆగస్టు 2025



వంటిల్లు

ఆ కాకరకాయ రుచే వేరు...

వర్షాకాలంలో విరివిగా దొరికే ఆకాకరకాయలను ఇష్టపడనివారు ఉండరు. వీటినే కొన్ని ప్రాంతాల్లో బోడ కాకరకాయలు, బొంత కాకరకాయలని కూడా పిలుస్తుంటారు. వీటితో వేపుడు, ఇగురు ఎక్కువగా చేస్తూ ఉంటారు. ఇవికాక ఆకాకరకాయలతో తయారుచేసే విభిన్న వంటకాలు మీకోసం...

ఆకాకరకాయ చికెన్

కావాల్సిన పదార్థాలు

ఆకాకరకాయలు- పావు కేజీ, చికెన్- అర కేజీ, ధనియాలు- ఒక చెంచా, జీలకర్ర- అర చెంచా, గసగసాలు- ఒక చెంచా, లవంగాలు- అయిదు, యాలకులు- రెండు, దాల్చిన చెక్క- రెండు చిన్న ముక్కలు, అల్లం- ఒక పెద్ద ముక్క, వెల్లుల్లి రెబ్బలు- పది, నూనె- అయిదు చెంచాలు, పచ్చిమిర్చి- అయిదు, ఉల్లిపాయలు- మూడు, టమాటాలు- రెండు, కారం- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, ఉప్పు- రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు- కొద్దిగా



తయారీ విధానం

- ఆకాకరకాయలను శుభ్రంగా కడిగి ముక్కలుగా కోసుకోవాలి. ఉల్లిపాయలు, టమాటాలను కూడా చిన్న ముక్కలుగా తరిగి ఉంచుకోవాలి. చికెన్ ముక్కలను ఉప్పునీళ్లతో బాగా కడగాలి. మిక్సీలో ధనియాలు, జీలకర్ర, గసగసాలు, లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఆ పొడిని పళ్లెంలోకి తీయాలి. తరవాత మిక్సీలో అల్లం, వెల్లుల్లి రెబ్బలను కూడా వేసి పేస్టులా చేయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడిచేయాలి. తరవాత మధ్యకు చీల్చిన పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, పసుపు వేసి కొద్దిగా వేగనివ్వాలి. తరవాత టమాటా ముక్కలు వేసి కలిపి మూతపెట్టి మగ్గనివ్వాలి. అయిదు నిమిషాల తరవాత మూత తీసి చికెన్ ముక్కలు, వేసి కలిపి రెండు నిమిషాలు వేగనివ్వాలి. చికెన్ ముక్కలు కొద్దిగా మెత్తబడిన వెంటనే ఆకాకరకాయ ముక్కలు, కారం, అల్లం వెల్లుల్లి పేస్టు, ఉప్పు, ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న మసాలాల పొడి వేసి బాగా కలపాలి. అందులో అర కప్పు నీళ్లు పోసి మూతపెట్టి పావుగంటసేపు మగ్గించాలి. తరవాత మూత తీసి కొత్తిమీర తరుగు చల్లి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారుచేసుకున్న ఆకాకరకాయ చికెన్ కూర... వేడి అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

చిట్కాలు

- ఆకాకరకాయ, చికెన్ ముక్కలను మరీ మెత్తగా ఉడికించకూడదు.
- గ్రేవీ చిక్కగా కమ్మగా రావాలనుకుంటే కొద్దిగా జీడిపప్పు పేస్టు కలుపుకోవచ్చు

ఆకాకరకాయ బిరియాని

కావాల్సిన పదార్థాలు

లేత ఆకాకరకాయలు- పావు కేజీ, బాస్మతి బియ్యం- రెండు కప్పులు, బిరియాని ఆకులు- రెండు, సాజీరా- ఒక చెంచా, దాల్చిన చెక్క- రెండు చిన్న ముక్కలు, లవంగాలు- అయిదు, యాలకులు- నాలుగు, అనాస పువ్వు- ఒకటి, ధనియాలు- ఒక చెంచా, జీలకర్ర- ఒక చెంచా, ఎండు మిర్చి- అయిదు, మిరియాలు- పావు చెంచా, ఎండు కొబ్బరి ముక్కలు- రెండు చెంచాలు, కసూరి మేతి- ఒక చెంచా, పెరుగు- పావు కప్పు, చింత పండు గుజ్జు- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, కారం- ఒక చెంచా, గరం మసాల పొడి- అర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒకటిన్నర చెంచాలు, పచ్చిమిర్చి- రెండు, పసుపు- అరచెంచా, బ్రౌన్ ఆనియన్స్- కొద్దిగా, కొత్తిమీర తరుగు- కొద్దిగా, పుదీనా- కొద్దిగా, నూనె- అయిదు చెంచాలు, నెయ్యి- నాలుగు చెంచాలు, కుంకుమ పువ్వు- కొద్దిగా, పాలు- అర కప్పు

తయారీ విధానం

- బాస్మతి బియ్యాన్ని కడిగి నిండా నీళ్లు పోసి అరగంట నానబెట్టాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో ధనియాలు, జీలకర్ర, ఎండు మిర్చి, మిరియాలు, ఎండు కొబ్బరి ముక్కలు వేసి దోరగా వేపి చల్లార్చాలి. వీటితోపాటు కసూరి మేతిని కూడా మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
- ఆకాకరకాయలను శుభ్రంగా కడిగి వాటిని గుత్తుల్లా కోయాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి నాలుగు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. అందులో ఆకాకరకాయలు వేసి చిన్న మంట మీద అయిదు నిమిషాలు దోరగా వేపి పళ్లెంలోకి తీయాలి.
- వెడల్పాటి గిన్నెలో పెరుగు, చింత పండు గుజ్జు, ఉప్పు, కారం, గరం మసాల పొడి, ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న మసాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్టు, పసుపు, పచ్చి మిర్చి వేసి బాగా కలపాలి. తరవాత వేయించి పెట్టుకున్న ఆకాకరకాయలు, బ్రౌన్ ఆనియన్స్, కొత్తిమీర తరుగు, పుదీనా ఆకులు వేసి జాగ్రత్తగా కలపాలి.
- స్టవ్ మీద పెద్ద గిన్నె పెట్టి సగానికిపైగా నీళ్లు పోసి చెంచా ఉప్పు, బిరియాని ఆకులు, సాజీరా, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు, అనాసపువ్వు, చెంచా నూనె వేసి కలపాలి. నీళ్లు మరిగాక ముందుగా నానబెట్టిన బాస్మతి బియ్యం వేసి పలుకుల్లా ఉడికించాలి. తరవాత నీళ్లు వడగట్టాలి.
- స్టవ్ మీద అడుగు మందంగా ఉండే పాన్ పెట్టి రెండు చెంచాల నెయ్యి వేసి వేడి చేయాలి. ఇందులో ఆకాకరకాయల మిశ్రమం పరచాలి. కొన్ని నీళ్ల చుక్కలు చల్లాలి. దీనిమీద ముందుగా ఉడికించుకున్న బాస్మతి బియ్యం వేసి పైన బ్రౌన్ ఆనియన్స్, కొత్తిమీర తరుగు, పుదీనా ఆకులు, కుంకుమ పువ్వు కలిపిన పాలు, రెండు చెంచాల నెయ్యి వేయాలి. మూత పెట్టి చిన్న మంట మీద పావుగంటసేపు మగ్గించాలి. ఇలా తయారు చేసుకున్న ఆకాకరకాయ బిరియానీని వేడిగా సర్వ్ చేసుకోవాలి. ఏదైనా గ్రేవీ కర్రీ లేదా రైతాతో తింటే రుచిగా ఉంటుంది.



చిట్కాలు

- ఆకాకరకాయలు పెద్దగా ఉంటే వాటిని ముక్కలుగా కోసి లోపలి గింజలు తీసి వేయాలి.
- బిరియాని మగ్గుతున్నప్పుడు కొన్ని కొబ్బరిపాలు చిలకరిస్తే రుచి మరింత పెరుగుతుంది.

ఆకాకరకాయ ఊరగాయ



కావాల్సిన పదార్థాలు

ఆకాకరకాయలు- పావు కేజీ, కారం- ముప్పావు కప్పు, ఉప్పు- పావు కప్పు, ఆవపిండి- పావు కప్పు, మెంతిపిండి- పావు చెంచా, వెల్లుల్లి రెబ్బలు- పది, నువ్వుల నూనె- ఒకటిన్నర కప్పులు, నిమ్మరసం- పావు కప్పు

తయారీ విధానం

- ఆకాకరకాయలను నీళ్లతో శుభ్రంగా కడిగి తడిలేకుండా పొడి గుడ్డతో తుడవాలి. వీటిని ఒక రోజంతా ఆరనివ్వాలి. తరవాత ఒక్కోదాన్ని పొడవుగా నాలుగు ముక్కలుగా కోయాలి. ఒక గిన్నెలో కారం, ఉప్పు, ఆవపిండి, మెంతిపిండి వేసి కలిపి ఉంచుకోవాలి.
- వెడల్పాటి గిన్నెలో ఆకాకరకాయల ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు, కారం మిశ్రమం వేసి కలపాలి. తరవాత నువ్వుల నూనె పోసి ముక్కలకు కారం బాగా పట్టేలా కలపాలి. ముక్కల మీద నూనె తేలుతూ ఉండాలి. తరవాత నిమ్మరసం వేసి మరోసారి బాగా కలపాలి. ఈ గిన్నె మీద మూతపెట్టి ఒక రోజంతా ఊరనివ్వాలి. తరవాత ఉప్పు సరిచూసుకుని గాజు సీసాలో భద్రపరిస్తే ఈ ఆకాకరకాయ ఊరగాయ రెండు నెలల వరకు నిల్వ ఉంటుంది. ఊరినకొద్దీ దీని రుచి పెరుగుతుంది. వేడి అన్నం, ఇడ్లీ, దోశల్లోకి బాగుంటుంది.

చిట్కాలు

- కల్లుప్పును కొద్దిసేపు ఎండలోపెట్టి మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసి కలిపితే పచ్చడి ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. నిమ్మరసాన్ని కూడా గంటసేపు ఎండలో ఉంచాలి.

పోలాల పండుగ... సంబరాలు మెండుగా...

అన్నదాతలకు పంటల సాగులో ఆద్యంతం అండగా నిలిచేవి బసవన్నలు. వాటికి కృతజ్ఞతలు తెలుపుకోవడానికి ప్రతి సంవత్సరం ఆదిలాబాద్ ప్రాంతంలోని పల్లెల్లో రైతులు ఉత్సవాలు చేస్తారు. శ్రావణమాసం చివరి రోజున... పోలాల అమావాస్య నాడు ఈ పండుగను నిర్వహించుకోవడం తరతరాల ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవాలను 'పోలాల అమావాస్య', ఎడ్ల పండుగ అని కూడా పిలుస్తారు. ఈ వేడుక రైతుల జీవితంలో ముఖ్యమైన భాగం.



బసవన్నలను అలంకరించి...

పోలాల అమావాస్య నాడు రైతులు ఉదయాన్నే నిద్ర లేచి, వాకిళ్లలో ఆవుపేడతో కల్లాపి చల్లుతారు. తరువాత ఎద్దులను గ్రామ సమీపంలోని చెరువులు, కుంటలు, నీటి కాలువలలోకి తీసుకువెళ్ళి శుభ్రపరుస్తారు. ఆ రోజంతా వ్యవసాయ పనుల జోలికి వెళ్ళరు. పగలంతా పశువులను కడుపునిండా మేపి, గడ్డి మోపులతో సాయంత్రం ఇంటికి చేరుకుంటారు. పొద్దున్నే అడవి నుంచి తీసుకువచ్చిన మోదుగ కొమ్మ నారను ఎద్దు కొమ్ములకు కడతారు. దాన్ని 'పత్రి పట్టి' అంటారు. అలాగే గజ్జెలు, గంటలు, రంగురంగుల వస్త్రాలతో ఎద్దులను ముస్తాబు జేస్తారు. ప్రత్యేకంగా రూపొందించిన వస్త్రాలను (జూళ్ళను) వాటిపై కప్పుతారు. కొమ్ములకు అద్దాల అలంకరణలు చేసి, రంగురంగుల బెలూన్స్ కడతారు. వాటి శరీరమంతా రంగులు పూసి అందంగా తయారు చేస్తారు.

ప్రత్యేక పూజలు, హారతులు, నైవేద్యాలు...

ఇలా ప్రత్యేకంగా అలంకరించిన బసవన్నలను ఊరు బయట ఒక చోటికి చేర్చుతారు. అక్కడ రైతులందరూ గ్రామ పెద్ద (పటేల్) సమక్షంలో... ఇసుకతో శివలింగాన్ని, నంది అడుగులను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజలో ఉపయోగించిన పసుపు, కుంకుమలను బసవన్నల నుదుట దిద్దుతారు. అక్కడి నుంచి డప్పు వాయిద్యాలతో వాటిని గ్రామ హనుమాన్ ఆలయాలకు ఊరేగింపుగా తీసుకువెళ్తారు. ఆలయం దగ్గర కట్టిన మామిడి ఆకుల తోరణాన్ని పటేల్ ప్రత్యేకమైన కర్రతో కొట్టి తెంపుతారు. దాంతో పోలాల అమావాస్య వేడుకలు ప్రారంభమవుతాయి. "ఓం నమః పార్వతీపతయే హర హర మహాదేవ" అని నినాదాలు చేస్తూ... గ్రామ దేవతల చుట్టూ బసవన్నలను ప్రదక్షిణలు చేయించి... ఇంటికి తీసుకువెళ్తారు. అక్కడ వాటికి గుగ్గిలంతో హారతి ఇస్తారు. పప్పు బూరెలు, బియ్యం-బెల్లంతో చేసిన పాయసం, గారెలు, అప్పాలతో నైవేద్యాన్ని సమర్పించి, మొక్కులు తీర్చుకుంటారు. ఆ తరువాత... పొద్దుటి నుంచి పాటించిన ఉపవాసాన్ని రైతు కుటుంబాలు విరమిస్తాయి. ఇలా చేయడం వల్ల శివపార్వతుల అనుగ్రహం, ఆశీస్సులు దక్కుతాయని, పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయని రైతుల నమ్మకం.

నేడు పోలాల అమావాస్య

ఈ ఉత్సవాలు నిర్వహించడం, తోరణాలు తెంపడం తరతరాల ఆచారమనీ, ఇలా చేయడం వల్ల పంటలు పుష్కలంగా పండుతాయనీ, పశువులు ఆరోగ్యంగా ఉంటాయనీ రైతులు నమ్ముతారని తాంసి మండలానికి చెందిన గ్రామ పటేల్ కాడగిరి రామన్న యాదవ్ వివరించారు.

ప్రత్యేక గుర్తింపు కోసం...

సాగులో ఎక్కువగా యంత్రాల వాడకంపై ఆధారపడుతున్న చాలామంది అన్నదాతలు పశు పోషణపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీనితో అనేక గ్రామాల్లో వేళ్ళమీద లెక్కపెట్టేటన్ని మాత్రమే కాడెద్దుల జతలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో... బసవన్నల గొప్పతనాన్ని, ఈ పండుగ వైభవాన్ని భావితరాలకు తెలియజెప్పేందుకు, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తేవడానికి ప్రయత్నిస్తున్నామని, ఈ ఏడాది తాంసి మండల కేంద్రంలో శనివారం పోలాల అమావాస్య పండుగను నిర్వహిస్తున్నామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా చెప్పారు. దీనిలో భాగంగా సాంస్కృతిక, హస్తకళా ప్రదర్శనలు, జానపద నృత్య కార్యక్రమాలు, తినుబండారాల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు.



• మాదస్తు రాజేశ్వర్

భోజన కుతూహలం

కంటికి మేలు చేసే ముల్లంగి ఆకులు!

ముల్లంగి దుంపలు ఘాటుగా ఉంటాయి. లేత చేదు కూడా ఉంటుంది. కానీ ముల్లంగి ఆకుల్లో ఈ చేదు ఉండదు. అందుకే ఈ ఆకులను ఉత్తర భారత దేశంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ ఆకుల్లో అనేక రకాల విటమిన్లతో పాటుగా.. ఫైబర్ కూడా ఉంటుంది. ఈ ఆకుల వల్ల కలిగే లాభాలేమిటో తెలుసుకుందాం.

- ముల్లంగి ఆకులు కంటి చూపును మెరుగుపరుస్తాయి. వీటిలో కాల్షియం, మెగ్నిషియం, ఫాస్పరస్ వంటివి ఎక్కువగా ఉంటాయి.
- ముల్లంగి ఆకులకు వేడి చేసే స్వభావం ఉంది. అంతే కాకుండా పచ్చి ఆకులు కఫాన్ని పెంచుతాయి. అందువల్ల పచ్చి ఆకులను తినకూడదు.
- ఈ ఆకుల్లో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణప్రక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకం తగ్గుతుంది.
- వీటిని క్రమం తప్పకుండా తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- కీళ్లవాతాన్ని హరిస్తాయి. వాపులను తగ్గిస్తాయి.
- ముల్లంగి ఆకులను ఎండబెట్టి .. వాటితో టీ కాచుకొని తాగితే కళ్ల మంటలు, దురదలు.. నీరు కారటం వంటివి తగ్గుతాయి.
- మధుమేహ వ్యాధి గ్రస్తులకు వచ్చే అరికాళ్ల మంటలు ఈ ఆకుల వల్ల తగ్గుతాయి.

ముల్లంగి ఆకులతో పప్పు, పచ్చడి చేసుకుంటారు. ఆకులను శుభ్రంగా కడిగి వాటిని.. కందిపప్పును ఉడికించి.. తాలింపు వేసుకొని తింటే పప్పు రుచిగా ఉంటుంది. ఇక ముల్లంగి ఆకులను దోరగా వేయించి.. దానిలో ఉప్పు, చింతపండు, ఎండు మిరపకాయలు వేసి బాగా మగ్గనివ్వాలి. ఆ తర్వాత ఉప్పు వేసి మిక్సీలో వేసి ముద్దగా చేస్తే రుచికరమైన పచ్చడి అవుతుంది.

• గంగరాజు అరుణాదేవి



శ్రీశక్తి

రైల్వే నిర్వహణ... ఈ మహిళామణులదే!

దక్షిణమధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జోన్‌లో ప్రస్తుతం 80,527 మంది పని చేస్తున్నారు. వారిలో 8,968 మంది మహిళలు. 53 మంది లోకో పైలెట్లు, 64 మంది స్టేషన్‌మాస్టర్లతో పాటు 837 మంది ట్రాక్ మెయింటెనర్లుగా, 606 మంది సాంకేతిక నిపుణులుగా, 134 మంది మహిళలు అధికారులుగా సేవలు అందిస్తున్నారు. నిర్దిష్టమైన పని గంటలకు రైల్వే వ్యవస్థలో అవకాశం ఉండదు. ముఖ్యంగా రైళ్ల నిర్వహణను పర్యవేక్షించే అధికారులు రాత్రింబవళ్లు అప్రమత్తంగా వ్యవహరించాలి. అన్నిటినీ అధిగమించి మగవారికి దీటుగా మహిళలు సత్తా చాటుతున్నారు.



భారతీయ రైల్వే... ప్రపంచంలోని అతిపెద్ద రైల్వే సంస్థల్లో ఒకటి. నిత్యం వేల కిలోమీటర్లు తిరిగే రైళ్లు... లక్షలమంది ప్రయాణికులు... సరుకు రవాణాలు... అన్నిటినీ సమన్వయం చేసుకొంటూ... సమయ పాలన పాటిస్తూ... సురక్షితంగా గమ్యానికి చేర్చడమంటే అడుగడుగునా సవాళ్లే. అంతటి క్లిష్టమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు ఈ మహిళా అధికారులు. సికింద్రాబాద్ కేంద్రంగా దక్షిణమధ్య రైల్వేలోని ఐదు ప్రధాన విభాగాలకు నేతృత్వం వహిస్తున్నారు. ఓర్పు... నేర్పు... సమయోచిత నిర్ణయాలతో రికార్డు స్థాయిలో ఆదాయం సమకూర్చి... జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆ మహిళామణులు 'నవ్య'తో తమ అనుభవాలు పంచుకున్నారు.



రైళ్ల ఆపరేటింగ్ అధిపతి... - పద్మజ

దక్షిణమధ్య రైల్వేలో అత్యంత కీలకమైన విభాగం... ఆపరేటింగ్. ఈ విభాగానికి ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు... కె.పద్మజ. ప్రధానంగా ఆమె రైళ్ల రాకపోకలపై దృష్టి పెట్టారు. సమయపాలన పాటించడంలోనూ, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలోనూ కీలకంగా వ్యవహరించారు. 1991 బ్యాచ్ ఐఆర్‌టీఎస్ అధికారి అయిన పద్మజ... రైళ్ల షెడ్యూలింగ్, ట్రాఫిక్ నిర్వహణలో ఇతర శాఖలతో సమన్వయం చేసుకొంటూ సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. ఈ ఏడాది జనవరిలో బాధ్యతలు చేపట్టిన ఆమె... గతంలో ఇదే జోన్‌లో వాణిజ్య, నిర్వహణ విభాగాన్ని పర్యవేక్షించారు. పండుగలు, ఉత్సవాల సమయంలో ప్రయాణికుల రద్దీని పక్కాగా అంచనా వేసి... వెయ్యికి పైగా ప్రత్యేక రైళ్లను విజయవంతంగా నడిపించారు. అంతేకాదు... 49 మిలియన్ టన్నుల సరుకును లోడింగ్ చేసి రికార్డు నెలకొల్పారు.



నిధుల నిర్వహణ... - హేమసునీత

ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎస్‌సీఆర్ జోన్‌లో ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా హేమ సునీత బాధ్యతలు చేపట్టారు. 1993 బ్యాచ్ ఐఆర్‌ఎస్ఎస్ అధికారి అయిన ఆమె... గతంలో ఫైనాన్షియల్ అడ్వైజర్-చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేశారు. ప్రిన్సిపల్ ఫైనాన్స్ అడ్వైజర్‌గా జోన్ ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 'యూరోపియన్ బిజినెస్ స్కూల్‌'లో ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ పొందిన హేమ సునీత... పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్, టాక్స్ లాస్ తదితరాల్లో నైపుణ్యం సంపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై వరకు ఎస్‌సీఆర్‌కు రూ.8,081 కోట్లు ఆదాయం సమకూరింది. ఇందులో ఆమె కృషి ఎంతో ఉంది. గత ఏడాది ఇదే కాలానికి ఆదాయంతో పోలిస్తే మూడు శాతం వృద్ధి నమోదైంది. హేమ సునీత... ఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో అద్భుత పనితీరు ప్రదర్శిస్తూ... జోన్‌ను లాభాల ట్రాక్‌పై నడుపుతున్నారు.



రైల్వే పోలీస్ చీఫ్... - అరోమాసింగ్

రోజూ సుమారు లక్షమంది ప్రయాణికులు రాకపోకలు సాగించే దక్షిణమధ్య రైల్వే పోలీసింగ్ వ్యవస్థను సమర్థవంతంగా నడిపిస్తున్నారు అరోమాసింగ్ ఠాకూర్. 1993 బ్యాచ్ ఐఆర్‌పీఎఫ్ఎస్ అధికారి అయిన ఆమె... 2023లో ఎస్‌సీఆర్ జోన్‌లో ఐజీ కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. వేల కోట్ల రూపాయల విలువైన రైల్వే ఆస్తులను కాపాడటంతోపాటు రైల్వే స్టేషన్లు, రైళ్లలో ప్రయాణికుల భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఆమె నేతృత్వంలో 'ఆపరేషన్ యాత్రి సురక్ష, ఆపరేషన్ అమానత్, ఆపరేషన్ నన్హే ఫరిస్తే, ఆపరేషన్ సతర్క్' లాంటి ప్రత్యేక కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయి. మహిళా ప్రయాణికుల భద్రత కోసం మహిళా శక్తి బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే 'యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్‌'లు ప్రారంభించి స్టేషన్లు, రైళ్లలో నిరంతర నిఘా పెట్టారు.



ఉద్యోగుల ఆరోగ్య పర్యవేక్షణ... - డాక్టర్ నిర్మల

ఎస్‌సీఆర్‌లో పని చేస్తున్న ఎనభై వేల మందికి పైగా ఉద్యోగుల ఆరోగ్య పర్యవేక్షణ బాధ్యత డాక్టర్ నిర్మల రాజారాంది. ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ హోదాలో రైల్వే ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారు. 380 పడకల లాలాగూడ కేంద్ర రైల్వే ఆసుపత్రితో పాటు జోన్ పరిధిలోని విజయవాడ, గుంతకల్, నాందేడ్, గుంటూరు డివిజనల్, తిరుపతి, రాయనపాడు సబ్‌డివిజనల్ ఆసుపత్రులు, 40 హెల్త్ యూనిట్‌లను పర్యవేక్షిస్తున్నారు. 1989 బ్యాచ్ ఐఆర్‌హెచ్ఎస్ అధికారి అయిన నిర్మల... గత ఏడాది డిసెంబరులో ఈ బాధ్యతలను చేపట్టారు.



వాణిజ్య విభాగం... - ఇతి పాండే

దక్షిణమధ్య రైల్వేలో చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ ప్రత్యేకతను చాటుకొంటున్నారు ఇతి పాండే. 2023లో దక్షిణాఫ్రికాలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కామ్రేడ్స్ మారథాన్‌లో... 11.47 గంటల్లో 88 కిలోమీటర్ల దూరాన్ని పూర్తి చేశారు. ఈ ఘనత సాధించిన ఏకైక మహిళా సివిల్ సర్వెంట్‌గా రికార్డులకు ఎక్కారు. 1998 బ్యాచ్ ఐఆర్‌టీఎస్ అధికారి అయిన ఆమె... 2024లో బ్యూరోక్రాట్స్ ఛేంజ్‌మేకర్స్‌లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఎస్‌సీఆర్‌లో టికెట్ అమ్మకాలు, అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్, స్టేషన్ నిర్వహణ, ఫ్రయిట్ సేవలు, మార్కెటింగ్‌తో పాటు ఆదాయ వనరుల పెంపుదల కోసం సంస్కరణలు తీసుకువచ్చారు. రైల్వేకు చేసిన సేవలకు గుర్తింపుగా ఇతి పాండే రైల్ మంత్రి రాజభాష రజత్ పదక్ (2025), ఎక్సలెన్స్ & మెరిటోరియస్ సర్వీసెస్ (2007), విమెన్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ (2016) తదితర అవార్డులు అందుకున్నారు. అలాగే పశ్చిమ రైల్వేకు సంబంధించి సరుకు రవాణా కార్యకలాపాలపై సమగ్ర అవలోకనంతో 'రైడింగ్ ది ఫ్రయిట్ ట్రైన్' అనే పుస్తకం కూడా రాశారు.

• వరకాల యాదగిరి, హైదరాబాద్

అక్రమ కేబుళ్లన్నీ తొలగించండి

(మొదటిపేజీ తరువాయి)

తండ్రి చితికి నిప్పుపెట్టాల్సిన దుస్థితి వచ్చిందని.. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని, ఆ బాలుడిని ఎవరు ఓదారుస్తారని ప్రశ్నించింది. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి' పత్రికలో వచ్చిన కథనాన్ని ఓపెన్ కోర్టులో ధర్మాసనం ప్రస్తావించింది. ఎటువంటి ఒప్పందాలు, అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుళ్లన్నీ తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఒకవేళ అనుమతులు ఉన్నా ప్రమాదకరంగా ఉంటే తొలగించాలని స్పష్టం చేసింది. అక్రమ కేబుళ్లను తొలగించడం, ప్రాణనష్టం లేకుండా ఏయే చర్యలు తీసుకున్నారనేదానిపై వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, ఎస్పీడీసీఎల్‌కు ఆదేశాలు జారీచేసింది. రామంతాపూర్ విద్యుదాఘాతం ఘటన నేపథ్యంలో విద్యుత్ స్తంభాలకు ఉన్న ఇంటర్నెట్ కేబుళ్లను తొలగించడాన్ని సవాల్ చేస్తూ భారతి ఎయిర్‌టెల్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ కొనసాగించింది. ఒప్పందం మేరకు స్తంభాలకు కేబుళ్లు పెట్టామని, నోటీసు ఇవ్వకుండా తొలగించడం అక్రమమని ఎయిర్‌టెల్ తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. అయితే గ్రేటర్ హైదరాబాద్‌లో 20లక్షలకు పైగా స్తంభాలు ఉంటే.. 1.73 లక్షల స్తంభాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయని ప్రభుత్వం, ఎస్పీడీసీఎల్ న్యాయవాదులు తెలిపారు. పరిమితికి మించి కేబుళ్లు ఉండటంతో స్తంభాలు పడిపోతున్నాయని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. అక్రమంగా కేబుళ్లు పెడితే ప్రభుత్వ, విద్యుత్‌శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల చనిపోయిన కుటుంబాలను ఎవరు ఓదారుస్తారని, ఆ కుటుంబాల పరిస్థితి ఏమిటని నిలదీసింది. కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

ఇకపై నిరంతర ప్రక్రియగా కేబుళ్ల తొలగింపు..

విద్యుత్ స్తంభాలపై వేసిన అనుమతి లేని కేబుళ్లనింటినీ తొలగించాలని దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) నిర్ణయించింది. చాలా ఇంటర్నెట్, కేబుల్ టీవీ కంపెనీల నిర్వాహకులు అనుమతి లేకుండానే విద్యుత్ స్తంభాలపై ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (ఓఎఫ్‌సీ), కో-యాక్సిల్ కేబుల్ (లోపల లోహపు కండక్టర్‌తో ఇన్సులేషన్ ఉన్న కేబుల్ టీవీ తీగలు)ను అమర్చుతున్నారని గుర్తించింది. ఈ కేబుళ్లు వదులుగా కిందకు వేలాడుతుండటం, ఉపయోగించని, పనికిరాని కేబుళ్లను అలాగే వదిలేయడం, స్తంభాల వద్ద పరికరాలను ఏర్పాటు చేయడం వంటివి ప్రమాదకరంగా మారుతున్నట్టు తేల్చింది. ఈ క్రమంలోనే అనుమతి తీసుకోకుండా వేసిన కేబుళ్లను తొలగించాలని.. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని ఎస్పీడీసీఎల్ నిర్ణయించింది. కేబుళ్లు వేసేందుకు అనుమతి పొందిన సంస్థలు సంబంధిత నిబంధనలన్నీ కచ్చితంగా పాటించేలా చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. ఇంటర్నెట్, కేబుల్ టీవీ ఆపరేటర్లంతా సంప్రదించుకుని అనధికారంగా వేసిన కేబుళ్లను తొలగించాలని కోరినా ఫలితం లేకపోవడంతో.. ప్రజా భద్రత దృష్ట్యా తాము చర్యలు చేపడుతున్నట్టు తెలిపింది.

ఉన్నట్టుండి కేబుళ్లు కట్ చేస్తే ఎలా?

గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై కేబుళ్ల తొలగింపుతో ఇంటర్నెట్, కేబుల్ టీవీ సేవలు నిలిచిపోయాయి. దీనితో తీవ్ర ఇబ్బంది ఎదురవుతోందని వినియోగదారులు, ఇంటర్నెట్ సర్వీసుల నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతి తీసుకోకుండా కేబుళ్లు వేయడాన్ని ఇన్నాళ్లూ పట్టించుకోకుండా ఇప్పుడు ఉన్నట్టుండి తొలగిస్తే ఎలాగని నిలదీస్తున్నారు. ముందస్తుగా సమాచారమిచ్చి, కేబుళ్లను సరిచేసే అవకాశమిచ్చి.. అప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అసలు రామంతాపూర్ ఘటనలో సమస్య ఎక్కడుందో, ఎలా ప్రమాదం జరిగిందో అధికారులు పూర్తిస్థాయి విచారణ చేయలేదని, ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదని గుర్తు చేస్తున్నారు.

సురవరం ఇక లేరు



సీపీఐ అగ్రనేత సుధాకర్‌రెడ్డి కన్నుమూత.. అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో మృతి

- 1998లో, 2004లో నల్లగొండ ఎంపీగా విజయం
- 2012 నుంచి 2019 దాకా జాతీయ స్థాయిలో నాయకత్వం
- తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా సీపీఐ నిలవడంలో కీలకం
- చంద్ర రాజేశ్వరరావు తర్వాత సీపీఐ పగ్గాలు చేపట్టిన రెండో తెలుగు వ్యక్తి

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో అజాతశత్రువు... తాడిత, పీడిత వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన తెలంగాణ మట్టిబిడ్డ.. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మాజీ ప్రధాన కార్యదర్శి.. సురవరం సుధాకర్ రెడ్డి (84) ఇక లేరు. కొంతకాలంగా శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్న ఆయనను కుటుంబసభ్యులు రెండు రోజుల క్రితం గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 10.20 గంటల సమయంలో సుధాకర్ రెడ్డి తుదిశ్వాస విడిచినట్లు సీపీఐ అధికారికంగా ప్రకటించింది. కొన్నాళ్లుగా ఆయన ప్రాణవాయువును అందించే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను వినియోగిస్తున్నారు. సురవరం సుధాకర్ రెడ్డికి భార్య విజయలక్ష్మి, కుమారులు నిఖిల్, కపిల్ ఉన్నారు. అమెరికాలో ఉన్న పెద్ద కుమారుడు నిఖిల్ ఆదివారం ఉదయానికి భారత్ చేరుకుంటారని సమాచారం. అప్పటివరకు సుధాకర్‌రెడ్డి భౌతిక కాయాన్ని గచ్చిబౌలి కేర్ మార్చురీలో ఉంచుతామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం హిమాయత్‌నగర్‌లోని మగ్దూం భవన్‌లో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ భౌతికకాయాన్ని ఉంచనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గాంధీ వైద్యకళాశాలకు సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని అప్పగిస్తామని నారాయణ వెల్లడించారు. కాగా.. సురవరం నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి ఇచ్చారు.

చిన్నప్పటి నుంచే..

తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు సురవరం ప్రతాపరెడ్డి తమ్ముడు వెంకటరామిరెడ్డి కుమారుడు సుధాకర్‌రెడ్డి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొండ్రావుపల్లి గ్రామంలో 1942, మార్చి 25న జన్మించారు. ఉన్నత, కళాశాల విద్య కర్నూలులో పూర్తి చేసి... హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం(ఎల్ఎల్‌బీ) చదివారు. ఒకవైపు పెదనాన్న సాంస్కృతిక ఉద్యమ ఆదర్శాలను, మరోవైపు తండ్రి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న సుధాకర్‌రెడ్డి... చిన్నవయసులోనే సమస్యలపై పోరుబాట పట్టారు. కర్నూలులో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సమయంలో బ్లాక్‌బోర్డు, చాక్‌పీస్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంపై నిరసన చేపట్టారు. అది ఉద్యమంగా రూపుదిద్దుకొని నగరంలోని మిగతా విద్యాలయాలకు వ్యాపించింది. విద్యార్థి దశలోనే సమస్యలపై శంఖారావం పూరించిన సురవరం... తర్వాత ఏఐఎస్ఎఫ్ కర్నూలు పట్టణ కార్యదర్శిగా, తర్వాత జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. డిగ్రీ పూర్తి చేసిన అనంతరం విజయవాడ విశాలాంధ్ర పత్రికలో చేరారు. అందులో విలేకరిగా పనిచేస్తున్న సమయంలో.. పార్టీ ఆదేశానుసారం హైదరాబాద్‌లో విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు 1965లో ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీలో చేరారు. ఆ మరుసటి ఏడాది ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు.

18 ఏళ్లకే ఓటు హక్కు కావాలని...

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రెండు దశాబ్దాల పాటు 21 ఏళ్లు నిండిన వారికే ఓటు హక్కు ఉండేది. మరో యువజన నేత కేరళకు చెందిన చంద్రప్పన్‌తో కలసి సురవరం... 18ఏళ్లకే ఓటు హక్కు కల్పించాలని పెద్ద ఉద్యమాన్ని లేవదీశారు. వారి పోరాట ఫలితంగానే ఓటు హక్కు వయసు 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించినట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతారు. రాజకీయ, సామాజిక, చారిత్రక విషయాలను విశ్లేషణాత్మకంగా వివరిస్తూ ఉపన్యసించడం ఆయన ప్రత్యేకత. ఆ వాగ్ధాటితో ఎంతోమందిని ప్రభావితం చేశారు. యువజన ఉద్యమంలో ఉన్న సమయంలోనే ప్రత్యేక శిక్షణ తరగతులకు రష్యా వెళ్లిన సమయంలో.. తమ పార్టీకి చెందిన విజయలక్ష్మితో పరిచయం ఏర్పడింది. అలా కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంస్థలలో పనిచేస్తున్న ఇరువురు 1974 ఫిబ్రవరి 19న వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. సుధాకర్‌రెడ్డి పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలోనే.. తన ఇద్దరు కుమారులకూ సాదాసీదాగా ఒకే రోజు, ఒకే పెళ్లి పందిరిలో ఒకే ముహూర్తానికి వివాహాలు జరిపించారు.

అంచెలంచెలుగా..

సీపీఐలో క్రియాశీల కార్యకర్తగా చేరిన సురవరం సుధాకర్‌రెడ్డి.. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. 1971లో జాతీయ సమితి సభ్యునిగా పనిచేశారు. మూడేళ్లపాటు ఢిల్లీలో ఉన్నారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి ఇక్కడి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1985, 1989, 1994 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు. తొలిసారి 1998 లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించారు. అదే ఏడాది సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆతర్వాత 2004లో ఎంపీగా ఎన్నికయ్యాక.. కార్మికశాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేయటంతోపాటు అనేక పార్లమెంటరీ కమిటీలకు ఛైర్మన్‌గా పనిచేశారు. 2012 మార్చి 31న జరిగిన 21వ పార్టీ కాంగ్రెస్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2012 నుంచి 2019 వరకు ఆ పదవిలో మూడు పర్యాయాలు సేవలందించారు. చంద్ర రాజేశ్వరరావు తర్వాత సీపీఐ పగ్గాలు చేపట్టిన తెలుగు నేత సురవరం సుధాకర్‌రెడ్డి కావడం విశేషం.

ఎంపీగా..

సురవరం సుధాకర్ రెడ్డి 1998లో.. 12వ లోక్‌సభకు నల్లగొండ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 2004లో రెండోసారి అదే నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఎంపీగా.. నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య శాశ్వత పరిష్కారానికి విశేషంగా కృషి చేశారు. జిల్లాలో సాగునీటి పథకాల పూర్తికి, కేంద్రం నుంచి అవసరమైన అనుమతి సాధించేందుకు కృషి చేశారు. జిల్లాలో కరువు, సాగునీటి ఎద్దడిపై ఆయన పోరాటం చేశారు. ఒకప్పుడు విశాలాంధ్ర ఉద్యమానికి ఊనికగా నిలిచిన భారత కమ్యూనిస్టు పార్టీ.. మలిదశ తెలంగాణ పోరాటంలో తన పంథా మార్చుకోడానికి ప్రధాన కారణం సురవరం సుధాకర్‌రెడ్డి వ్యూహాత్మక నిర్ణయమని ఆ పార్టీ నేతలు చెబుతారు.



చక్రాల కుర్చీలో..

వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నా, అనారోగ్యంతో ఉన్నా... సుధాకర్ రెడ్డి పార్టీ కార్యక్రమాలకు హాజరుకాకుండా ఎప్పుడూ ఉండలేదు. ప్రతి కార్యక్రమంలో, పోరాటంలో చురుగ్గా పాల్గొనేవారు. చివరిసారిగా గత ఏడాది డిసెంబరు నెలలో నల్లగొండలో జరిగిన సీపీఐ బహిరంగసభకు హాజరయ్యారు. జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకునే సందర్భం కాబట్టే, అనారోగ్యంతో ఉన్నా ఆ సభకు వచ్చినట్లు పేర్కొన్నారు. కాగా.. తెలంగాణ నాలుగో రాష్ట్ర మహాసభ దిగ్విజయమైందన్న సంతోషంతో పార్టీ నేతలు, సభ్యులంతా సభాస్థలి నుంచి ఇంటికి తిరుగు ముఖం పట్టిన సమయంలో సురవరం మరణవార్త విని విషాదంలో మునిగిపోయారు. తామంతా అభిమానించే నేత ఇక లేరని కన్నీటి పర్యంతరమయ్యారు. నారాయణ, కూనంనేని ఆస్పత్రికి చేరుకుని ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

గొప్ప నేతను కోల్పోయాం

- దేశ రాజకీయాల్లో సురవరం ముద్ర: సీఎం రేవంత్

సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడిని కోల్పోయామన్నారు. సురవరం నల్లగొండ నుంచి జాతీయ స్థాయి నేతగా ఎదిగారని.. వామపక్ష ఉద్యమాలు, ఎన్నో ప్రజా పోరాటాల్లో పాలు పంచుకున్నారని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలంగాణ మట్టి బిడ్డ సురవరం పీడిత వర్గాల అభ్యున్నతి కోసం తన జీవిత కాలం పనిచేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సురవరంతో తనకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సురవరం మృతి పట్ల మంత్రులు, వివిధ పార్టీల నేతలు సంతాపం తెలిపారు. దేశ రాజకీయాల్లో సురవరం చెరగని ముద్ర వేశారంటూ మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. సురవరం మరణం తెలంగాణ రాజకీయాలకు తీరని లోటని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. సురవరం ప్రజా సేవ, ఉద్యమ పంథా చిరస్మరణీయమని మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్సీ కవిత వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

నా హీరో మీరే

శుక్రవారం చిరంజీవి 70వ జన్మదినోత్సవ వేడుకలు సింగపూర్‌లో కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో ఘనంగా జరిగాయి. చిరంజీవితో రామ్‌చరణ్ కేక్ కట్ చేయించారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ భావోద్వేగభరితమైన పోస్ట్‌ను అభిమానులతో పంచుకున్నారు. 'నాన్నా... నా హీరో, మార్గదర్శి, స్ఫూర్తిప్రదాత మీరే. నా ప్రతి విజయం వెనుక మీరు ఉన్నారు. నేను పాటించే విలువలకు మూలం మీరు. 70 ఏళ్ల వయసులోనూ మీరు మాకు ప్రేరణగా నిలుస్తున్నారు. మీరు కలకాలం ఇలానే ఆరోగ్యం, ఆనందంతో ఉండాలని ఆ దేవుణ్ణి కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు.



అన్నగా నీ విజయాలను ఆస్వాదిస్తున్నా

గురువారం చిరంజీవికి పవన్ కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలపగా 'నీకు అన్నను అయినందుకు ఆనందంగా ఉందని' చిరంజీవి స్పందించారు. కల్యాణ్... నువ్వు ప్రేమతో పంపిన పుట్టిన రోజు శుభాకాంక్షలు అందాయి. అందులోని ప్రతి మాటా, అక్షరం నా హృదయాన్ని తాకాయి అని లేఖలో పేర్కొన్నారు. 'నన్ను చూసి నువ్వెంత గర్వపడుతున్నావో, నీ విజయాలను, పోరాటాలను చూసి నేనూ అంతే సంతోషిస్తున్నాను. నమ్మినవాళ్లకు ఏదో చేయాలనే తపనే నీలో నూతనోత్సాహం నింపుతోంది. ఈ రోజు నీ వెనుక కోట్లాది జనసైనికులు ఉన్నారు. ఓ రాజువై ఆ సైన్యాన్ని నడిపించు. వాళ్ల ఆశలు, కలలకు కొత్త శక్తినివ్వు. ఓ అన్నయ్యగా నా ఆశీర్వచనాలు ఎప్పుడూ నీతో ఉంటాయి. నీ ప్రతి అడుగులో విజయం నిన్ను వరించాలని ఆ దేవుణ్ణి కోరుకుంటున్నాను' అని చెప్పారు.



శంకర వరప్రసాద్... పండగకి వస్తున్నారు

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో 'మెగా157' అనే వర్కింగ్ టైటిల్‌తో సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. చిరంజీవి సరసన కథానాయికగా నయనతార నటిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. చిత్రీకరణ తుది దశలో ఉంది. వచ్చే సంక్రాంతికి థియేటర్లలోకి రానుంది. శుక్రవారం చిరంజీవి పుట్టిన రోజు. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించారు. 'మన శంకర వరప్రసాద్ గారు' అనే టైటిల్‌ను ఖాయం చేశారు. 'పండగకి వస్తున్నారు' అనేది దీని ట్యాగ్‌లైన్. టైటిల్ గ్లింప్స్‌లో... బాస్ అంటూ వచ్చే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో చిరంజీవి కొత్త మేకోవర్‌లో కనిపించారు. సూట్‌లో స్టయిల్‌గా సిగరెట్ తాగుతూ.. చేతిలో తుపాకీతో ఓ సీన్‌లో కనిపించారు. మరో సీన్‌లో గుర్రాన్ని నడిపిస్తూ సిగరెట్ కాలుస్తూ వింటేజ్ లుక్‌లో మైమరపించారు. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లో 'రౌడీ అల్లుడు' ట్యూన్‌తో చిరంజీవి ఎంట్రీ అదిరిపోయింది. చివర్లో మన శంకరప్రసాద్ గారు..పండగకి వస్తున్నారు అంటూ హీరో వెంకటేశ్ వాయిస్ ఓవర్‌తో టైటిల్‌ని అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'చిరంజీవిని మీరు ఎలా చూడాలనుకుంటున్నారో సంక్రాంతికి రెండింతలు చూస్తారు. పాటలు, వినోదం అన్నీ అద్భుతంగా కుదిరాయి' అని అన్నారు. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ 'చిరంజీవి సినిమాలను నేను, అనిల్ ఎలా చూస్తామో, ఎలా చూడాలనుకుంటున్నామో అలానే ఇందులో ఆయనను చూపించబోతున్నాం' అని అన్నారు. మరో నిర్మాత సుస్మిత కొణిదెల మాట్లాడుతూ 'నాన్నగారి పుట్టిన రోజున ఆయనతో లేకుండా మీ అందరి ముందు ఇలా ఉండటం బహుశా ఇదే మొదటిసారి. ఇవి నాకు మధుర క్షణాలు. మీ అందరి సపోర్టు కావాలి' అని అన్నారు.





వీరయ్యతో మరోసారి

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' ఎంతటి ఘన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇదే కాంబినేషన్ మరోసారి తెరపై ప్రేక్షకులకు వినోదాన్ని పంచేందుకు సిద్ధమవుతోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని భారీగా నిర్మించనుంది. ఈ ప్రాజెక్టుకు 'మెగా 158' అని వర్కింగ్ టైటిల్ పెట్టారు. ఈ మేరకు అధికారికంగా ప్రకటిస్తూ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని విడుదల చేశారు. పోస్టర్‌లో నెత్తురు-గొడ్డలిని చూస్తుంటే యాక్షన్ మూవీలా అనిపిస్తోంది. ఈ ఏడాది చివర్లో షూటింగ్ మొదలు కానుంది. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను తర్వాత వెల్లడించనున్నట్లు నిర్మాణ సంస్థ పేర్కొంది.

వాళ్లకు నచ్చకుంటే ఓటమిగా భావిస్తా





నమిత్ మల్హోత్రా

సాయిపల్లవి, రణబీర్ కపూర్ సీతారాములుగా నటిస్తున్న చిత్రం 'రామాయణ'. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని రూ. 4 వేల కోట్లతో నిర్మిస్తున్నట్లు ప్రకటించి అందరూ నోరెళ్లబెట్టిలా చేశారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఈ చిత్రం గురించి తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'రామాయణ'ను కేవలం భారతీయ ప్రేక్షకుల కోసమే తీయట్లేదు. ప్రపంచ సినీ ప్రేక్షకులందరూ చూసేలా తీస్తున్న చిత్రమిది. ఈ ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టినప్పుడే గ్లోబల్ ఫిల్మ్‌గా తీర్చిదిద్దేలా.. మన ఇతిహాసపు గొప్పతనాన్ని పాశ్చాత్యులకూ తెలియజెప్పేలా ఉండాలని మా తపన. ఇది విదేశీయులకు నచ్చకుంటే, అది నా ఓటమిగా, అవమానంగా భావిస్తాను. ప్రాంతీయ హద్దులను, భాషా సరిహద్దులను చెరిపేసే చిత్రం తీయాలని మా ప్రయత్నం. అలాగే నాస్తికులకూ చేరువయ్యేలా ఈ చిత్రం ఉంటుంది. 'గ్లాడియేటర్', 'అవతార్' చిత్రాల స్థాయిలో 'రామాయణ' ఉండనుంది' అని అన్నారు. బాలీవుడ్ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో 'రామాయణ' చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది.. తొలిభాగం వచ్చే ఏడాది దీపావళికి, రెండోది 2027 దీపావళికి రానుంది. అయితే రామాయణం స్ఫూర్తితో ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కిన 'ఆదిపురుష్' ఘోర వైఫల్యంతో.. మరోసారి ఇతిహాసాల్ని తెరపై చూడడానికి ప్రేక్షకులు అనాసక్తి చూపిస్తున్న నేపథ్యంలో నమిత్ మల్హోత్రా తన ప్రాజెక్ట్‌పై చూపిస్తున్న నమ్మకం.. ఏకంగా ప్రపంచ స్థాయి సినిమాలను సవాలు చేస్తున్న తీరు ఈ సినిమాపై అంచనాలను క్రమంగా పెంచుతోంది.

రూ.వంద కోట్లతో మైక్రో డ్రామాలు



'కన్నప్ప' చిత్రం తర్వాత మంచు విష్ణు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. మూడు నుంచి ఏడు నిముషాల వ్యవధితో సాగే మైక్రో డ్రామాలు అందించాలని ఆయన నిర్ణయించుకున్నారు. సాధారణ రీల్స్‌లా కాకుండా మొబైల్ యూజర్స్‌కు సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా ఈ మైక్రో డ్రామాలను ఆయన రూపొందించనున్నారు. వీటిపై దాదాపు వంద కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టడానికి ఆయన నిర్ణయించుకున్నారు. మైక్రో డ్రామాలు కాకుండా మరి కొన్ని భారీ చిత్రాలు నిర్మించడానికి ఆయన సన్నాహాలు ప్రారంభించారు.

విశాల్ 35లో అంజలి



'మద గజ రాజా' చిత్రంతో ఘన విజయాన్ని అందుకున్నారు విశాల్. ఇప్పుడు ఆయన కథానాయకుడిగా సూపర్ గుడ్ ఫిల్మ్స్ పతాకంపై ఆర్‌బీ చౌదరి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'విశాల్ 35' వర్కింగ్ టైటిల్. దుషార విజయన్ హీరోయిన్. రవి అరసు దర్శకుడు. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభమైంది. తాజాగా యూనిట్ ఓ అప్డేట్‌ను పంచుకుంది. ఈ చిత్రంలో కథానాయిక అంజలి కీలక పాత్ర పోషించబోతున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం తెలిపింది. 'కొన్నాళ్లుగా నటనా ప్రాధాన్య పాత్రలతో మెప్పించే ప్రయత్నం చేస్తున్నారు అంజలి. 'విశాల్ 35'లోనూ ఆమె పాత్ర ప్రధానాకర్షణగా నిలుస్తుంది, అంజలి పాత్రలోని భిన్నఛాయలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతాయి' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్. సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ఎం. నాథన్

రాగిణిగా తమన్నా!



ఇటు సినిమాలు, ఒక పక్క ఐటమ్ సాంగ్స్, మరో వైపు వెబ్ సిరీస్.. ఖాళీగా కూర్చోకుండా ఏది దొరికితే అది చేసేస్తున్న హీరోయిన్ తమన్నా ఒక్కరేనేమో! ఆమెతో పాటు ఇండస్ట్రీలోకి వచ్చిన హీరోయిన్లలో కొందరు ఇప్పటికే ఇంటికి వెళ్లిపోయినా తన గ్లామర్‌ను కాపాడుకుంటూ ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు తమన్నా. 'స్త్రీ 2' సినిమాలో ఆమె చేసిన 'ఆజ్ కీ రాత్' పాట జనాన్ని ఊపేసింది. దీని వల్ల 'వాన్' సినిమాలో ఛాన్స్ వచ్చింది. అలాగే 'రాగిణి ఎంఎంఎస్' మూడో ఫ్రాంఛైజీలో తమన్నా నటించనున్నారన్నది తాజా సమాచారం. హారర్ కథాంశంతో 'రాగిణి ఎంఎంఎస్' చిత్రం తొలిసారిగా 2011లో వచ్చింది. 2014లో సెకండ్ పార్ట్ ప్రేక్షకులను పలకరించింది. అందులో సన్నీ లియోన్ నటించింది. ఆ సినిమాకు మూడో భాగం తీయాలనే ఆలోచన ఇప్పుడు ఏక్తాకపూర్‌కు రావడంతో తమన్నాను సంప్రదించారు. ఈ రొమాంటిక్ హారర్ థ్రిల్లర్‌లో నటించడానికి తమన్నా కూడా ఆసక్తి చూపించడంతో ఏక్తా ముందడుగు వేశారు. ఈ ఏడాది చివర్లో 'రాగిణి ఎంఎంఎస్ 3' చిత్రం సెట్స్‌పైకి రానుంది. దర్శకుడు, తారాగణం వివరాలు త్వరలో వెల్లడిస్తారు.

గోవిందా దంపతుల విడాకులు... వివరణ



బాలీవుడ్ హీరో గోవిందా, సునీతా అహూజా విడాకులు తీసుకోబోతున్నారంటూ కొన్నాళ్లుగా మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే పలు సందర్భాల్లో వారిద్దరూ మీడియా కథనాలను ఖండించారు. మరోమారు వారి విడాకుల వార్త బాలీవుడ్ మీడియాలో పతాక శీర్షికలకెక్కింది. కొన్నాళ్లుగా గోవిందా, సునీత విడివిడిగా జీవిస్తున్నారనీ, వారిమధ్య తలెత్తిన మనఃస్పర్థల కారణంగా ఇప్పుడు విడాకుల కోసం సునీత బాంద్రా కోర్టును ఆశ్రయించారంటూ బాలీవుడ్ మీడియాలో మరోసారి పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తమ విడాకుల వార్తలను సునీతా అహూజా ఖండించారు. ఆ ప్రచారంలో నిజం లేదన్నారు. మా మధ్య ఎలాంటి గొడవలు లేవు, అలాంటిదేమైనా ఉంటే మేమే స్వయంగా చెబుతాం అని ఆమె స్పష్టం చేశారు.

ఉత్కంఠభరిత 'త్రిశంకిణి'



రంజిత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహిస్తోన్న సినిమా 'త్రిశంకిణి'. ఎస్‌బీజే ప్రొడక్షన్స్ బేనర్‌పై ఎస్.బిక్కునాథ్ నాయక్ నిర్మిస్తున్నారు. పలువురు నూతన నటీనటులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శుక్రవారం ఈ సినిమా టైటిల్ లాంచ్ కార్యక్రమాన్ని మేకర్స్ నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న హాస్య నటుడు బాబు మోహన్ మాట్లాడుతూ 'మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా 'త్రిశంకిణి' టైటిల్‌ని ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. నిర్మాత బిక్కునాథ్ నాయక్ మాట్లాడుతూ సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో ఓ సరికొత్త మూవీ చేశాం. మీరంతా సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

బెంగళూరు అవుట్



అక్కడి మ్యాచ్‌లు నవీ ముంబైలో..

- షెడ్యూల్‌లో మార్పులు
- మహిళల వన్డే వరల్డ్‌కప్

న్యూఢిల్లీ: ఊహించినట్టుగానే మహిళల వన్డే వరల్డ్ కప్‌లో భాగంగా బెంగళూరులో జరగాల్సిన ఐదు మ్యాచ్‌లను తరలించారు. చిన్నస్వామి స్టేడియంలో వీటి నిర్వహణకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవడంలో అక్కడి క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) విఫలమైంది. దీంతో ఈ మ్యాచ్‌లన్నింటినీ నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియానికి తరలిస్తున్నట్టుగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శుక్రవారం ప్రకటించింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో చాంపియన్‌గా నిలిచిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ ర్యాలీ కారణంగా స్టేడియం బయట తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 11 మంది మృతి చెందడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించి చిన్నస్వామిలో ప్రస్తుతానికి మ్యాచ్‌లను నిషేధించింది. ఇక డీవై పాటిల్ స్టేడియంలో మూడు లీగ్ మ్యాచ్‌లు ఓ సెమీస్, ఫైనల్ జరగాల్సి ఉంది. కానీ టైటిల్ పోరు మాత్రం పాక్ జట్టు విజయాలపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ దాయాది జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తే ఆ మ్యాచ్ కొలంబోలో నిర్వహిస్తారు. ఓవరాల్‌గా నవీ ముంబై, విశాఖపట్నం, గువాహటి, ఇండోర్, కొలంబోలో మహిళల వన్డే వరల్డ్‌కప్ జరుగుతుంది. మరోవైపు చిన్నస్వామి స్టేడియం వ్యవహారాన్ని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం ఓ కొలిక్కి తేలేకపోతే వచ్చే ఏడాది ఐపీఎల్ మ్యాచ్‌లకు కూడా దూరం కావాల్సి ఉంటుంది.

మరికొన్ని మార్పులు..: ముందుగా ప్రకటించిన షెడ్యూల్‌లో ఐసీసీ కొన్ని వేదికలను మార్చింది. దీనిలో భాగంగా సెప్టెంబరు 30న ఆతిథ్య జట్లు భారత్-శ్రీలంక మధ్య జరగాల్సిన ఆరంభ మ్యాచ్‌ను బెంగళూరు నుంచి గువాహటికి తరలించారు. అక్టోబరు 3న ఇంగ్లండ్-దక్షిణాఫ్రికా మ్యాచ్ కూడా గువాహటిలోనే జరుగుతుంది. అంతేకాకుండా 10న కివీస్-బంగ్లాదేశ్ మ్యాచ్‌ను వైజాగ్ నుంచి గువాహటికి మార్చారు. ఇక అదే నెల 20న జరిగే శ్రీలంక-బంగ్లాదేశ్ మ్యాచ్, 23న జరిగే భారత్-కివీస్ మ్యాచ్‌లను నవీ ముంబైకి మార్చారు. మొత్తంగా విశాఖలో ఐదు మ్యాచ్‌లు జరుగనుండగా.. భారత జట్టు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాలతో ఇక్కడే ఆడనుంది.

సెలెక్టర్ల కోసం దరఖాస్తులు

భారత క్రికెట్ జట్ల సెలెక్టర్ల కోసం వచ్చే నెల 10 లోగా బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందులో పురుషుల క్రికెట్ కోసం రెండు, మహిళల క్రికెట్ కోసం నలుగురు సెలెక్టర్లను భర్తీ చేయాల్సి ఉంది. చీఫ్ సెలెక్టర్ అగార్కర్ (వెస్ట్ జోన్), అజయ్ రాత్రా (నార్త్)ల పదవీ కాలాన్ని బోర్డు మరో ఏడాది పొడిగించింది. దీంతో సౌత్, సెంట్రల్ జోన్ల సెలెక్టర్లను భర్తీ చేయాల్సి ఉంది. అయితే సౌత్ నుంచి మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజాకు దాదాపు చోటు ఖాయమైనట్టు సమాచారం. మహిళల సెలెక్షన్ కమిటీలో శ్యామా డే షా మాత్రం కొనసాగనుండగా మిగతా నలుగురిని నియమించాల్సి ఉంది. మరోవైపు పురుషుల క్రికెట్ సెలెక్టర్‌గా పదవీకాలం ముగిసిన ఎస్.శరత్.. రెండోసారి జూనియర్ క్రికెట్ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించడం దాదాపు ఖాయమైంది.

భారత్ 'ఎ' 299 ఆలౌట్


రాఘవీ బిస్త్ (93)

బ్రిస్బేన్: రాఘవీ బిస్త్ (93), జోషిత (51) అర్ధ శతకాలతో పోరాడడంతో ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో అనధికార టెస్ట్‌లో భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. ఓవర్‌నైట్ 93/5 స్కోరుతో శుక్రవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 299 పరుగులకు ఆలౌటైంది. జార్జియా, బ్రౌన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆస్ట్రేలియా 'ఎ' రెండో రోజు ఆఖరికి 158/5 స్కోరుతో ఇక్కట్లలో పడింది. తహిలా విల్సన్ (49) రాణించింది. మీడియం పేసర్ సలీమా, స్పిన్నర్ రాధా యాదవ్ చెరో రెండు వికెట్లు కైవసం చేసుకున్నారు.

గుకేష్, ప్రజ్ఞానందకు డ్రా

సెయింట్ లూయిస్ (యూ ఎస్): సింక్వెఫీల్డ్ కప్ నాలుగో రౌండ్‌ను గుకేష్, ప్రజ్ఞానంద డ్రా గా ముగించారు. వాషిర్ (ఫ్రాన్స్)తో శుక్రవారం జరిగిన గేమ్‌లో 56 ఎత్తుల తర్వాత గుకేష్ పాయింట్ పంచుకున్నాడు. ఇక సెవియన్ (అమెరికా) 29 ఎత్తులలో ప్రజ్ఞానందను నిలువరించాడు.

డ్యురాండ్ కప్ విజేతకు రూ.1.21 కోట్లు

న్యూఢిల్లీ: డ్యురాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ విజేతకు ఇకపై రూ. కోటీ 21 లక్షలు, రన్నరప్‌కు రూ.60 లక్షలు లభించనుంది.గతేడాది 1.2 కోట్లుగా ఉన్న మొత్తం ప్రైజ్ మనీ ఈసారి రూ.3 కోట్లకు పెరిగింది. శనివారం జరిగే ఈ టోర్నీ ఫైనల్లో నార్త్‌ఈస్ట్ యునైటెడ్-డైమండ్ హార్బర్ జట్లు తలపడనున్నాయి.

క్రికెట్‌కు గౌహర్ వీడ్కోలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): క్రికెట్‌కు హైదరాబాదీ లెఫ్టామ్ స్పిన్నర్ గౌహర్ సుల్తానా వీడ్కోలు పలికింది. క్రికెటర్‌గా అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించింది. 37 ఏళ్ల సుల్తానా 2008లో భారత జట్టు తరఫున అరంగేట్రం చేసింది. 2009, 2013 వన్డే వరల్డ్‌కప్‌ల్లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన ఆమె, కెరీర్‌లో 50 వన్డేలు, 37 టీ20లు ఆడి మొత్తం 95 వికెట్లు సాధించింది. 2014 తర్వాత జాతీయ జట్టులో చోటు కోల్పోయిన సుల్తానా తిరిగి 2024 మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో యూపీ వారియర్స్ తరఫున మెరిసింది. ఈ ఏడాది కూడా వారియర్స్‌కు ప్రాతినిథ్యం వహించిన ఆమె అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు దేశవాళీ పోటీలకు కూడా వీడ్కోలు పలికింది. కెరీర్ ఆసాంతం తనకు మద్దతుగా నిలిచిన కుటుంబ సభ్యులు, సహచర క్రికెటర్లు, కోచింగ్ సిబ్బంది, బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపింది. బీసీసీఐ లెవల్-2 శిక్షణ పూర్తి చేసిన సుల్తానా భవిష్యత్‌లో కోచ్‌గా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొంది.

వలరివన్ స్వర్ణ కాంతులు


మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్‌లో అగ్రస్థానం

ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్స్

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): భారత ఏస్ షూటర్ ఎలవెనిల్ వలరివన్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం కొల్లగొట్టింది. శుక్రవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో 253.6 పాయింట్లతో వలరివన్ టైటిల్ దక్కించుకుంది. చైనా, కొరియా రజత కాంస్యాలు అందుకున్నాయి. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అభయ్ సింగ్ సెఖాన్/గనేమత్ సెఖాన్ ద్వయం కాంస్యం గెలుపొందింది. ఇక..మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో వలరివన్, మెహులీ, అనన్యా నాయుడు త్రయం కాంస్యం సాధించింది. జూనియర్ విభాగంలో భారత షూటర్ల ఆధిపత్యం కొనసాగింది. జూనియర్ స్కీట్ మిక్స్‌డ్ టీమ్ కేటగిరీలో హర్‌మెహర్/యశస్వీ రాథోడ్ జోడీ పసిడి చేజిక్కించుకుంది. మహిళల జూనియర్ 10 మీ. ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో శాంభవీ శ్రవణ్, హృద్యశ్రీ, ఇషా అనిల్ త్రయం స్వర్ణం కైవసం చేసుకుంది.

దక్షిణాఫ్రికాదే సిరీస్

మెకే (ఆస్ట్రేలియా): దక్షిణాఫ్రికా జట్టు ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన రెండో మ్యాచ్‌లో పేసర్ ఎన్‌గిడి ఐదు వికెట్లతో చెలరేగడంతో సఫారీలు 84 పరుగుల తేడాతో ఆసీస్‌ను చిత్తుగా ఓడించారు. ముందుగా దక్షిణాఫ్రికా 49.1 ఓవర్లలో 277 పరుగులకు ఆలౌటైంది. మ్యాథ్యూ బ్రీట్‌స్కీ (88), స్టబ్స్ (74) అర్ధసెంచరీలతో రాణించారు. ఛేదనలో ఆసీస్ 37.4 ఓవర్లలో 193 రన్స్ కుప్పకూలింది. ఇన్‌గ్లిస్ (87) రాణించాడు.

తుదిపోరుకు తుంగభద్ర

ఆంధ్ర ప్రీమియర్ లీగ్

విశాఖపట్నం-స్పోర్ట్సు (ఆంధ్రజ్యోతి): రోహిత్ (87), డీబీ ప్రశాంత్ (64 నాటౌట్) అర్ధ శతకాలతో అదరగొట్టడంతో తుంగభద్ర వారియర్స్ జట్టు ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఫైనల్‌కు దూసుకువెళ్లింది. శుక్రవారం ఇక్కడ జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో తుంగభద్ర ఐదు వికెట్ల తేడాతో భీమవరం బుల్స్‌పై గెలుపొందింది. తొలుత భీమవరం నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 183 పరుగులు చేసింది. సాయి శ్రవణ్ (71 నాటౌట్)తో రాణించాడు. వారియర్స్ బౌలర్ దీపక్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం వారియర్స్ 19 ఓవర్లలో ఐదు వికెట్లకు 188 పరుగులు చేసి ఫైనల్లోకి ప్రవేశించింది. బుల్స్ బౌలర్లలో హరిశంకరరెడ్డి, సత్యనారాయణరాజు చెరో రెండు వికెట్లు తీశారు. శనివారం జరిగే ఫైనల్లో అమరావతి రాయల్స్‌తో తుంగభద్ర వారియర్స్ తలపడనుంది.

కాజల్‌కు స్వర్ణం



సమొకోవ్ (బల్గేరియా): భారత యువ రెజ్లర్ కాజల్ అండర్-20 వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణంతో మెరిసింది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన 72 కి. ఫైనల్లో కాజల్ 8-6తో యుకి లియు (చైనా)ను ఓడించి విజేతగా నిలిచింది. శ్రుతి (50కి.), సారిక (53కి.) కాంస్య పతకాలు గెలుపొందారు. కాగా..మహిళల విభాగంలో మొత్తం ఏడు పతకాలతో భారత జట్టు రన్నరప్ ట్రోఫీని సాధించింది.

భారత్ రెండో విజయం

శాఫ్ మహిళల ఫుట్‌బాల్

థింపూ (భూటాన్): శాఫ్ అండర్-17 మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత్ వరుసగా రెండో విజయం దక్కించుకుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో మన మహిళలు 2-0తో బంగ్లాదేశ్‌ని ఓడించారు. పెర్ల్ ఫెర్నాండెస్ (14వ నిమిషం), బొనిఫిలియా షలయ్ (76) చెరో గోల్ చేశారు.

ప్రొ.కబడ్డీ.. మరింత రంజుగా


తెలుగు టైటాన్స్ జట్టు

- టోర్నీలో భారీ మార్పులు
- లీగ్ దశలో గోల్డెన్ రైడ్

ముంబై: మరో వారం రోజుల్లో ప్రొ.కబడ్డీ లీగ్ (పీకేఎల్) అభిమానులను అలరించనుంది. అయితే సీజన్-12లో అనేక మార్పులు చోటుచేసుకోనున్నాయి. పోటీలను ఇంకా రసవత్తరంగా మార్చి ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించేందుకు లీగ్ దశను మరింత విస్తరించారు. ప్లేఆఫ్స్‌లోనూ మార్పులు చేశారు. ఈ సీజన్‌ను విశాఖపట్నం, జైపూర్, చెన్నై, ఢిల్లీలో నిర్వహించనున్నారు. ఈనెల 29న ప్రారంభమయ్యే పీకేఎల్ లీగ్ దశలో మొత్తం 108 మ్యాచ్‌లు జరుగుతాయి. ఒక్కో జట్టు 18 మ్యాచ్‌లు ఆడుతుంది. టైబ్రేకర్ విధానాన్ని మరింత విస్తృతం చేయడంతోపాటు లీగ్ దశలో 'గోల్డెన్ రైడ్' అమలు చేయనున్నారు. గతంలో గోల్డెన్ రైడ్ ప్లేఆఫ్స్‌లో మాత్రమే ఉండేది. ఇకపై లీగ్ దశలో మ్యాచ్ 'టై' అయితే ఐదు రైడ్లతో కూడిన షూటౌట్ నిర్వహిస్తారు. ఇందులో ఫలితం తేలకపోతే గోల్డెన్ రైడ్ ఉంటుంది. అప్పటికీ ఫలితం రాకపోతే 'టాస్' ద్వారా విజేతను నిర్ణయిస్తారు. అలాగే పాయింట్ల విధానాన్ని మరింత సరళతరం చేశారు. ఇకపై విజయానికి రెండు పాయింట్లు కేటాయిస్తారు. ఓటమికి పాయింట్లేమీ ఉండవు. ఇంకా..ప్లేఆఫ్స్‌ను ప్రక్షాళన చేయడంతోపాటు 'ప్లేఇన్' విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. ఫలితంగా..లీగ్ దశలో తొలి ఎనిమిది స్థానాలలో నిలిచిన జట్లకు ప్లేఆఫ్స్‌కు క్వాలిఫై అయ్యే అవకాశముంటుంది. కొత్త విధానంలో..లీగ్ దశలో ఐదు నుంచి ఎనిమిది స్థానాలలో నిలిచిన జట్లు 'ప్లేఇన్' మ్యాచ్‌ల్లో తలపడతాయి. ప్లే ఇన్ మ్యాచ్‌ల విజేతలు ఎలిమినేటర్స్‌లో అడుగు పెడతాయి. మూడు, నాలుగు స్థానాలు సాధించిన జట్లు 'మినీ క్వాలిఫయర్'లో ఢీకొంటాయి. మినీ క్వాలిఫయర్‌లో గెలుపొందిన జట్టు ముందడుగు వేస్తుంది. ఇక ఓడిన జట్టుకు ప్లేఆఫ్స్ ద్వారా మరో అవకాశం లభిస్తుంది. లీగ్ దశలో తొలి రెండు స్థానాలలో నిలిచిన జట్లు క్వాలిఫయర్-1లో తలపడతాయి. క్వాలిఫయర్-1 విజేత నేరుగా ఫైనల్‌కు చేరుతుంది. క్వాలిఫయర్-1లో ఓడిన జట్టుకు క్వాలిఫయర్-2 ద్వారా మరో చాన్సు లభిస్తుంది. ప్లేఆఫ్స్‌లో మూడు ఎలిమినేటర్లు, రెండు క్వాలిఫయర్స్ ఉంటాయి.

విశాఖలో తొలి అంచె..

ఈనెల 29న విశాఖపట్నం అంచెతో లీగ్ మొదలవుతుంది. రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో సెప్టెంబరు 11 వరకు వైజాగ్ దశ పోటీలు జరుగుతాయి. తొలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్-తమిళ్ తలైవాస్ తలపడతాయి. విజయ్ మాలిక్ కెప్టెన్సీలో తెలుగు టైటాన్స్ బరిలో దిగుతోంది. శుభమ్ షిండే వైస్-కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

బిజినెస్

అపోలో హాస్పిటల్స్‌లో 1.3% వాటా విక్రయించిన సునీతా రెడ్డి

అపోలో హాస్పిటల్స్ ప్రమోటర్, ఎండీ సునీతా రెడ్డి కంపెనీలో 1.3% వాటాను రూ.1,489 కోట్లకు విక్రయించారు. బహిరంగ మార్కెట్లో బల్క్ డీల్స్ ద్వారా ఈ అమ్మకం జరిగింది. మొత్తం 18,97,239 షేర్లను ఒక్కోటీ రూ.7,850 చొప్పున విక్రయించడం జరిగిందని కంపెనీ వెల్లడించింది. ఈ నిధులతో ప్రమోటర్ గ్రూప్ రుణభారాన్ని తగ్గించుకోనున్నట్లు తెలిపింది. ఈ డీల్ అనంతరం అపోలో హాస్పిటల్స్‌లో ప్రమోటర్ గ్రూప్ వాటా 29.3% నుంచి 28 శాతానికి తగ్గింది. తనఖాలో ఉన్న వాటా 13.1 శాతం నుంచి 2 శాతానికి తగ్గనుందని సంస్థ పేర్కొంది. బీఎస్ఈలో అపోలో హాస్పిటల్స్ షేరు శుక్రవారం 0.17 శాతం పెరిగి రూ.7,938.40 వద్ద ముగిసింది.

ఎడెల్‌వీజ్ అసెట్ మేనేజ్‌మెంట్‌లో వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్‌కు వాటా

డీల్ విలువ రూ.450 కోట్లు

న్యూఢిల్లీ: ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్‌లో 15% వాటా ను అంతర్జాతీయ పెట్టుబడి సంస్థ వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్ రూ.450 కోట్లకు కొనుగోలు చేయనుందని ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఎఫ్ఎస్ఎల్) శుక్రవారం వెల్లడించింది. ఈ లావాదేవీలో భాగంగా కంపెనీ మొత్తం విలువను రూ.3,000 కోట్లుగా లెక్కగట్టారు. ఈఎఫ్ఎస్ఎల్ కీలక వ్యాపారాల్లో ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్ ఒకటి. ఈ జూన్ 30 నాటికి ఈ కంపెనీ రూ.1.52 లక్షల కోట్ల విలువైన ఫండ్ ఆస్తులను నిర్వహిస్తోంది. గత ఐదేళ్లలో ఆస్తుల విలువ ఏటా 44 శాతం చొప్పున పెరుగుతూ వచ్చింది.

ద్వితీయార్ధంలో కొలువుల జాతర



ఉద్యోగాలకు ఏఐ ముప్పు కాదు.. నౌకరీ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలో ఉపాధి మార్కెట్ వర్తమాన ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో జోరందుకోనుంది. పలు యాజమాన్యాలు తమ సంస్థల్లో కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలియచేశాయి. దేశంలో ఉద్యోగాల మార్కెట్ ధోరణిపై నౌకరీ నిర్వహించిన ద్వైవార్షిక సర్వేలో ఈ విషయం వెల్లడయింది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 72% మంది యాజమాన్య ప్రతినిధులు కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా సిబ్బంది విస్తరణ చేపట్టనున్నట్టు తెలిపారు. ద్వితీయార్ధంలో కొత్తగా కొంత మందిని ఉద్యోగాల్లో చేర్చుకునే యోచన ఉన్నట్టు 94% మంది తెలియచేశారు. దేశవ్యాప్తంగా విభిన్న రంగాలకు చెందిన 1,300 మంది యాజమాన్య ప్రతినిధులు అందించిన సమాచారం ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా పలువురు ఉద్యోగాలు కోల్పోతారన్న భయాలు విస్తృతంగా వ్యాపించిన వాతావరణంలో కూడా ఉద్యోగ మార్కెట్‌పై ఏఐ ప్రభావం అంతగా ఉంటుందని తాము భావించడంలేదని 87% మంది అన్నారు. పైగా ఉపాధి మార్కెట్‌కు ఏఐ చోదకశక్తిగా ఉంటుందని 13% మంది అభిప్రాయపడ్డారు. ఏఐ వల్ల ప్రయోజనం పొందే రంగాల్లో ఐటీ (42%), అనలిటిక్స్ (17%), బిజినెస్ డెవలప్‌మెంట్ (11%) ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తం అయింది. ప్రధానంగా ఏఐ ఆధారిత అవకాశాలు పెరుగుతాయన్నారు. నికరంగా అదనపు సిబ్బందిని నియమించుకోవడం ద్వారా సిబ్బంది విస్తరణ చేపట్టనున్నట్టు 72% మంది చెప్పడం ప్రోత్సాహకరమైన అంశమని నౌకరీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పవన్ గోయెల్ అన్నారు.

కొత్త టెక్నాలజీలకే డిమాండు

స్పెషలైజ్డ్ టెక్నాలజీ విభాగాల్లో కొత్త ఉద్యోగాలకు డిమాండ్ ఉంటుందన్న సంకేతాలతో దేశంలో ఉపాధి సెంటిమెంట్ బలపడిందని నౌకరీ ఆ నివేదికలో తెలిపింది. 37% యాజమాన్యాలు ఐటీ విభాగంలో కొత్త ఉద్యోగులను నియమించుకోనున్నట్టు తెలపడం విశేషం. అయితే సాంప్రదాయిక టెక్నాలజీల కన్నా నూతన టెక్నాలజీ విభాగాల్లోనే కొత్త ఉద్యోగాల కల్పన జరుగనుంది. మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఏఐ ఆధారిత టెక్నాలజీ విభాగాల్లో సామర్థ్యాలను పెంచుకోవడం విభిన్న రంగాల పరిశ్రమలకు తప్పనిసరి అయిందని ఆ నివేదికలో పేర్కొన్నారు. అనుభవం విషయానికి వస్తే 4-7 సంవత్సరాల అనుభవం ఉన్న వారికి డిమాండు అధికంగా ఉన్నట్టు తేలింది. అనుభవం ఉన్న వారిని ఉద్యోగాల్లో చేర్చుకోవాలనుకుంటున్నట్టు 47% మంది తెలిపారు. ఎంట్రీ స్థాయి (మూడేళ్ల లోపు అనుభవం) ఉద్యోగులను నియమించుకుంటామని 29% మంది చెప్పగా 8-12 సంవత్సరాల అనుభవం గల వారిని తీసుకుంటామన్న వారి సంఖ్య 17% ఉంది. 13-16 సంవత్సరాల అనుభవం ఉన్న వారిని తీసుకుంటామన్న వారి సంఖ్య కేవలం 3% ఉంది.

వచ్చేనెల 3-4 తేదీల్లో జీఎస్‌టీ మండలి భేటీ


న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్‌టీ మండలి వచ్చే నెల 3-4 తేదీల్లో సమావేశం కానుంది. రేట్ల హేతుబద్ధీకరణ, పరిహార సుంకం, బీమాపై ఏర్పాటైన మంత్రుల బృందాల సిఫారసులపై ఈ సమావేశంలో జీఎస్‌టీ మండలి చర్చించనుంది. కేంద్రం ఆర్థిక మంత్రితోపాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు ఈ మండలిలో సభ్యులుగా ఉన్నారు. జీఎస్‌టీ మలి తరం సంస్కరణల్లో భాగంగా దీపావళి నాటికి పన్ను రేట్లను హేతుబద్ధీకరించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జీఎస్‌టీలో 5, 12, 18, 28 శాతం శ్లాబులున్నాయి. వాటిని 5, 18 శాతం శ్లాబులకు కుదించి.. పొగాకు, ఆల్కహాల్ వంటి 5-7 రకాల ఉత్పత్తులపైన మాత్రం 40 శాతం ప్రత్యేక రేటును విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే, వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను జీఎస్‌టీ నుంచి పూర్తిగా మినహాయించాలని కూడా మోదీ సర్కారు ప్రతిపాదించింది. ప్రస్తుతం బీమా పాలసీలపై జీఎస్‌టీ రేటు 18 శాతంగా ఉంది.

ఈ ఏడాదే భారత్‌లో ఓపెన్ ఏఐ కార్యాలయం

న్యూఢిల్లీ: ఈ ఏడాది చివరిలో ఢిల్లీలో తమ తొలి కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఓపెన్ ఏఐ కంపెనీ తెలిపింది. చాట్ జీపీటీ సహా ఏఐ ఆధారిత ఓపెన్ ఏఐ టూల్స్‌కు అమెరికా తర్వాత భారత్ రెండో అతి పెద్ద మార్కెట్‌గా మారింది. దీంతో భారత్‌లోనూ కార్యాలయం ఏర్పాటు చేయాలని కంపెనీ నిర్ణయించింది. ఈ కార్యాలయంలో పని చేసేందుకు అవసరమైన ఉద్యోగుల నియామక ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించినట్టు వెల్లడించింది. తమ ఏఐ టూల్స్‌కు భారత్‌లో వేగంగా పెరుగుతున్న గిరాకీని తట్టుకునేందుకు ఈ కార్యాలయం తోడ్పడుతుందని ఓపెన్ ఏఐ భావిస్తోంది.

వచ్చేనెలలో ఫెడ్ రేట్లు తగ్గే చాన్స్!

ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్



కాన్సాస్ (అమెరికా): ప్రామాణిక వడ్డీ రేట్లను త్వరలోనే తగ్గించేందుకు అవకాశాలున్నాయని అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలిచ్చారు. అయితే, మార్కెట్లో పెరిగిన అనిశ్చితులు పరపతి విధానంపై నిర్ణయాలను మరింత సంక్లిష్టతరం చేశాయని ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ కాన్సాస్ సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జాక్సన్ హోల్ సదస్సులో పావెల్ పేర్కొన్నారు. కాగా, ప్రామాణిక వడ్డీరేట్లపై నిర్ణయం తీసుకునేందుకు యూఎస్ ఫెడరల్ రిజర్వ్‌కు చెందిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ వచ్చేనెల 16-17 తేదీల్లో భేటీ కానుంది. సమావేశం చివరి రోజున వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఫెడ్ రేట్ల తగ్గింపుపై పావెల్ తాజా సంకేతాలతో అమెరికా స్టాక్ మార్కెట్లు భారీ ర్యాలీ సాధించింది. డౌజోన్స్ ఒకదశలో 900 పాయింట్ల (2 శాతం) మేర పెరిగి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయిని నమోదు చేసింది.

సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే

మహిళల పెట్టుబడులపై అదనపు ప్రోత్సాహకాలు

ముంబై: మ్యూచువల్ ఫండ్ రంగంలో మహిళల పెట్టుబడులను పెంచేందుకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో చర్య చేపట్టబోతోంది. మహిళల తొలి పెట్టుబడులను ఆకర్షించే మ్యూచువల్ ఫండ్లు, డిస్ట్రిబ్యూటర్లకు అదనపు ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టనున్నట్లు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే శుక్రవారం తెలిపారు. మ్యూచువల్ ఫండ్ వ్యాపారాన్ని మరింత పెంచడంతో పాటు ప్రోత్సహించేందుకు దేశంలోని 30 అతిపెద్ద నగరాల్లో తొలిసారి పెట్టుబడి పెట్టే వ్యక్తుల నుంచి పెట్టుబడులను ఆకర్షించే డిస్ట్రిబ్యూటర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలందించాలనుకుంటున్నాం. తొలిసారిగా పెట్టుబడి పెట్టే మహిళల నుంచి పెట్టుబడులు రాబట్టే డిస్ట్రిబ్యూటర్లకు అదనపు ప్రోత్సాహకాలందించనున్నామని ఆయన అన్నారు. "మహిళల సమ ప్రాతినిధ్యం లేనిపక్షంలో ఆర్థిక సేవల సమ్మిళితం అసంపూర్ణం అవుతుంది. కాబట్టి మహిళల తొలి పెట్టుబడులను రాబట్టేందుకు డిస్ట్రిబ్యూషన్ ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టాలనుకుంటున్నాం" అని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) 30వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. యాంఫీ డేటా ప్రకారం.. 2024 మార్చి నాటికి ఫండ్ల నిర్వహణలోని వ్యక్తిగత ఇన్వెస్టర్ల మొత్తం ఆస్తుల్లో మహిళల వాటా 33 శాతంగా ఉంది.

మోసపూరిత ట్రేడింగ్ పథకాలతో జాగ్రత్త

విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల (ఎఫ్‌పీఐ) ద్వారా స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశం కల్పిస్తామంటూ సామాజిక మాధ్యమాలు, మొబైల్ యాప్‌ల ద్వారా ప్రోత్సహిస్తున్న మోసపూరిత ట్రేడింగ్ స్కీమ్‌తో జాగ్రత్తగా ఉండాలని సెబీ ఇన్వెస్టర్లను హెచ్చరించింది. అవన్నీ అక్రమ పథకాలని, నియంత్రణ పరిధిలోకి రావని సెబీ స్పష్టం చేసింది.

ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్

రూ.2.62 లక్షల కోట్లు ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో ఆరు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణం. సెన్సెక్స్ 693.86 పాయింట్లు నష్టపోయి 81,306.85 వద్ద ముగిసింది. నిఫ్టీ 213.65 పాయింట్లు కోల్పోయి 24,870.10 వద్ద స్థిరపడింది. బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.2.62 లక్షల కోట్లు తగ్గి రూ.453.65 లక్షల కోట్లకు పడిపోయింది.

- ఆన్‌లైన్ గేమింగ్ రంగంలోని కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. నజారా టెక్నాలజీస్ షేరు మరో 4.13% పతనమైంది. గడిచిన మూడు సెషన్లలో ఈ స్టాక్ 17.52% క్షీణించింది. డెల్టా కార్ప్ షేరు మరో 3.50%, ఆన్‌మొబైల్ గ్లోబల్ 2.73% తగ్గాయి.
- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 27 పైసల నష్టంతో రూ.87.52 వద్ద ముగిసింది.
- ఈనెల 15తో ముగిసిన వారంలో విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 148.8 కోట్ల డాలర్ల వృద్ధితో మొత్తం 69,510.6 కోట్ల డాలర్లకు పెరిగాయని ఆర్‌బీఐ వెల్లడించింది.
- స్నేహ ఆర్గానిక్స్ రూ.32.68 కోట్ల ఎస్ఎంఈ ఐపీఓ ఈనెల 29న ప్రారంభమై వచ్చేనెల 2న ముగియనుంది. ఈ ఐపీఓ ధరల శ్రేణి రూ.115-122గా ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,530 ▲	92,150 ▲	1,28,000 ▲
విజయవాడ	1,02,350 ▲	96,000 ▼	1,17,180 ▲
విశాఖపట్నం	1,02,270 ▼	92,300 ▼	1,28,000 ▲
రాజమండ్రి	1,00,530 ▼	92,150 ▼	1,17,500 ▲
ప్రొద్దుటూరు	1,01,000 ▲	92,920 ▲	1,17,100 ▲
ముంబై	99,360 ▲	91,010 ▲	1,13,900 ▲

'స్కైస్విఫ్ట్ 56' డ్రోన్‌కు డీజీసీఏ సర్టిఫికేషన్: మారుత్ డ్రోన్స్

హైదరాబాద్: స్థానిక మారుత్ డ్రోన్స్ కంపెనీ "స్కైస్విఫ్ట్ 56" పేరుతో మరో సరికొత్త డ్రోన్‌ను అభివృద్ధి చేసింది. దీనికి పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) నుంచి సర్టిఫికేషన్ కూడా లభించినట్టు కంపెనీ తెలిపింది. తక్కువ బరువు, అత్యాధునిక పరికరాలు ఉండే ఈ డ్రోన్‌ను రెండు నిమిషాల్లోనే ఫిట్ చేసి ఉపయోగించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన నిఘా, కచ్చితమైన మ్యాపింగ్‌తో క్షేత్ర స్థాయి శిక్షణకు ఈ డ్రోన్ ఎంతో ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. డ్రోన్ల ద్వారా జరిగే వ్యూహాత్మక నిఘా, పర్యవేక్షణలకు ఈ డ్రోన్ చక్కటి పరిష్కారమని మారుత్ డ్రోన్స్ సీఈఓ, సహ వ్యవస్థాపకులు వీ ప్రేమ్ కుమార్ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23 తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	535
వరంగల్	497	గోదావరి	525
చిత్తూరు	558	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	92	విజయవాడ	109
వరంగల్	92	గుంటూరు	106
కరీంనగర్	92	ఒంగోలు	106
మహబూబ్‌నగర్	92	చిత్తూరు	80
కర్నూలు	92	నెల్లూరు	85
విశాఖపట్నం	110	అనంతపురం	85
గోదావరి	109		



మొయినాబాద్ ఠాణా ఎదుట ఆందోళన చేస్తున్న రాంచందర్‌రావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు

హామీలను నెరవేర్చని కాంగ్రెస్.. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా?

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

మొయినాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు బయలుదేరితే.. బీజేపీ నాయకులను అరెస్టులు చేయిస్తోందన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని ముగించుకొని హైదరాబాద్ వెళ్తుండగా మొయినాబాద్ పోలీసులు రాంచందర్‌రావును అదుపులోకి తీసుకున్నారు. సచివాలయ ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఆయన్ను కొద్దిసేపు ఠాణాలో ఉంచారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రాంచందర్‌రావుతో పాటు బీజేపీ నాయకులను పోలీస్ స్టేషన్‌లో ఉంచి.. తర్వాత పంపించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. వర్షాల వల్ల హైదరాబాద్‌లో రోడ్లన్నీ దెబ్బతిన్నాయని, విద్యుత్ దీపాలు వెలగడం లేదని చెప్పారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల రామంతాపూర్‌లో శ్రీకృష్ణుడి శోభాయాత్రలో కరెంట్ షాక్‌తో ఆరుగురు చనిపోయారని మండిపడ్డారు. ప్రజా సమస్యలను జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జనం గోడును తెలిపేందుకు సచివాలయానికి వస్తున్న బీజేపీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారని, ఎన్ని అరెస్టులు చేసినా ప్రజల పక్షాన పోరాడతామని రాంచందర్‌రావు తేల్చి చెప్పారు.

రాజధానిలో మౌలిక వసతులేవి?

- రోడ్లు, డ్రైనేజీ పనులు చేయట్లేదు
- ఏడాదికాలంగా వీధిలైట్లు వెలగట్లే
- నరకప్రాయంలా ప్రజల జీవితం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిలో కనీస రోడ్ల సదుపాయం, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సరఫరా, పార్కులను రక్షించడం వంటి పనులు చేపట్టకపోవడంతో ప్రజల జీవితం నరకప్రాయంగా మారిందని అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మౌలిక సదుపాయాలపై తాము ప్రశ్నిస్తే రాష్ట్ర మంత్రులు తిడుతూ తమ బాధ్యత తీరిపోయిందనుకుంటున్నారని అన్నారు. చేయాల్సిన పనులు చేసి తర్వాత తమను ఒకటికాదు రెండు తిట్టినా పడతామని కిషన్‌రెడ్డి చెప్పారు. హైదరాబాదులో ఏడాదికిపైగా వీధిలైట్లు లేని దౌర్భాగ్యం నెలకొందని, రోడ్లు అధ్వానంగా మారినా స్పందించేవారు కరువయ్యారని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. దీనిపై ప్రశ్నిస్తున్న తమ పార్టీ నేతలను ఎక్కడికక్కడ గృహ నిర్బంధం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు జీహెచ్ఎంసీని అనాథ చేశాయని ఆయన విమర్శించారు. మౌలిక సౌకర్యాలను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ భూముల వ్యాపారం మాత్రం బాగా చేస్తోందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో ఈ వ్యాపారం రిటైల్‌గా జరగ్గా, కాంగ్రెస్ హయాంలో హోల్‌సేల్‌గా సాగుతోందని ఆరోపించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల పోరాటానికి మద్దతు

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల పోరాటానికి తాము మద్దతిస్తున్నామని కిషన్‌రెడ్డి ప్రకటించారు. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన పీఆర్సీకి అతీగతీ లేకుండాపోయిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలోనూ అదే పరిస్థితి కొనసాగుతోందన్నారు బీఆర్ఎస్ హయాంలో మూడు డీఏలు చెల్లించలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మరో మూడు డీఏలు కలి పెండింగ్‌లో ఉన్నవి ఆరు అయ్యాయని చెప్పారు. అందులో ఒక డీఏను 28 వాయిదాల్లో చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందన్నారు. ఇలా అయితేపూర్తి కాంగ్రెస్ హయాంలోపూర్తి చేయడం కష్టమేనని విమర్శించారు.

కార్మికులు మరణిస్తే.. ఇచ్చే పరిహారం పెంచాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్టీసీ ఉద్యోగుల విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): డ్యూటీలో మరణించే కార్మికుల కుటుంబాలకిస్తున్న పరిహారం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు కోరుతున్నారు. వెల్ఫేర్ స్కీం కింద డ్యూటీలో చనిపోయే ఆర్టీసీ కార్మికుల కుటుంబాలకు వెల్ఫేర్ స్కీం నుంచి ప్రస్తుతం రూ.5లక్షలు చెల్లిస్తున్నారు. కర్ణాటక ప్రభుత్వం.. డ్యూటీలో మరణించే ఆర్టీసీ కార్మికుల కుటుంబాలకు వెల్ఫేర్ స్కీం నుంచి ఇచ్చే ఆర్థిక సాయం రూ.20 లక్షలకు పెంచింది. కర్ణాటక ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని టీజీఎస్ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణలోనూ పరిహారం పెంచాలని విజ్ఞప్తి చేశారు. కర్ణాటక ఆర్టీసీ కంటే ఆర్థికంగా మెరుగ్గా ఉన్న టీజీఎస్ఆర్టీసీలో విధి నిర్వహణలో మరణించే కార్మికుల కుటుంబాలకిచ్చే పరిహారాన్ని రూ.25 లక్షలకు పెంచాలని కార్మికులు కోరుతున్నారు.

ఎక్సైజ్ కేసుల్లో పెరుగుతున్న శిక్షలు

- నేర నిరూపణ కోసం సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- సంగారెడ్డి, మెదక్‌లో ఎక్కువ కేసుల్లో శిక్షలు ఖరారు

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల ఎక్సైజ్‌శాఖ నమోదు చేస్తున్న కేసుల్లో నిందితులకు శిక్షలు పడటం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు సంబంధించిన కేసుల్లో అయిదేళ్లు, పదేళ్ల జైలు శిక్షలు, జరిమానాలు విధిస్తూ కోర్టులు తీర్పులిస్తున్నాయి. కేవలం కేసుల నమోదుతో ఆగకుండా వాటిని విజయవంతంగా రుజువు చేయడంలో ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. గతంలో హత్యలు, దొంగతనం కేసుల్లో ఎక్కువ శిక్షలు పడినట్లు వినేవాళ్లం. ఇప్పుడు ఆ కోవలోకి ఎక్సైజ్ కేసులు కూడా చేరడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించిన తర్వాత పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా ఈ నేరాలను అరికట్టడంపై దృష్టి సారించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం 2021లో తీసుకొచ్చిన నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోఫిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టంపై ఎక్సైజ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పోలీసు అకాడమీలో ఎక్సైజ్‌శాఖలో కానిస్టేబుల్ నుంచి అన్నిస్థాయిల్లో దాదాపు 1190 మంది సిబ్బందికి ఈ చట్టం గురించి, ఛార్జిషీట్, పంచనామా తయారీపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ తీసుకున్న ఎక్సైజ్ యంత్రాంగం గంజాయి, డ్రగ్స్, అల్ప్రోజోలం లాంటి మత్తు పదార్థాల కేసుల్లో జాగ్రత్తలు తీసుకోవడంతో ఎక్సైజ్ కేసుల్లో శిక్షలు పడుతున్నాయి.

కేసుల నమోదు.. శిక్షల గణాంకాలు ఇలా..

రాష్ట్రం ఏర్పడ్డాక ఎక్సైజ్ కేసుల్లో తొలి జైలు శిక్ష మెదక్‌లో నమోదైంది. గత రెండేళ్లలో పదుల సంఖ్యలో నిందితులకు అయిదేళ్లు, పదేళ్ల శిక్షలు పడ్డాయి. రాష్ట్రంలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద 2023లో 16 మంది, 2024లో 11 మంది, 2025లో గత నెల వరకు 15 మంది నిందితులకు శిక్షలు పడ్డాయి. గత ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 64మందికి ఎక్సైజ్ కేసుల్లో శిక్షలు పడ్డాయి. రాష్ట్రంలో ఈ కేసుల్లో ఇప్పటివరకు సంగారెడ్డి జిల్లాలో 23, మెదక్‌లో 10, కొత్తగూడెం జిల్లాలో 6, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాల్లో ముగ్గురి చొప్పున, రంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో ఇద్దరి చొప్పున శిక్షలు పడ్డాయి. కేసులు నమోదు చేసేటప్పుడు నిబంధనలు పాటించడం వల్ల నేర నిరూపణ సులభమైందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం తెలిపారు.

ఐదుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు!

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేయనున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, కృష్ణమోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డిపై స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలంటూ జూలై 25న తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో న్యాయ నిపుణులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసనసభావ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు చర్చలు జరిపారు. ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ఎమ్మెల్యేలపై నిర్ణయం.. పూర్తిగా స్పీకర్ పరిధిలోనిదేనని అసెంబ్లీ వర్గాలు చెబుతున్నాయి. అయినా, సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి బీఆర్ఎస్ ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని స్పీకర్ నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఐదుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే, విచారణకు సంబంధించి నిర్దేశిత సమయాన్ని ఆ నోటీసుల్లో పేర్కొనలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు నిర్దేశించిన గడువు లోపల పది మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసి స్పీకర్ ప్రసాద్‌కుమార్ నిర్ణయం ప్రకటిస్తారా? లేక పెండింగ్‌లో పెడతారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు ఎమ్మెల్యేలు తాము బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామంటూ పలు సందర్భాల్లో ప్రకటించారు. శాసనసభ రికార్డుల్లోనూ పది మంది ఎమ్మెల్యేలూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నారు. అయితే, దానం నాగేందర్ మాత్రం గత లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ సహా మిగతావారిపై స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.



మీది అనవసర ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)







స్పష్టంగా పేర్కొంటోందని.. ఈ మేరకు క్యాబినెట్ తీర్మానాన్ని సైతం అందజేశారని పేర్కొంది. ఎంక్వైరీ కమిషన్ రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెట్టి చర్యలు జరపవచ్చని చట్టంలోనే ఉందనే విషయాన్ని హైకోర్టు గుర్తుచేసింది. కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఇప్పటికప్పుడు చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం చెప్తున్నందున.. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ అనవరం లేదని పేర్కొంది. అదే సమయంలో.. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ సారాంశాన్ని ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పెట్టడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. తాము వెబ్‌సైట్‌లో పెట్టలేదని ఏజీ సుదర్శన్‌రెడ్డి చెప్పగా.. ఒకవేళ వెబ్‌సైట్‌లో పెట్టి ఉంటే దాన్ని తొలగించాలని ఆదేశాలు జారీచేసింది. పిటిషనర్ల ఆరోపణలపై పూర్తిస్థాయి కౌంటర్ దాఖలు చేయడానికి ప్రభుత్వానికి నాలుగు వారాల సమయం, ప్రభుత్వ కౌంటర్‌కు ప్రత్యుత్తరం ఇవ్వడానికి పిటిషనర్లకు వారంపాటు గడువు ఇచ్చింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌ను కొట్టేయాలని విజ్ఞప్తి చేస్తూ కేసీఆర్, హరీశ్ దాఖలు చేసిన పిటిషన్లపై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. కమిషన్ రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెట్టిన తర్వాత చర్యలు తీసుకుంటారా? పెట్టకముందే చర్యలు తీసుకుంటారా? అని గురువారం హైకోర్టు ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం వాదనలు ప్రారంభమైన వెంటనే అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వం నుంచి అందిన లిఖితపూర్వక సూచనలను, రాష్ట్ర మంత్రివర్గ తీర్మానాన్ని ధర్మాసనానికి అందజేశారు. అసెంబ్లీలో పెట్టి చర్చించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. కేసీఆర్, హరీశ్ ఇద్దరూ సభలో సభ్యులే కాబట్టి అసెంబ్లీకి వచ్చి చర్చించవచ్చని తెలిపారు. అలాగే సదరు రిపోర్ట్ సారాంశాన్ని వెబ్‌సైట్లో పెట్టారని పిటిషనర్లు చేస్తున్న ఆరోపణలు తప్పని.. తాము ఏ వెబ్‌సైట్‌లోనూ పెట్టలేదని.. ఆ మేరకు కావాలంటే ప్రమాణపత్రం దాఖలు చేస్తామని తెలిపారు. పిటిషనర్లకు ఇచ్చింది సెక్షన్ 8-బీ నోటీసులే అని.. కమిషన్ 8-బీ ప్రొసీజర్‌ను అనుసరించిందని తెలిపారు. ప్రభుత్వం తరఫున హాజరైన మరో సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రజాజీవితంలో ఉన్న వారికి ఓపెన్ మైండ్ ఉండాలని.. ఇక్కడ ప్రతిష్ఠకు భంగం కలగడం అంటూ ఏదీ ఉండదని పేర్కొన్నారు. కమిషన్ రిపోర్ట్ అడ్వైజరీ లక్షణం మాత్రమే కలిగి ఉంటుందని తెలిపారు.

యాక్షన్ టేకెన్ రిపోర్ట్ లేకుండా ఏంచేస్తారు?

కేసీఆర్, హరీశ్‌రావు తరఫు సీనియర్ న్యాయవాదులు ఆర్యామ సుందరం, దామ శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్‌లోని 8-బీ, 8-సీ ప్రకారం.. నోటీసులు ఇవ్వకుండా తమకు వ్యతిరేకంగా రిపోర్ట్ ఇవ్వడం చెల్లదని పేర్కొన్నారు. సదరు రిపోర్ట్‌లోని ఫైండింగ్స్ తమ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ఉన్నాయని.. దాన్ని అసెంబ్లీలో పెట్టకముందే పబ్లిక్ డొమైన్‌లో పెట్టడంతోపాటు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం చేయని తప్పునకు నిందించడం కిందకే వస్తుందని పేర్కొన్నారు. కమిషన్ రిపోర్టును అసెంబ్లీలో పెట్టడానికి చట్టప్రకారం ఆరునెలల సమయం ఉందని.. రిపోర్ట్‌పై ఏం చర్య తీసుకున్నారనేది లేకుండా కేవలం దాన్ని అసెంబ్లీలో పెట్టి ఏంలాభమని.. దానితోపాటు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ కూడా ఉండాలని వాదించారు. అసెంబ్లీలో పెట్టడం కూడా తదుపరి చర్య కిందకే వస్తుందని.. ఆ చర్యను అడ్డుకుంటూ స్టే ఇవ్వాలని కోరారు. తమ వాదన వినకుండా, క్రాస్ ఎగ్జామినేషన్‌కు అవకాశం ఇవ్వకుండా ఇచ్చిన కమిషన్ రిపోర్ట్ అక్రమమని పేర్కొన్నారు. రాజకీయ నాయకులకు ప్రతిష్ఠ చాలా ముఖ్యమని.. అది పోతే భవిష్యత్తు ఉండదని.. కమిషన్ రిపోర్ట్‌ను మీడియాకు ఇవ్వడం ద్వారా ఇప్పటికే తమకు తీరని నష్టం జరిగిందని.. అసెంబ్లీలో రిపోర్ట్ పెట్టి రాజకీయ విమర్శలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల మరింత నష్టం జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో తక్షణం కమిషన్ రిపోర్ట్‌పై స్టే ఇవ్వాలని కోరారు. అన్నివర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. కమిషన్ రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెట్టే వరకూ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోదు కాబట్టి ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ అసవరం లేదని పేర్కొంది. పిటిషనర్లు, ప్రభుత్వం ఉత్తరప్రత్యుత్తరాలను ఐదువారాల్లో పూర్తిచేయాలని పేర్కొంటూ తదుపరి విచారణను అక్టోబర్ 7కు వాయిదా వేసింది.

కాళేశ్వరంపై అసెంబ్లీలోనే తేల్చుకుందాం!

- 'నివేదిక'పై హైకోర్టు తీర్పుతో బీఆర్ఎస్ నిర్ణయం
- ఫాంహౌస్‌లో కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్, ప్రశాంత్‌రెడ్డి భేటీ

హైదరాబాద్/గజ్వేల్/మర్కుక్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంపై నిజానిజాలను అసెంబ్లీ వేదికగానే తేల్చుకోవాలని బీఆర్ఎస్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఏకపక్షంగా ఉందని, దాన్ని రద్దు చేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్ దాఖలు చేయగా, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. విచారణను ఐదు వారాల పాటు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో కేసీఆర్‌తో ముఖ్య నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి, వినోద్‌కుమార్, దామోదర్‌రావు సమావేశమయ్యారు. విచారణలో కోర్టు అడిగిన ప్రశ్నలు, ప్రభుత్వం తరఫు న్యాయవాది ఇచ్చిన సమాధానాలు.. తదుపరి ఏం చేయాలన్న దానిపై అధినేతతో చర్చించారు. అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడు నిర్వహిస్తారు? అందులో ఏమేం చర్చిస్తారు? అనే దాన్ని బట్టి ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై న్యాయనిపుణుల సలహా తీసుకుందామని గులాబీ బాస్ చెప్పినట్లు తెలిసింది. కాళేశ్వరంపై నిజానిజాలను అసెంబ్లీ వేదికగా ప్రజల ముందుకు తీసుకెళ్దామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గకూడదని సూచించినట్లు సమాచారం. కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్‌ను బద్నాం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు పూనుకుందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పినట్లు తెలిసింది. కాగా, ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్ మరో సారి స్వల్ప అస్వస్థతకు గురికాగా, ప్రత్యేక వైద్యుల బృందం ఆయనకు చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది.

సోనియా, రాహుల్‌ను కలిసినప్పుడు..
కాంగ్రెస్.. థర్డ్ క్లాస్ అనిపించలేదా?

మీ నాన్న.. కాంగ్రెస్ నుంచే కదా వచ్చింది?.. ఆయనా థర్డ్ క్లాసేనా? మరి నువ్వు ఏ క్లాసు?

తెలంగాణ రాకుంటే.. నువ్వు అమెరికా వెళ్లేటోడివి.. నీ తాత బతికుంటే.. కాంగ్రెస్‌ను తిట్టినందుకు కొట్టేటోడు... కేటీఆర్‌పై జగ్గారెడ్డి ధ్వజం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మంచోడే.. కానీ స్క్రిప్టు రీడర్.. యూరియా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది

సంగారెడ్డి ప్రజలకు మంజీరా నీటి కోసం సచివాలయంలో సమీక్ష చేశా.. బీఆర్ఎస్ వాళ్ల లాగా దందాల కోసం కాదు: జగ్గారెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్.. నీకు చిల్లర పార్టీ అయిందా? రాష్ట్రం ఇచ్చిన తర్వాత.. కుటుంబ సమేతంగా ఢిల్లీకి వెళ్లి సోనియా, రాహుల్‌ను కలిశారు కదా.. అప్పుడు కాంగ్రెస్ థర్డ్ క్లాస్ పార్టీ అనిపించలేదా? కేసీఆర్ రాజకీయ పాఠాలు నేర్చుకుందీ.. కాంగ్రెస్‌లోనే కదా? అలాంటప్పుడు కేసీఆర్ కూడా థర్డ్ క్లాసేనా? మరి నీది ఏ క్లాసు?" అంటూ కేటీఆర్‌పై టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందంటూ నాడు నిండు అసెంబ్లీలో కేసీఆరే చెప్పారని గుర్తు చేశారు. "ఇవాళ కేసీఆర్ కుటుంబం ఇంతగా వెలిగిపోతుందంటే.. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్సే కారణం. దేశానికి స్వాతంత్రం తెచ్చిన కాంగ్రెస్‌ను.. థర్డ్ క్లాస్ పార్టీ అనడానికి కేటీఆర్‌కు మనసు ఎలా వచ్చింది? కాంగ్రెస్ ఏంటన్నది ఆయన కేసీఆర్‌ను అడిగి తెలుసుకోవాలి. సోనియా తెలంగాణ ఇవ్వకుంటే అమెరికాలో జీతం రాళ్లపైనే కేటీఆర్ బతకాల్సి వచ్చేది. తెలంగాణ బిడ్డ అయిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిగా పెడితే.. ఆయనకు మద్దతు ఇచ్చి ఓటేయాల్సింది పోయి.. ఉల్టా కాంగ్రెస్‌పైనే ఆరోపణలు చేస్తారా? కేటీఆర్, కేసీఆర్ అవకాశవాద రాజకీయానికి ఇది పరాకాష్ట. పదేళ్ల మంత్రిగా పని చేసినా కేటీఆర్‌కు రాజకీయ జ్ఞానం లేదు. ఉపరాష్ట్రపతి ఎన్నికలపై తొందరపడి మాట్లాడి కిషన్‌రెడ్డికి అవకాశం ఇచ్చాడు. కేటీఆర్ తాత, నాయనమ్మ బతికుంటే.. కాంగ్రెస్‌ను తిడుతున్నందుకు ఆయన చెంప మీద కొట్టేవాళ్లు. కాంగ్రెస్ అంటే త్యాగాల పార్టీ అని చెప్పి.. బుద్ధి చెప్పి ఉండేటోళ్లు" అని వ్యాఖ్యానించారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ చేసిన దీక్షంతా కాంగ్రెస్ డిజైన్ చేసిందేనని జగ్గారెడ్డి తెలిపారు. తెలంగాణ వచ్చాక ప్రజలకు ఏ మేరకు లాభం జరిగిందో తెలియదు కానీ.. కేసీఆర్ కుటుంబం మాత్రం లాభపడిందని దుయ్యబట్టారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సౌమ్యుడు.. మంచోడని, అయితే ఆయన ఇంకా స్క్రిప్ట్ రీడరేనని ఎద్దేవా చేశారు. కోటా మేరకు యూరియా ఇవ్వకుండా కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనాం చేస్తోందని దుయ్యబట్టారు. రైతులకు రూ.వేల కోట్లు ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి.. కేంద్రం యూరియా ఇస్తే రైతులకు ఇవ్వడానికి ఇబ్బంది ఉంటదా? అని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు, కుతంత్రాలను రైతులు అర్థం చేసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్, వ్యవసాయ మంత్రి తుమ్మల రైతులకు యూరియా అందించే పనిలోనే ఉన్నారని తెలిపారు. "సచివాలయంలో నేను సమీక్ష నిర్వహించానంటూ బీఆర్ఎస్ మాట్లాడుతోంది. సచివాలయంలో వాళ్ల లాగా దందాలు చేస్తే తప్పు కానీ.. ప్రజల కోసం సమీక్ష చేస్తే తప్పేంటి? సంగారెడ్డి ప్రజలకు మంజీరా నీటి కోసం సమీక్ష చేశా.. మళ్లీ కూడా చేస్తా" అని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా తాను మొగోడిలా ఉంటానని వ్యాఖ్యానించారు.



సీపీఐ రాష్ట్ర మహాసభల్లో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న సీపీఐ నాయకులు డీ. రాజా, కూనంనేని, నారాయణ, చాడ తదితరులు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా మళ్లీ కూనంనేని

- సహాయ కార్యదర్శులుగా తక్కెళ్లపల్లి, ఈటీ నరసింహ
- 101 మందితో కొత్త కార్యవర్గం

హైదరాబాద్/గాజులరామారం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మరోసారి ఎన్నికయ్యారు. మేడ్చల్ జిల్లా గాజులరామారంలో జరిగిన సీపీఐ రాష్ట్ర నాలుగో మహాసభల చివరి రోజు, శుక్రవారం నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని పేరును సీపీఐ సీనియర్ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి ప్రతిపాదించగా మరో నేత శంకర్ బలపరిచారు. దీంతో కూనంనేని వరుసగా రెండోసారి పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అలాగే, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటీ నరసింహ ఎన్నికయ్యారు. 10 మంది కార్యదర్శి వర్గ సభ్యులు, 32 మంది కార్యవర్గ సభ్యులు సహా మొత్తం 101 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన నాయకత్వాన్ని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా అభినందించారు. రాష్ట్రంలో సీపీఐని మరింత బలోపేతం చేసేందుకు కృషి చెయ్యాలని వారు దిశానిర్దేశం చేశారు. కాగా, రాష్ట్ర నూతన కార్యవర్గానికి ఎన్నికైన వారిలో కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకట రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనరసింహ, వీఎస్ బోస్, ఈటీ నరసింహ, బొమ్మగాని ప్రభాకర్, వి.సీతారామయ్య, పల్లా నర్సింహారెడ్డి, నెల్లికంటి సత్యం, ఎస్కే సాబీర్ పాషా, దండి సురేశ్, సీహెచ్ రాజారెడ్డి, ఎస్ బాల్‌రాజ్, మందా పవన్, బి.విజయసారథి, కర్రె భిక్షపతి, పాలమాకుల జంగయ్య, ఎస్.జ్యోతి, బెజవాడ వెంకటేశ్వర్లు, ఛాయాదేవి, రామడుగు లక్ష్మణ్, కలకొండ కాంతయ్య, ఈ ఉమా మహేశ్, పంజాల శ్రీనివాస్, ముత్యాల విశ్వనాథం, యానాల దామోదర్ రెడ్డి, షేక్ బాసుమియా ఉన్నారు.

కమ్యూనిస్టు పార్టీకి ఉద్యమాలే ఊపిరి: చాడ

త్వరలో రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సీపీఐ శ్రేణులు సన్నద్ధం కావాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వందేళ్ల చరిత్ర ఉన్న సీపీఐ.. దేశంలో, రాష్ట్రంలో అధికారంలోకి రాలేకపోయిందనే విమర్శలు ఉన్నా, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటాలు సాగించిందన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ఉద్యమాలే ఊపిరి అని, ఎర్రజెండా వద్దకు వస్తే నీడ, నివాసం దొరుకుతాయని పేదల గుండెల్లో గట్టి నమ్మకం ఉందన్నారు.

ఏపీ మంత్రి అల్లుడికే బురిడీ!

- అకౌంటెంట్‌కు మెసేజ్ పెట్టి 1.96 కోట్ల లూటీ
- వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం
- గత నెలలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..

నెల్లూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ మంత్రి నారాయణ పెద్ద అల్లుడు పునీత్ పేరిట సైబర్ నేరగాళ్లు రూ.1.96 కోట్లు లూటీ చేసిన ఘటన కూడా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే దీనిపై వెంటనే సమాచారం అందడంతో అప్రమత్తమైన నెల్లూరు రూరల్ పోలీసులు సైబర్ నేరగాళ్ల ఖాతా నుంచి కోటీ 40 వేల రూపాయలు ఫ్రీజ్ చేశారు. ఈ కేసులో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కొన్నిరోజుల క్రితం మంత్రి నారాయణ పెద్ద అల్లుడు పునీత్ నిర్వహిస్తున్న ఐవీ గ్రీన్ ఇన్‌ఫ్రా అకౌంటెంట్‌కు పునీత్ పేరిట సైబర్ నేరగాళ్లు వాట్సాప్ మేసేజ్ పెట్టారు. అర్జెంట్‌గా తాను పంపిన ఖాతాకు రూ.1.96 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరడంతో అకౌంటెంట్ వెంటనే ఆ మొత్తాన్ని ఆ మెసేజ్‌లో చూపించిన బ్యాంకు ఖాతాకు పంపించారు. తర్వాత ఈ విషయం నారాయణ అల్లుడికి తెలియజేయడంతో.. ఆయన ఇదంతా సైబర్ నేరగాళ్ల పన్నాగమని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించి రూ.కోటీ 40 వేలను ఫ్రీజ్ చేయించినట్టు నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. అనంతరం వారి నుంచి అందుకున్న ఫిర్యాదుతో గత నెలలో ఉత్తరప్రదేశ్‌లో సంజీవ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని చెప్పారు. కేసులో రెండో సూత్రధారి అయిన అరవింద్‌కుమార్ శ్రీవాత్సవ్‌ను కూడా తాజాగా ఉత్తరప్రదేశ్‌లోనే అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సైబర్ కుట్రలో ప్రధాన నిందితుడి కోసం గాలిస్తున్నామని చెప్పారు.

ప్రపంచానికే తలమానికంగా మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ

» అధికారులతో మంత్రి తుమ్మల .. నిర్మాణ ప్లాన్ పరిశీలన



హైదరాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రపంచానికే తలమానికంగా నిలిచేలా ఆకర్షణీయమైన డిజైన్‌లో నిర్మించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కొత్తగూడెంలో నిర్మించ తలపెట్టిన ఈ యూనివర్సిటీ నిర్మాణానికి సంబంధించి ఆర్కిటెక్ట్ ఉష రూపొందించిన ప్లాన్‌ను వర్సిటీ వీసీ యోగితా రాణాతో కలిసి మంత్రి తుమ్మల సచివాలయంలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. 300 ఎకరాల్లో చేపట్టబోయే వర్సిటీ నిర్మాణంలో నాణ్యత, ప్రమాణాల్లో రాజీ ఉండకూడదని, ఆధునిక వసతులు, మౌలిక సదుపాయాలు ఉండేలా నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు. ఆర్కిటెక్ట్ రూపొందించిన డిజైన్లను ముఖ్యమంత్రికి చూపించి ఆమోదం పొందాలని సూచించారు. ఆ వెంటనే ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. మూడేళ్లలో యూనివర్సిటీ పనులు పూర్తవ్వాలని అధికారులకు మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

హైదరాబాద్ - సోమశిల - శ్రీశైలం మధ్య హెలీ టూరిజానికి ఏర్పాట్లు: జూపల్లి



హైదరాబాద్, కొల్లాపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హెలీ టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించామని, హైదరాబాద్- సోమశిల - శ్రీశైలం మధ్య హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. రూ.68.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధి పనులకు మంత్రి జూపల్లి శుక్రవారం శ్రీకారం చుట్టారు. కొల్లాపూర్ నియోజకవర్గం అమరగిరిలో రూ.45.84 కోట్ల వ్యయంతో అమరగిరి ఐలాండ్ వెల్‌నెస్ రిట్రీట్ నిర్మాణ పనులు, రూ.1.60 కోట్లతో సోమశిల వీఐపీ ఘాట్-బోటింగ్ పాయింట్ కోసం ట్రెంచింగ్ పనులకు మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈజ్ మై ట్రిప్ సంస్థ సహకారంతో హైదరాబాద్ నుంచి సోమశిల, అక్కడి నుంచి శ్రీశైలం మీదుగా హైదరాబాద్‌కు హెలీ టూరిజం నిర్వహణ ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోందని తెలిపారు.

రూ.2000 కోట్ల అప్పు తీసుకోనున్న ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2000 కోట్ల అప్పు తీసుకోవడానికి శుక్రవారం సెక్యూరిటీ బాండ్లను జారీ చేసింది. 26 ఏళ్ల కాల పరిమితితో రూ.500 కోట్లు, 28 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 30 ఏళ్ల కాల పరిమితితో రూ.500 కోట్ల చొప్పున ఈ అప్పు తీసుకోనుంది. ఈ నెల 26న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించే ఈ-వేలం ద్వారా రుణాన్ని సేకరించనుంది.

జీఎస్టీ నుంచి 'చేనేత'ను మినహాయించండి

» నిర్మలా సీతారామన్‌కు చిన్నారెడ్డి లేఖ

వస్తు సేవల పన్ను(జీఎస్టీ) నుంచి చేనేత వస్త్రాలను మినహాయించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. తెలంగాణలో వ్యవసాయం తర్వాత అత్యధిక మంది చేనేత రంగంలోనే ఉపాధి పొందుతున్నారని వివరించారు. ప్రస్తుతం వస్త్రాల విలువల ఆధారంగా చేనేత వస్త్రాలపై 5 శాతం, 12 శాతం వంటి పన్ను రేట్లు అమలవుతున్నాయని, దీని వల్ల చేనేత వస్త్రాలపై ఆధారపడిన కుటుంబాలు చితికిపోతున్నాయని తెలిపారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో చేనేత వస్త్రాలపై ఉన్న పన్ను రేట్లను ఎత్తివేయాలని జి.చిన్నారెడ్డి కోరారు.

ఎన్‌హెచ్-163లో సర్వీస్ రోడ్లు పూర్తి చేయండి

» కేంద్ర మంత్రి గడ్కరీకి ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్-163లో సర్వీస్ రోడ్ల పనులు పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్ - భూపాలపట్నం రోడ్డు(ఎన్‌హెచ్-163)ను నాలుగు వరుసలుగా విస్తరించినప్పటికీ, కొన్ని గ్రామాల వద్ద సర్వీస్ రోడ్ల మధ్య అనుసంధానం లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పనులు చేయడానికి ఎటువంటి ఇబ్బందులు లేవని, రోడ్డు విస్తరణ సమయంలోనే భూ సేకరణ చేశారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని గడ్కరీ హామీ ఇచ్చారని కావ్య తెలిపారు.

దసరా-దీపావళి కోసం 170 ప్రత్యేక రైళ్లు: దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి, ఛత్ పండుగల రద్దీ దృష్ట్యా 170 ప్రత్యేక రైళ్లు నడుపుతామని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. అక్టోబర్ 6నుంచి నవంబర్ 24 వరకు (సోమ) చర్లపల్లి-రక్సౌల్(07705) మధ్య 8 రైళ్లు, అక్టోబర్ 9నుంచి నవంబర్ 27వరకు(గురు) రక్సౌల్- చర్లపల్లి(07006) మధ్య 8 రైళ్లు, సెప్టెంబర్ 7నుంచి 28వరకు(ఆది) తిరుపతి-చర్లపల్లి(07481) మధ్య 4 రైళ్లు, సెప్టెంబర్ 8నుంచి 29వరకు(సోమ) చర్లపల్లి-తిరుపతి(07482) మధ్య 4 రైళ్లు నడుపుతారు. సెప్టెంబర్ 5నుంచి 26వరకు(శుక్ర) చర్లపల్లి-తిరుపతి(07011)మధ్య 4 రైళ్లు, సెప్టెంబర్ 6నుంచి 27వరకు(శని) తిరుపతి-చర్లపల్లి(07012) మధ్య 4 రైళ్లు, నర్సాపూర్-ఎస్ఎంవిటి బెంగుళూరు(07153) 13 రైళ్లు, అక్టోబర్ 4నుంచి డిసెంబర్ 27వరకు(శుక్ర) ఎస్ఎంవిటి బెంగుళూరు-నర్సాపూర్-(07154) 13 రైళ్లు, అక్టోబర్ 1నుంచి నవంబర్ 26వరకు(బుధ) తిరుపతి-హిసార్(07717)మధ్య 9రైళ్లు నడుపుతున్నట్టు రైల్వే అధికారులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు.

హెల్త్‌కేర్ కోర్సులకు కొత్త సిలబస్ తప్పనిసరి

» దేశమంతా ఒకేరీతి విద్యా ప్రమాణాలే లక్ష్యం
» వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమలు
» రాష్ట్రాలకు ఎన్‌సీఏహెచ్‌పీ ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): 'అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్'లో దేశమంతా ఒకేరీతి విద్యా ప్రమాణాలు పాటించాలనే ఉద్దేశంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నేషనల్ కమిషన్ ఫర్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్(ఎన్‌సీఏహెచ్‌పీ) శుక్రవారం ఓ ఉత్తర్వు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న డీమ్డ్ విశ్వ విద్యాలయాలు, అనుబంధ కళాశాలలన్నీ 2026-27 విద్యా సంవత్సరంలో కొత్త సిలబస్‌ను తప్పనిసరిగా అనుసరించాలని అందులో పేర్కొంది. ఫిజియో థెరపీ, ఆప్టోమెట్రీ, డయాలసిస్ థెరపీ, హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్, మెడికల్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ, రేడియోథెరపీ టెక్నాలజీ, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, అప్లైడ్ సైకాలజీ, బిహేవియరల్ సైన్స్, ఫిజీషియన్ అసోసియేట్, న్యూట్రీషన్ అండ్ డైటెటిక్స్ వంటి పది కొత్త పాఠ్య ప్రణాళికలను ఎన్‌సీఏహెచ్‌పీ ఇటీవల సిలబస్ చేర్చింది. ఈ ఒకే పాఠ్య ప్రణాళికను దేశమంతా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. అలాగే ప్రతీ విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా బోర్డ్ ఆఫ్ స్టడీస్ లేదా బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను ఏర్పాటు చేసి విద్యా ప్రణాళిక అమలుపై పర్యవేక్షించాలని ఆదేశించింది. ఇక రాష్ట్రస్థాయిలో ఇప్పటికే ఉన్న హెల్త్ కేర్ కౌన్సిల్ ఈ సిలబస్ అమలు పర్యవేక్షణ బాధ్యత చూసుకోవాలని సూచించింది. ఒకవేళ కౌన్సిల్ ఏర్పాటు కాని రాష్ట్రాల్లో మాత్రం ఆరోగ్యశాఖే ఆ బాధ్యత తీసుకోవాలని కోరింది. 45 రోజుల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్(ఏటీఆర్)ను సమర్పించాల్సిందిగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కమిషన్ గడువు విధించింది.

బీసీ బిల్లులపై సుప్రీంకోర్టుకు?



(మొదటిపేజీ తరువాయి)

కల్పించాలంటూ విజ్ఞప్తి చేయాలన్న ప్రతిపాదనా ఉంది. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో స్థానిక ఎన్నికలపై ముందుకు వెళుతూనే.. బిల్లుల ఆమోదంపై సుప్రీం కోర్టును ఆశ్రయించాలన్న ఆలోచన కూడా ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

పీఏసీలో నిర్ణయం

గాంధీభవన్‌లో శనివారం సాయంత్రం టీపీసీసీ రాజకీయ వ్యవహారాలు, సలహా కమిటీల ఉమ్మడి సమావేశం జరగనుంది. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, రాజకీయ వ్యవహారాలు, సలహా కమిటీల సభ్యులు పాల్గొననున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఈ ఉమ్మడి సమావేశంలో చర్చిస్తారు. అలాగే ఏఐసీసీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఓట్ చోరీ, గద్దె చోడ్ ఉద్యమం నిర్వహించడం, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ సంస్థాగత నిర్మాణం, యూరియా కొరత తదితర అంశాలపైన చర్చిస్తారు. అయితే స్థానిక ఎన్నికలు, అందులో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై చర్చలో భాగంగా ప్రభుత్వం ముందు ఉన్న మూడు ప్రతిపాదనలపైనా సమావేశం.. చర్చించి నిర్ణయం తీసుకోనుంది. పార్టీ పరంగా తీసుకోనున్న విధాన నిర్ణయాన్ని.. ప్రభుత్వ పరంగానూ తీసుకుని అమలు చేయనున్నారు.

25న క్యాబినెట్ భేటీ

రాష్ట్ర మంత్రివర్గం ఈ నెల 25న సచివాలయంలో భేటీ కానుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ప్రధానంగా స్థానిక ఎన్నికలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశాలపైనే చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. పీఏసీలో తీసుకునే విధాన పరమైన నిర్ణయాల ఆధారంగానే.. రాష్ట్ర క్యాబినెట్ ఈ అంశాలపై నిర్ణయం తీసుకోనుంది. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలని పీఏసీలో నిర్ణయిస్తే.. పాత రిజర్వేషన్ ప్రకారం పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని క్యాబినెట్ సమావేశంలో తీర్మానిస్తారు. దీంతోపాటు కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక, అసెంబ్లీ వర్షాకాలం సమావేశాల నిర్వహణ తదితర అంశాలపైనా క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. వర్షాకాలం సమావేశాలను సెప్టెంబరు 26 లోపునే నిర్వహించాల్సి ఉన్నందున.. మొదటి లేదా రెండో వారంలో నిర్వహించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

ఉద్యోగాలిస్తుంటే ఓర్వలేకపోతున్నారు

ప్రజలతో కాంగ్రెస్ ప్రభుత్వానిది కుటుంబ బంధం.. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను దేవాలయంలా చూడాలి

» భూములు కోల్పోయిన వారందరికీ ఉద్యోగాలిస్తాం
» జనవరి 15 లోపు పవర్‌ప్లాంట్ పూర్తి: భట్టి
» బీఆర్ఎస్ ఉద్యోగాలిస్తుంటే వద్దన్నామా?: మంత్రి కోమటిరెడ్డి
» జెన్‌కోలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు



ప్రజాభవన్‌లో నిర్వాసితులకు నియామకపత్రాలు అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలతో కాంగ్రెస్ ప్రభుత్వానిది కుటుంబ బంధమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను ముందుకు తీసువెళ్లే పనులు చేస్తున్నామని తెలిపారు. పాలనలో అత్యంత ప్రాధాన్యం విద్యకు ఇస్తున్నామని పేర్కొన్నారు. పదేళ్లపాటు నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వకుండా నిర్లక్ష్యం చేసి.. ప్రస్తుతం తాము ఇస్తుంటే ఓర్వలేకపోతున్నారని ఆక్షేపించారు. శుక్రవారం తెలంగాణ జెన్‌కోలో జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ప్లాంట్ అటెండెంట్, ఆఫీస్ సబార్డినేట్, హౌస్ కీపర్ ఉద్యోగులుగా నియమితులైనవారికి ప్రజాభవన్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి నియామక పత్రాలు అందించిన సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదంటూ ప్రచారం చేశారని, ఉన్నది లేనట్లుగా భ్రమలు కల్పించారని మండిపడ్డారు. కాంగ్రెస్ అంటేనే కరెంట్ అని, రాష్ట్రంలో తొలి జలవిద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటుచేసింది కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. 1978లో నాగార్జునసాగర్‌లో జలవిద్యుత్ ప్రాజెక్టు కట్టామని, జపాన్‌తో కలిసి సాగర్‌లోనే పంప్డ్ స్టోరేజీ ప్లాంట్‌ను కట్టామని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కాలం చెల్లిన భద్రాద్రి పవర్ ప్లాంట్ తప్ప.. కట్టిందేమీ లేదని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే కొత్త ఎనర్జీ పాలసీని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయని, వీరందరికీ ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. గృహజ్యోతి పథకం కింద 51 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ ఇస్తున్నామని పేర్కొన్నారు. డిమాండ్ ఏయేటికాయేడు పెరుగుతున్నా.. నాణ్యమైన విద్యుత్‌ను రెప్పపాటు అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఏటా వ్యవసాయ పంపుసెట్లు, గృహజ్యోతి కింద రూ.17 వేల కోట్లను విద్యుత్ శాఖకు అందిస్తున్నామని వెల్లడించారు.

పవర్‌ప్లాంట్ ఒక దేవాలయం..

యాదాద్రి థర్మల్ ప్లాంట్ ఒక దేవాలయం అని, ఆ దేవాలయంలో ఉద్యోగాలు పొందిన వారు మనసు పెట్టి పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సూచించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద యంగ్ ఇండియా గురుకుల విద్యాలయం కట్టిస్తామన్నారు. భూములు కోల్పోయిన నిర్వాసితులందరికీ ఉద్యోగాలివ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌కు ఇచ్చిన పర్యావరణ అనుమతిని 2022 అక్టోబరులో జాతీయ హరిత ట్రైబ్యునల్ రద్దు చేసిందని, కానీ.. దీనిని గత ప్రభుత్వం రెండేళ్లపాటు పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో నిర్మాణ వ్యయం మరింత భారంగా మారిందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక పర్యావరణ అనుమతిని తెచ్చుకున్నామని చెప్పారు. యాదాద్రిలో మొత్తం 5 యూనిట్లు, రానున్న జనవరి 15 లోపు పూర్తయి.. ప్లాంటు పూర్తిస్థాయిలో జాతికి అంకితం అవుతుందన్నారు. సీఎస్ఆర్ కింద గ్రామాల్లో సీసీ రోడ్లు పూర్తి చేస్తామని, ప్రతి మండలంలో ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 60 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. "నియామకాల కోసం తాము అంతా రెడీ చేశామని కొందరంటున్నారు. అయితే అధికార ంలో ఉండగా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తుంటే మేం ఆపామా? న్యాయస్థానంలో ఎన్నో సమస్యలు ఉంటే.. వాటన్నింటినీ పరిష్కరించి, నియామక పత్రాలు అందించాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జెన్‌కో సీఎండీ ఎస్.హరీష్, నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం సహాయానికి దారేదీ?

» సీఎం, మంత్రి ఆదేశించినా నాలుగు ప్రాజెక్టులకు 'ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్' తీసుకోని అధికారులు
» టీఏసీ అనుమతి వచ్చినా ముందుకు పడని అడుగులు

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ) నుంచి ప్రాజెక్టులకు కీలక అనుమతులు సాధించినప్పటికీ వాటికి కేంద్ర సహాయం కోరే దిశగా అధికారుల అడుగులు పడటం లేదు. రాష్ట్రంలో సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుతో పాటు చనాకా కొరాటా, మొడికుంటవాగు, చిన్నకాళేశ్వరం (ముక్తేశ్వర్) ప్రాజెక్టులకు కీలకమైన సాంకేతిక సలహా మండలి (టీఏసీ) అనుమతులు లభించాయి. దాంతో ఈ ప్రాజెక్టులకు ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై-ఏఐబీపీ) కింద సహాయం కోరాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ ప్రాజెక్టుకు కేంద్ర సహాయం పొందాలన్నా విధిగా సీడబ్ల్యూసీ నుంచి ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ తీసుకోవాలి. ఇది లేకపోతే కేంద్రం ఒక్క పైసా కూడా ఇవ్వదు. చనాకా కొరాటా కింద రూ.173 కోట్లు, మొడికుంటవాగు కోసం రూ.463 కోట్లు, చిన్నకాళేశ్వరం(ముక్తేశ్వర్) ఎత్తిపోతల పథకానికి రూ.233 కోట్లు కలిపి మొత్తం రూ.869 కోట్లు కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాలని తొలుత నిర్ణయించారు. ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా అధికారులు మాత్రం ఇప్పటి వరకు ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ కోసం కసరత్తు చేపట్టలేదు. ఏఐబీపీ కింద కేంద్రం 60 శాతం నిధులు సమకూరిస్తే రాష్ట్రం 40 శాతం భరించాల్సి ఉంటుంది.



1623 సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

» పీజీ మార్కుల ఆధారంగా నియామకం
» మొత్తం వంద పాయింట్లు.. వెయిటేజీకి 20 పాయింట్లు
» సెప్టెంబరు 8 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు.. 22 వరకు గడువు
» టీవీవీపీ ఆస్పత్రుల్లో తీరనున్న స్పెషాలిటీ డాక్టర్ల కొరత

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో కొలువుల జాతర కొనసాగుతోంది. తాజాగా భారీగా సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్టు వైద్యులు) పోస్టుల భర్తీకి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 1623 పోస్టులను భర్తీ చేయనున్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ పరిధి ఆస్పత్రుల్లో 1616 పోస్టులు, టీఎస్ఆర్టీసీలో పరిధి ఆస్పత్రుల్లో ఏడు సీఏఎస్ పోస్టుల భర్తీకి బోర్డు కార్యదర్శి గోపికాంత్‌రెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. అభ్యర్థులకు రాత పరీక్ష ఉండదు. పీజీలో వచ్చిన మార్కుల ఆధారంగా నియామకాలను చేపడతారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 8 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులకు సెప్టెంబరు 22 సాయంత్రం ఐదుగంటల వరకు గడువిచ్చారు. ఈ పోస్టులన్నింటికి అర్హత వైద్యవిద్యలో పీజీ లేదా డిప్లొమో, డీఎన్‌బీ కోర్సు చేసి ఉండాలి. అలాగే అభ్యర్థులు కచ్చితంగా తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేసుకొని ఉండాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే వారు అనుభవపూర్వక ధ్రువపత్రం జత చేయాల్సి వుంటుంది. ఎంపికైన అభ్యర్థులు ప్రైవేటు ప్రాక్టీస్ చేసేందుకు అనర్హులని నోటిఫికేషన్‌లోనే బోర్డు పేర్కొంది. ఇక అభ్యర్థులు ఈ ఏడాది జూలై 1 నాటికి 46 సంవత్సరాలకు మించి ఉండకూ డదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్ల వయోపరిమితి సడలింపు ఇచ్చారు. దివ్యాంగులకు పదేళ్లు ఇచ్చారు. ఎన్‌సీసీ, ఎక్స్ సర్వీస్‌మెన్‌కు మూడేళ్ల వయోపరిమితి సడలింపునిచ్చారు. అభ్యర్థులకు పీజీలో వచ్చిన మార్కులు, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తుంటే వచ్చే మార్కుల ఆధారంగా పాయింట్లను కేటాయిస్తారు. మొత్తం వంద పాయింట్లు ఉంటాయి. ఇందులో వెయిటేజీకి 20, వైద్య విద్యలో పీజీ, డిప్లొమో, డీఎన్‌బీలో వచ్చిన మార్కుల ఆధారంగా 80 పాయింట్లు కేటాయిస్తారు. మార్కుల ఆధారంగా శాతాన్ని (పర్సెంటేజీని) లెక్కిస్తారు. వైద్యులు పీజీ పూర్తి చేసివుండి, సర్కారీ దవాఖానాల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తేనే వెయిటేజీ ఉంటుంది. మరిన్ని వివరాలను www.mhsrb.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని బోర్డు సూచించింది. ఈ పోస్టుల భర్తీతో టీవీవీపీ ఆస్పత్రుల్లో స్పెషాలిటీ డాక్టర్ల కొరత తీరనుంది.

చోరీ కోసం వచ్చి.. పట్టుబడొద్దని చంపేసి!

(మొదటిపేజీ తరువాయి)

చంపేసినట్టు తెలిసింది. ఎలాంటి సాంకేతిక ఆధారాలూ లభించక తలపట్టుకున్న పోలీసులు.. పక్కన ఉన్న అపార్ట్‌మెంట్‌లోని ఓ వ్యక్తి మామూలుగా చెప్పిన ఒక అంశం ఆధారంగా పరిశీలన జరిపి హత్య మిస్టరీని ఛేదించారు.

ఏం జరిగింది?

ఐదేళ్ల క్రితం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం మక్తక్యాసారం నుంచి వలస వచ్చిన కృష్ణ, రేణుక దంపతులు, వారి కుమార్తె సహస్ర, ఏడేళ్ల కుమారుడు కూకట్‌పల్లి దయార్‌గూడలోని ఓ అపార్టుమెంట్ పెంట్‌హౌజ్‌లో ఉంటున్నారు. కృష్ణ మెకానిక్‌గా, రేణుక ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. సహస్ర బేగంపేటలోని కేంద్రీయ విద్యాలయలో ఆరో తరగతి, కుమారుడు ఇంటి సమీపంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. కేంద్రీయ విద్యాలయలో స్పోర్ట్స్ మీట్ నేపథ్యంలో సెలవులు ఇవ్వడంతో సహస్ర ఇంట్లోనే ఉంటోంది. ఈ నెల 18న ఉదయం కుమారుడిని స్కూల్‌కు పంపిన తల్లిదండ్రులు తమ విధులకు వెళ్లిపోయారు. స్కూలుకు వెళ్లి తమ్ముడికి లంచ్ బాక్స్ ఇవ్వాలని చెప్పారు. అయితే ఉదయం 10:30 గంటల సమయంలో పక్క అపార్ట్‌మెంట్లోని బాలుడు గోడదూకి సహస్ర కుటుంబం ఉంటున్న అపార్ట్‌మెంట్లోకి వచ్చాడు. పెంట్‌హౌజ్‌లో ఎవరూ లేరనుకుని చోరీకి ప్రయత్నించాడు. కానీ ఇంట్లోనే ఉన్న సహస్ర అతడిని గమనించి అడ్డుకుంది. ఆందోళన చెందిన బాలుడు.. సహస్ర ఈ విషయాన్ని అందరికీ చెబుతుందనే భయంతో ఆమె నోరు నొక్కి, తన వెంట తీసుకెళ్లిన కత్తితో కడుపులో, గొంతుపై ఇష్టం వచ్చినట్టు పొడిచాడు. తర్వాత గోడదూకి తమ అపార్ట్‌మెంట్లోకి పారిపోయాడు. మరోవైపు తన కుమారుడికి లంచ్ బాక్స్ రాలేదని మధ్యాహ్నం 12 గంటలకు కృష్ణకు స్కూల్ నుంచి ఫోన్ రావడంతో.. వెంటనే ఇంటికి వెళ్లారు. అప్పటికే సహస్ర రక్తపు మడుగులో చనిపోయి కనిపించింది.

చిన్న క్లూ ఆధారంగా ముందుకువెళ్లి..

విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలన చేయించారు. హత్య ఉదయం 10-10.30 గంటల మధ్య జరిగినట్టు ఫోరెన్సిక్ నిపుణులు తేల్చారు. అయితే ఎలాంటి ఆధారాలు దొరకలేదు. బయటివాళ్లు వచ్చిన ఆనవాళ్లేవీ లేవు. అదే అపార్ట్‌మెంట్‌లోని వారిని, చుట్టుపక్కల వారిని విచారించినా ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదు. ఘటన జరిగిన రోజున వర్షం పడటంతో జాగిలాలు వాసన పసిగట్టలేకపోయాయని తెలిసింది. అయితే సహస్ర హత్య జరిగిన రోజు చుట్టుపక్కల వారిని పోలీసులు ప్రశ్నిస్తున్న సమయంలో.. నిందితుడైన బాలుడు సుమారు 10:30 సమయంలో డాడీ, డాడీ అంటూ సహస్ర పెద్దగా అరవడం వినిపించిందని చెప్పినట్టు సమాచారం. ఆ బాలుడు తరచూ వచ్చి పోలీసులు ఏం చేస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారన్నది గమనిస్తుండటాన్ని గుర్తించినట్టు తెలిసింది. ఇక ఆ బాలుడు, సహస్ర తమ్ముడు స్నేహితులని.. అప్పుడప్పుడూ గోడదూకి వారి ఇంటికి వెళ్లేవాడని పక్క అపార్ట్‌మెంట్లోని ఓ వ్యక్తి పేర్కొన్నట్టు సమాచారం. బాలిక హత్య జరిగినట్టు నిపుణులు చెప్పిన సమయం, సహస్ర అరిచిందంటూ బాలుడు చెప్పిన సమయం సరిపోలడంతో.. బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా హత్య చేసిన విషయాన్ని అంగీకరించినట్టు తెలిసింది. దీనితో ఆ రోజు ఏం జరిగిందనేది తేల్చేందుకు పోలీసులు ఘటనా స్థలంలో నిందితుడైన బాలుడితో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసినట్టు సమాచారం.

ఇంట్లో గొడవలు.. డబ్బుల కోసం చోరీ యత్నం..

నిందితుడైన బాలుడికి తల్లిదండ్రులతోపాటు ఇద్దరు అక్కలు ఉన్నట్టు తెలిసింది. అతను, రెండో అక్క ఇద్దరూ 10వ తరగతి చదువుతున్నట్టు సమాచారం. తండ్రి మద్యానికి బానిస కావడంతో తల్లి పనికి వెళుతూ కుటుంబాన్ని పోషిస్తున్నట్టు తెలిసింది. ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో గొడవలు జరిగేవని.. ఆ వాతావరణంతో మానసికంగా ఒత్తిడికి లోనైన బాలుడు డబ్బు కోసం ఏదైనా చేయాలనే నిర్ణయానికి వచ్చాడని సమాచారం. ఈ క్రమంలో కృష్ణ, రేణుక దంపతుల ఇంట్లో డబ్బులు ఉన్నాయని తెలుసుకున్న నిందితుడు.. చోరీ కోసం ప్రణాళిక వేసుకుని, ఓ కాగితంపై రాసుకున్నట్టు తెలిసింది. ఆ కాగితాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. "ఇంట్లోకి వెళ్లగానే ముందుగా తాళం పగలగొట్టాలి, తర్వాత ఇంట్లో ఉన్న డబ్బును తీసుకోవాలి. తర్వాత ఇంట్లో గ్యాస్ సిలిండర్ పైపు కట్ చేయాలి. గ్యాస్ లీక్ చేయాలి. బయటికి వచ్చి గడియపెట్టి వెళ్లిపోవాలి. గ్యాస్ మొత్తం లీకై అగ్నిప్రమాదం జరగాలి. దీంతో మిషన్ డన్" అని రాసుకున్నట్టు సమాచారం. కానీ బాలుడు చోరీకి వెళ్లిన సమయంలో సహస్ర గుర్తించడంతో ఆమెను హత్యచేసి పారిపోయినట్టు తెలిసింది.

వైసీపీపై 'ఇండీ' కన్ను!

» ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు కోసం ఆ పార్టీ ఎంపీలతో మంతనాలు
» సుబ్బారెడ్డితో మాట్లాడిన జైరాం రమేశ్
» రఘునాథరెడ్డిని పిలిపించుకున్న ఖర్గే
» జగన్‌తోనూ టచ్‌లోకి కాంగ్రెస్ నేతలు

న్యూఢిల్లీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో టీడీపీ మద్దతు ఆశించిన 'ఇండీ' కూటమి నేతలపై ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నీళ్లు గుమ్మరించారు. ఆయన శుక్రవారం ఢిల్లీలో రాగానే ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను కలుసుకుని పూర్తి మద్దతు ప్రకటించడం.. లోక్‌సభ ఎన్నికలకు ముందు నుంచే టీడీపీ.. ఎన్డీఏలో కొనసాగుతోందని స్పష్టం చేయడంతో 'ఇండీ' వర్గాలు ఆశలు వదులుకున్నాయి. చంద్రబాబును ఎలాగైనా కలుసుకుని సహకారం కోరాలని భావించిన ప్రతిపక్ష కూటమి నేతలు మౌనంగా ఉండిపోయారు. ఆయన వైఖరిని ముందుగానే ఊహించిన కాంగ్రెస్ నేతలు వైసీపీపై కన్నేశారు. ఆ పార్టీ ఎంపీలను నిరంతరం సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. వారు కూడా స్పందిస్తున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డితో కీలక చర్చలు జరిపారు. తమ చేతుల్లో ఏమీ లేదని, తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవాలని సుబ్బారెడ్డి తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఖర్గే ఆహ్వానం మేరకు మరో ఎంపీ రఘునాథరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి చర్చించారు. ఖర్గే తనను ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వాలని కోరలేదని ఆయన అన్నప్పటికీ.. వారిద్దరి మధ్యా అదే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగినట్లు సమాచారం. ఎంపీలతో పాటు ఏకంగా జగన్‌తోనే కాంగ్రెస్ నేతలు ఆయన సన్నిహితుల ద్వారా సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. వైసీపీలో ఇప్పటికే నలుగురు రాజ్యసభ ఎంపీలు పార్టీని వీడడం, మరికొంత మంది గుడ్‌బై చెబుతారని ప్రచారం జరుగుతుండడం తెలిసిందే. ఈ పరిణామాలే గాక లిక్కర్ కేసులో వైసీపీ లోక్‌సభా పక్ష నేత మిథున్‌రెడ్డి జైలుకెళ్లడం.. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరో ఎంపీ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దయ్యే అవకాశాలు కనిపిస్తుండడంతో పార్లమెంటులో వైసీపీ పూర్తిగా అస్తిత్వం కోల్పోయినట్లు స్పష్టమవుతోంది. దీంతో కాంగ్రెస్ నేతలు ఆ పార్టీ ఎంపీలపై దృష్టి సారించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విప్ లేకపోవడం, సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ జరుగుతుండడంతో వైసీపీ ఎంపీలు కూడా ఇండీ కూటమి అభ్యర్థి వైపు ఆకర్షితులయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు.

బాబును కలవని 'ఇండీ' అభ్యర్థి!

తెలుగు ఆత్మాభిమానం పేరుతో తన మద్దతు కోరుతున్న వారిని ఉద్దేశిస్తూ.. ఓడిపోయే అభ్యర్థిని ఎందుకు నిలబెట్టాలని చంద్రబాబు ప్రశ్నించడం ఇండీ కూటమి నేతలను ఇరుకునపడేసింది. ఆయనతో మిత్రపక్షాల నేతల ద్వారా మాట్లాడించేందుకు చేసిన ప్రయత్నాలు కూడా విఫలమైనట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలతో 'ఇండీ' కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి.. చంద్రబాబును కలిసే ప్రయత్నించలేదని కూటమి నేతలు చెప్పారు.

రేవంత్‌రెడ్డి కేసులో హైకోర్టుకు ఫిర్యాదుదారు క్షమాపణ

» అంగీకరించిన జస్టిస్ మౌషమీ భట్టాచార్య

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డిపై ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో తీర్పు ఇచ్చినందుకు జస్టిస్ మౌషమీ భట్టాచార్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఫిర్యాదుదారు ఎన్. పెద్దిరాజు, ఆయన న్యాయవాదులు ఇద్దరు హైకోర్టుకు క్షమాపణ తెలియజేశారు. సదరు క్షమాపణలను జస్టిస్ మౌషమీ భట్టాచార్య శుక్రవారం అంగీకరించారు. ముగ్గురు ధిక్కరణదారులు చెప్పిన క్షమాపణలను తాను అంగీకరిస్తున్నానని.. తన వైపు నుంచి విచారణను ముగిస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కులం పేరుతో దూషించారని ఎన్. పెద్దిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. సదరు కేసు కొట్టేయాలని రేవంత్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మౌషమీ భట్టాచార్య ధర్మాసనం విచారణ చేపట్టి రేవంత్‌రెడ్డిపై కేసు కొట్టేస్తూ తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పు ఇవ్వడానికి ముందు ఫిర్యాదుదారు పెద్దిరాజు సుప్రీంకోర్టులో బదిలీ పిటిషన్ దాఖలు చేసి.. కేసును వేరే రాష్ట్ర హైకోర్టుకు బదిలీ చేయాలని కోరారు. సదరు పిటిషన్‌లో హైకోర్టు జడ్జిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసి.. ఫిర్యాదుదారు పెద్దరాజును, ఆయన న్యాయవాదులను కోర్టు ధిక్కరణదారులుగా పేర్కొంది. హైకోర్టు జడ్జికి క్షమాపణలు తెలియజేయాలని ఆదేశాలు జారీ చేసింది.

కలుషిత నీరు తాగి 11మంది విద్యార్థుల అస్వస్థత

భూపాలపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో కలుషిత నీరు తాగి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరందరూ స్థానిక వంద పడకల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ ఘటన జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం అల్పాహారం చేసిన విద్యార్థులు ఆర్వో ప్లాంట్ వద్దకు వెళ్లి నీటిని తాగారు. అందులో ఒక విద్యార్థి నీళ్లు వాసన వస్తున్నాయని అక్కడున్న ఉపాధ్యాయుడికి తెలియజేశాడు. వెంటనే సదరు ఉపాధ్యాయుడు ఆ నీటిని పరీక్షించి.. కలుషితమయ్యాయని, ఎవరూ తాగవద్దని విద్యార్థులను హెచ్చరించారు. అనంతరం ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. వారిద్దరూ కలిసి విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు.



రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో మూత పడ్డ దుకాణాలు

మార్వాడీలకు వ్యతిరేకంగా పలు చోట్ల ర్యాలీలు

» ఓయూ జేఏసీ నేతల ముందస్తు అరెస్టు

» హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై రాస్తారోకో

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్‌లో దళితుడిపై మార్వాడీల దాడిని ఖండిస్తూ ఓయూ జేఏసీ, టీజీ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రంలోని పలు పట్టణాలు, మండల కేంద్రాల్లో వ్యాపారులు ప్రదర్శనలు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా గురువారం రాత్రి ఓయూలోని ఎన్ఆర్ఎస్ హాస్టల్‌లో ఉన్న ఓయూ జేఏసీ చైర్మన్ తిరుపతి, నాయకుడు వేణుగోపాల్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసిన పోలీసులు.. జేఏసీ, విద్యార్థి నేతలను లోపలికెళ్లేందుకు అనుమతించలేదు. ఆర్ట్స్ కాలేజీ వద్ద మీడియాతో మాట్లాడుతున్న విద్యార్థి నేతలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ హబ్సిగూడలో నవకార్ గోల్డ్‌షాప్ వద్ద టైరు తగులబెట్టారు. ఈ ఘటనలో జేఏసీ వైస్‌చైర్మన్ పాపారావు సహా 8 మందిని అరెస్టు చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో బంద్ జరిపారు. ర్యాలీకి అనుమతివ్వక పోవడంతో ఆమనగల్లు వ్యాపారులు తమ దుకాణాల వద్దే నిరసన తెలిపారు. మార్వాడీల దుకాణాల వద్ద పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. కడ్తాల్ మండల కేంద్ర వ్యాపారులు.. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై రాస్తారోకో చేసి.. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి నిరసన తెలిపారు. దీంతో ఆందోళనకారులను అరెస్టు చేసిన పోలీసులు తర్వాత సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా ర్యాలీ చేపట్టిన వ్యాపారులను పోలీసులు అరెస్టు చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో బస్టాండ్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రాల్లో వర్తక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పలు చోట్ల కిరాణా, వర్తక, స్వర్ణ కారులు, నాయి బ్రాహ్మణులతోపాటు ఇతర వ్యాపారులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో శాస్త్రవేత్త

» రూ. 12.5 లక్షలు కొట్టేసిన కేటుగాళ్లు

పటాన్‌చెరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ శాస్త్రవేత్తను బెదిరించి, ఏకంగా రూ.12.5 లక్షలు కాజేశారు. ఆధార్ ఆధారంగా తీసుకున్న సిమ్ కార్డుతో పబ్లిక్ హరాస్‌మెంట్ చేస్తున్నారని బెదిరించి ఈ మోసానికి పాల్పడ్డారు. పటాన్‌చెరు మండలంలోని పోచారం గ్రామం గణపతిగూడెంలో నివాసం ఉంటున్న ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త లక్ష్మణ్‌కు జూన్ 27న ముంబై నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. "మీ ఆధార్ నంబర్‌తో తీసుకున్న సిమ్ నుంచి పబ్లిక్ హరాస్‌మెంట్ మెసేజ్‌లు వస్తున్నాయి. మీపై 17 కేసులు నమోదయ్యాయి" అంటూ బెదిరించాడు. కొద్దిసేపటి తర్వాత పోలీసు దుస్తుల్లో ఉన్న మరో వ్యక్తి వీడియో కాల్ చేసి "మీరు అక్రమంగా బ్యాంకు ఖాతా తెరిచి లావాదేవీలు నిర్వహిస్తున్నారు" అని భయపెట్టాడు. ఈ కేసుల నుంచి బయటపడాలంటే రూ. 42 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో భయపడిన శాస్త్రవేత్త, గత నెల 24న రెండు దఫాలుగా రూ.10 లక్షలు, ఈ నెల 5న రూ. 2.5 లక్షలు సైబర్ నేరగాళ్లు చెప్పిన బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేశారు. మరింత డబ్బు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన లక్ష్మణ్ పోలీసులను ఆశ్రయించారు.

ఉపాధ్యాయులకు నగదు రహిత వైద్య సేవలు అందించాలి

» సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్

బర్కత్‌పుర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు నగదు రహిత వైద్య సేవలు అందించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్(ఎస్టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు, ప్రధాన కార్యదర్శి యు.పోచయ్య కోరారు. ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, జీవో 25ను సవరించి ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు బెనిఫిట్‌లను వెంటనే విడుదల చేయాలని, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 420 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీసును క్రమబద్ధీకరించాలన్నారు. 317 జీవో ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులందరినీ వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నేతలు పడకంటి అజయ్‌కుమార్, యూనస్, మనోహర్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాదాబైనామా లెక్క తేలేనా..!

» పెండింగ్‌లో 9.26 లక్షల దరఖాస్తులు

» 26న హైకోర్టులో కేసు విచారణ..

» 12 ఏళ్లు అనుభవంలో ఉన్న వారిని ఎలా గుర్తిస్తారనే దానిపై చర్చ

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సాదాబైనామా దరఖాస్తులకు సర్కారు ఎప్పుడు పరిష్కారం చూపుతుందా అని లక్షల మంది దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. 26న సాదాబైనామా కేసు హైకోర్టులో విచారణకు వస్తున్న నేపథ్యంలో.. దరఖాస్తుల పరిష్కారానికి అనుమతి వస్తే ఎన్ని పరిగణనలోకి తీసుకుంటారు. పరిష్కారానికి ఎలాంటి విధివిధానాలు పాటిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారికంగా 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 2020 అక్టోబరు 29న పాత ఆర్వోఆర్ చట్టం రద్దయి కొత్త చట్టం (ధరణి) అమల్లోకి వచ్చింది. దీనికి కొద్దిరోజుల ముందే 2020 అక్టోబరు 12న అప్పటి ప్రభుత్వం జీవో నంబరు 122 జారీ చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారం.. 2014 జూన్ 2కి ముందు జరిగిన సాదాబైనామా ఒప్పందాలను పరిగణనలోకి తీసుకుంటామని.. అలాంటి వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీనిపై నిర్మల్ రైతు షిండే దేవాదాస్ హైకోర్టులోపిల్ దాఖలు చేశారు. దీంతో స్టే విధించడంతో ఎటూ తేలకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూభారతి చట్టాన్ని తెచ్చింది. ఆ చట్టంలో సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరిస్తామని స్పష్టం చేసింది. భూసమస్యలపై నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో కొత్తగా 2,42,365 దరఖాస్తులు వచ్చాయి. ఇవి గతంలో దరఖాస్తు చేసుకున్న వారివేనా లేక కొత్తగా వచ్చినవా అనే కోణంలో అధికారులు ఇప్పటికే వివరాలు సేకరించారు. కొత్త వాటిని తిరస్కరించి.. ఆన్‌లైన్‌లో ఉన్న వాటినే ఆమోదిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల్లో ధరణికి ముందున్న పాత చట్టం రద్దయ్యే సమయానికి వచ్చినవి 2.26 లక్షలు. 2020 అక్టోబరు 29న పాత చట్టం రద్దయి ధరణి అమల్లోకి వచ్చాక వచ్చిన దరఖాస్తులే సుమారు 7 లక్షలు. అయితే అక్టోబరు 28 కటాఫ్ తేదీగా ఉన్నందున అప్పటివరకు వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిష్కరించాలని అధికారులు భావిస్తున్నారు. కోర్టు స్టే అడ్డు ఉండటంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో స్టే ఎత్తేయాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వంమధ్యంతర పిటిషన్ దాఖలు చేసింది..

12 ఏళ్ల పాటు ఆధీనంలో ఉంటే హక్కులు..

భూభారతి చట్టం సెక్షన్ 6 ప్రకారం 2014 జూన్ 2కి ముందు 12 ఏళ్ల పాటు భూమి తమ ఆధీనంలో ఉన్నట్లు ఆధారాలు చూపిన చిన్న, సన్నకారు రైతులకు సాదాబైనామా క్రమబద్ధీకరణకు అవకాశం ఇవ్వనున్నారు. రిజిస్ట్రేషన్ చట్టానికి భిన్నంగా సాదాబైనామా దరఖాస్తుల సమస్యను పరిష్కరించాల్సి ఉన్నందున ఈ నియమాన్ని పెట్టాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. అయితే సాగుదారులను గుర్తించేందుకు పహాణీలో సాగు కాలంలో ఉన్న వివరాలతోపాటు క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారుల పంచనామా నివేదిక, భూమిపై తీసుకున్న వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ వంటి వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఉన్నది గుప్పెడు.. సరిపడా ఎప్పుడు?

యూరియా కొరతతో రైతుల్లో ఆగ్రహజ్వాల.. కొనసాగుతున్న ధర్నాలు, రాస్తారోకోలు

» స్వీయ నిర్బంధాలతో అన్నదాతల నిరసన

» సర్కారు అసమర్థత వల్లే కొరత: కేటీఆర్

» బీఆర్ఎస్‌తో కలిసి బీజేపీ కుట్ర: సీతక్క

» వారంలో 50వేల టన్నులు: రఘునందన్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



ఆదిలాబాద్‌లో యూరియా కోసం క్యూ లైన్‌లో వేచి చూస్తున్న రైతులు

పంటల అవసరాలకు దోసిళ్లకొద్దీ డిమాండ్ ఉంటే అందుబాటులో ఉన్న యూరియా పిడికెడంత మాత్రమే! ఫలితంగా చాంతాడంత క్యూలో గంటల కొద్దీ నిల్చున్నా సరుకు దొరుకుతుందన్న నమ్మకం ఉండటం లేదు. అదృష్టంకొద్దీ దొరికినా అదీ అరకొరనే. ఆ ఒకటి, రెండు బస్తాలతో పంటల అవసరాలేం తీరుతాయి? ఫలితంగా రైతుల్లో అదే కన్నెర్ర.. ఆగ్రహజ్వాల! ఎరువుల కేంద్రాల వద్దే నిరసనలు.. రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు కొనసాగుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం యూరియా కోసం మహబూబాబాద్-తొర్రూరు ప్రధాన రహదారిపై రైతులు రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. నాలుగు రోజుల క్రితమే టోకెన్లు తీసుకున్న రైతులు ఉదయం నుంచి క్యూలో నిల్చునా యూరియా ఇవ్వకపోవడంతో ఆందోళనకు దిగారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరి శివారు లక్ష్మాతండా రైతు భూక్య గోప.. పురుగుల మందు డబ్బాతో ఆందోళన కార్యక్రమానికి రాగా పోలీసులు అతడి నుంచి దాన్ని లాక్కున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరులో యూరియా దొరకనందుకు నిరసనగా రైతులు మార్కెట్ కమిటీ కార్యాలయంలో స్వీయ నిర్బంధం చేసుకున్నారు. కామారెడ్డి జిల్లా బీబీపేటలోనూ క్యూలైన్‌లో చెప్పులు పెట్టారు.

అసమర్థులు రాజ్యమేలడంతోనే..

పాలనతెలియని అసమర్థులు రాజ్యమేలుతుండటంతోనే వ్యవసాయరంగం సంక్షోభంలో పడిందని, తెలంగాణ రైతన్నలను కాంగ్రెస్ అరిగోస పెడుతోందని.. ఆ పార్టీ పతనం ప్రారంభమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ అసమర్థ విధానాలవల్లే రాష్ట్రంలో యూరియా సంక్షోభం ఏర్పడిందని శుక్రవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. బూతులు మాట్లాడడం తప్ప చేతలు లేని ఢిల్లీపార్టీల నాయకులకు, విజన్ ఉన్న కేసీఆర్ పకడ్బందీ పాలనకు మధ్యతేడా ఏమిటన్నది తెలంగాణ సమాజానికి ఇప్పుడు అర్థమైందని పేర్కొన్నారు. కాగా సాగు అవసరాలకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ నాయకులు కొత్తగూడెం జిల్లా ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

బీఆర్ఎస్‌తో కలిసి బీజేపీ కుట్ర

రైతులకు వ్యతిరేకంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తూ.. రాష్ట్రానికి యూరియాను కేటాయించకుండా, బీఆర్ఎస్ పార్టీతో కలిసి కుట్రలు చేస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. రైతులు సంతోషంగా ఉంటే బీజేపీ, బీఆర్ఎస్ ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో ఆమె మాట్లాడారు. రాష్ట్రానికి నిధులు, యూరియా రాకుండా రెండు పార్టీలు కలిసి కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని, సకాలంలో అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రైతుల అవసరాలకు సరిపడా యూరియాను కేటాయించాలని రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఎంపీలు పార్లమెంట్‌లో, పార్లమెంట్ బయట డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణా లోపం వల్లే

రాష్ట్రానికి వారం రోజుల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అవుతుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. సిద్దిపేటలో ఆయన మాట్లాడారు. యూరియా విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తప్పుడు ప్రచారాలతో రైతులను గందరగోళానికి గురిచేస్తున్నాయని మండిపడ్డారు. వారి మాటలు విని రైతులు ఆందోళన పడొద్దని సూచించారు. యూరియా కొరతకు రాష్ట్ర ప్రభుత్వం అడ్మినిస్ట్రేటివ్ లోపమే కారణమన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు యూరియా మంచిగా వచ్చిందని. రేవంత్ వస్తే యూరియా రావడంలేదని.. యూరియా ఇస్తేనే ఓట్లేస్తాం అంటూ రాజకీయాలు మాట్లాడటం సరికాదని, కేసీఆర్ ఉన్నప్పుడు యూరియా ఇచ్చింది మోదీయేనని, రేవంత్‌కు యూరియా ఇచ్చేది కూడా మోదీయేనని పేర్కొన్నారు.



ఏసీబీ అధికారులకు పట్టుబడిన వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ రాజేశ్; పక్కన డాక్యుమెంట్ రైటర్ రమేశ్

ఏసీబీకి వలకు వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్

70 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

ఆదిలాబాద్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కూడా..

వనస్థలిపురం/ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్ర జ్యోతి): లంచం డిమాండ్ చేసి నగదు తీసుకుంటుండగా ఓ రిజిస్ట్రార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌లను వేర్వేరుగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లోని 200 గజాల ప్లాటు రిజిస్ట్రేషన్ నిమిత్తం సంబంధిత వ్యక్తులు వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ రాజేశ్‌ను సంప్రదించగా, రూ.లక్ష డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు అందిందని రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు. రూ.70 వేలను శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ రమేశ్‌కు అందజేస్తుండగా తాము అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. సబ్ రిజిస్ట్రార్ సూచన మేరకే తాను డబ్బులు తీసుకున్నట్లు రమేశ్ తెలిపాడని పేర్కొన్నారు. తగిన సాక్ష్యాధారాలతో ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. మరోవైపు.. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన గౌసియా బేగం తన పేరున ఉన్న ఇంటిని భర్త మన్సూర్ ఖాన్ పఠాన్ పేరిట జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శుక్రవారం గిఫ్ట్ డీడ్ చేయించారు. అంతకుముందే జాయిట్ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ రెడ్డి రూ.5 వేలు ఇవ్వాలని దంపతులను డిమాండ్ చేశారు. దీంతో వారు ఏసీబీని ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు జాయిట్ సబ్ రిజిస్ట్రార్ 5వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఏసీబీ డీఎస్పీ మధు తెలిపారు.



ఐటీ రిటర్నుల దాఖలులో రెండో స్థానంలో తెలంగాణ!

రూ.12 లక్షల నుంచి 50 లక్షల మధ్య విభాగంలో 19.8 శాతం మంది ఫైలింగ్

20.6 శాతంతో కర్ణాటకకు తొలి స్థానం

టాప్-10లో గుజరాత్‌కు దక్కని చోటు

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నుల దాఖలులో తెలంగాణ తన నిబద్ధతను చాటుకుంది. రాష్ట్రంలోని మధ్య తరగతి ప్రజలు తమ వార్షికాదాయాలను ప్రకటించడంతో పాటు నిజాయతీగా పన్ను రిటర్నులను దాఖలు చేస్తున్నట్లు వెల్లడైంది. రూ.12 లక్షల నుంచి రూ.50 లక్షల మధ్య వార్షికాదాయం గల పన్ను చెల్లింపుదారుల్లో కర్ణాటక తర్వాత తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని 19.8 శాతం వ్యాపారులు, వివిధ వృత్తుల నిపుణులు తమ ఆదాయ వివరాలను వెల్లడించారు. తొలిస్థానంలో ఉన్న కర్ణాటక నుంచి 20.6 శాతం మంది పన్ను రిటర్నులను దాఖలు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల నుంచి దాఖలైన ఆదాయ పన్ను రిటర్నుల డేటా ఇటీవల వెలుగులోకి వచ్చింది. రూ.12 లక్షల నుంచి 50 లక్షల మధ్య వార్షికాదాయం విభాగంలో కర్ణాటక, తెలంగాణ తర్వాతి స్థానాల్లో ఝార్ఖండ్ (19.5%), తమిళనాడు (18.8%), ఢిల్లీ (17.6%), పాండిచ్చేరి(17.4%), ఒడిశా (16.8%), మహారాష్ట్ర (16.2%), ఆంధ్రప్రదేశ్ (15.9%), ఉత్తరాఖండ్ (14.2%) నిలిచాయి. ఈ విభాగం పన్ను చెల్లింపుదారుల్లో జాతీయ సగటు 14.1 శాతం కాగా.. తెలంగాణ అంతకంటే ఎక్కువగా 19.8 శాతంతో ఉండడం విశేషం. అయితే సంపన్న రాష్ట్రంగా చెప్పుకొంటున్న గుజరాత్ (7%) తొలి పది స్థానాల్లో ఉండకపోవడం గమనార్హం. ఇటు రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల మధ్య వార్షికాదాయం గల విభాగంలోనూ గుజరాత్ తొలి 10 స్థానాల్లో చోటు సంపాదించలేకపోయింది. దేశవ్యాప్తంగా పన్ను రిటర్నులను దాఖలు చేసిన గ్రూపుల్లో రూ.2.5 లక్షల నుంచి రూ.7.5 లక్షల మధ్య వార్షికాదాయం గల వర్గమే మొదటి స్థానంలో ఉంది. అంటే.. దేశంలోని మొత్తం రిటర్నులు దాఖలు చేసిన వారిలో సగానికంటే ఎక్కువ వీరే ఉన్నారు. రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల మధ్య వార్షికాదాయం గల విభాగం రిటర్నుల దాఖలులో 1.4 లక్షల మందితో మహారాష్ట్ర దేశంలోనే తొలి స్థానాన్ని ఆక్రమించింది. కర్ణాటక రెండో స్థానంలో, తమిళనాడు మూడో స్థానంలో ఉండగా.. 60.8 వేల మందితో తెలంగాణ ఐదో స్థానంలో, 26.7 వేల మందితో ఆంధ్రప్రదేశ్ పదో స్థానంలో ఉన్నాయి.

రామగుండం నడిస్తేనే..



సాంకేతిక సమస్యలు పరిష్కరించి యూరియా ఉత్పత్తికి చర్యలు

» నేడు సచివాలయానికి రావాలని ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్‌కు పిలుపు

» కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డితో తుమ్మల చర్చలు

» 10 రోజులుగా పనిచేయని కర్మాగారం

» యూరియా సరఫరాపై తీవ్ర ప్రభావం

» ఉత్పత్తి ప్రారంభానికి మరో 10 రోజులు

» ఆగస్టు వరకు ఇచ్చిన ప్రణాళికలో 62,473 టన్నుల యూరియా కోత

» ఖరీఫ్‌కు ముందే రాష్ట్రం వద్ద 2.70 లక్షల మెట్రిక్ టన్నుల స్టాకు

» అయినా కొరత అంటూ రైతులను రాష్ట్ర మంత్రులు భయపెట్టారు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, కోల్‌సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత సమస్యను అధిగమించటానికి రాష్ట్ర ప్రభుత్వం స్థానిక వనరులపై దృష్టి పెట్టింది. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి వీలైనంత త్వరగా యూరియా తీసుకునే అంశంపై దృష్టి పెట్టింది. సాంకేతిక సమస్యలతో యూరియా ఉత్పత్తి నిలిచిపోయిన ఆర్ఎఫ్‌సీఎల్‌లో మరమ్మతులు పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభిస్తే... రైతులకు యూరియా అందించవచ్చుననే అంశంపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం కసరత్తు చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ ఎండీని శనివారం సెక్రటేరియట్‌కు రావాలని సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారం ద్వారా ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 1,69,325 టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 1,06,852 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసింది. ఇంకా 62,473 టన్నుల యూరియా ఇవ్వలేదు. 14న అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి నిలిచిపోయింది. మరమ్మతులు పూర్తయి.. ఉత్పత్తి ప్రారంభం కావడానికి 10రోజులు పట్టే అవకాశం ఉంది. మరమ్మతుల కోసం డెన్మార్క్ నుంచి ఇంజనీర్ల బృందం వచ్చి ఆ పనుల్లో మునిగింది. మరోవైపు.. యూరియా కొరతపై రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో తుమ్మల శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. రామగుండం కర్మాగారంలో సాంకేతిక సమస్యలు పరిష్కరించి, యూరియా ఉత్పత్తి ప్రారంభించి... ఈనెల రాష్ట్రానికి రావాల్సిన 63 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చేలా చర్యలు తీసుకోవాలని బండి సంజయ్‌కు విజ్ఞప్తిచేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన యూరియా సరఫరా తక్షణమే చేసేలా చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి రావాల్సిన కోటాను వెంటనే పంపేలా ఏర్పాటుచేస్తామని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

డిమాండ్ ఎక్కువున్న జిల్లాలకు యూరియా తరలించాలి: తుమ్మల

డిమాండ్ తక్కువగా ఉన్న జిల్లాల నుంచి ఎక్కువగా ఉన్న జిల్లాలకు యూరియా తరలించి, రైతులకు అందుబాటులోకి తీసుకరావాలని అధికారును తుమ్మల ఆదేశించారు. ఈ విషయంలో కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ, రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. సచివాలయంలో మంత్రి తుమ్మల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రాలకు యూరియా కేటాయింపులు, సరఫరా పూర్తిగా కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వశాఖ పరిధిలో ఉంటాయని, కాని ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయని విమర్శించారు. ప్రైవేటు డీలర్ల వద్ద ఉన్న యూరియా నిల్వలను మన దేశానికి దిగుమతి ద్వారా రావాల్సిన యూరియా సకాలంలో రాకపోవడం, దేశీయంగా యూరియా ఉత్పత్తి అనుకున్న స్థాయిలో లేకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తాయని, వీటిన్నింటిని పరిష్కరించడానికి కేంద్రాన్ని సంప్రదిస్తున్నట్లు తుమ్మల తెలిపారు.

ఆ బాధ్యత రాష్ట్ర సర్కారుదే: కిషన్‌రెడ్డి

యూరియా బ్లాక్‌మార్కెట్‌కు తరలకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ దందా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్ సీజన్ ఆరంభం నాటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద 2.70లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నా, యూరియా కొరత అంటూ మంత్రులు రైతులను భయాందోళనలకు గురిచేశారని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

హత్యలు కాదు ఆత్మహత్యలే !

» మియాపూర్‌లో కుటుంబం మరణంపై వీడిన మిస్టరీ

» పెరుగన్నంలో విషం కలుపుకుని తిని బలవన్మరణం

» పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పోలీసుల నిర్ధారణ

మియాపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైదరాబాద్, మియాపూర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి మరణం కేసులో మిస్టరీ వీడింది. ఆర్థిక ఇబ్బందులు తాళలేక పెరుగన్నంలో విషం కలుపుకొని తిని కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. కుటుంబ పెద్ద లక్షప్ప(60), వెంకటమ్మ(55) దంపతులతోపాటు వారి రెండో కుమార్తె కవిత, అల్లుడు అనిల్, కవిత దంపతుల కుమారుడు యువాన్ష్(2).. మియాపూర్‌లోని మక్తమహబూబ్‌పేటలోని తమ ఇంట్లో విగతజీవులై గురువారం కనిపించిన సంగతి తెలిసిందే. కుటుంబంలో ఒకేసారి ఐదుగురు మరణించడంతో ఎవరైనా హత్య చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే, వీరంతా విషాహారం తిని ఆత్మహత్య చేసుకున్నట్టు పోస్టుమార్టంలో తేలడంతో.. హత్యలు కాదు ఆత్మహత్యలేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం లక్షప్ప సహా ఐదుగురు పెరుగన్నంలో విషం కలుపుకొని తిన్నట్టు తేలిందని పోలీసులు తెలిపారు. కాగా, అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా ఘటన జరిగిన ఇంటి చుట్టుపక్కల సీసీ కెమెరా ఫుటేజీలను జల్లెడ పట్టారు. అనుమానించే విధంగా ఎలాంటి సమాచారం లభ్యం కాకపోవడంతో ఐదుగురు బలవన్మరణానికి పాల్పడ్డారనే నిర్ధారణకు వచ్చారు. విలేకరుల సమావేశం నిర్వహించి పోలీసులు కేసు వివరాలను వెల్లడించనున్నారు.

కిడ్నీ మార్పిడి కేసులో విశాఖ వైద్యుడి అరెస్టు

హైదరాబాద్/ విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ మార్పిడి కేసులో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్నంలోని మత్తు (అనస్థీషియా) వైద్యుడు డాక్టర్ వెంకటరామ సంతోష్ నాయుడిని తెలంగాణ సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. దీంతో గత జనవరిలో సరూర్‌నగర్ సమీప అలకనంద ఆస్పత్రిలో బయటపడ్డ కిడ్నీ మార్పిడి కుంభకోణంలో ఇప్పటి వరకు అరెస్టయిన వారి సంఖ్య 20 మందికి చేరుకుంది. ఈ కిడ్నీ మార్పిడి కుంభకోణంలో ప్రధాన దళారి పవన్ కూడా విశాఖ వాసే. కిడ్నీ ఆపరేషన్ ఉన్నప్పుడు డాక్టర్ సంతోష్‌ను పిలిపించి.. ప్రతి ఆపరేషన్‌కు సంతోష్‌కు రూ.2.5 లక్షలు చెల్లించే వాడని తమ విచారణలో తేలిందని సీఐడీ అదనపు డీజీ చారుసిన్హా ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని అలకనంద, జననీ, అరుణ ఆస్పత్రుల్లో డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అవినాష్.. కిడ్నీ దాతల్ని సిద్ధం చేయగానే పవన్ ద్వారా సంతోష్‌కు సమాచారం వెళ్లేదని పేర్కొన్నారు. ఇంకా ఈ నెట్‌వర్క్‌లో పరారీలో ఉన్న కొంత మంది కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని చారుసిన్హా చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.